
శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180

నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ

నర్సు హత్య, అత్యాచార ఘటనపై మెజిస్టీరియల్ విచారణ

అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

ఫాస్ట్‌ట్రాక్ కోర్టుద్వారా విచారణకు అవసరమైన చర్యలు ప్రారంభించాలి

10

సంపుటి 29, సంచిక: 79 | సోమవారం | 07-09-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00

నేటి నుంచి అసెంబ్లీ

## వర్షాకాల సమావేశాలు

ఉదయం 10 గంటలకు ప్రశ్నోత్తరాలు

ప్రజాపక్షం/హైదరాబాద్



'వర్షకాల శాసనసభ సమావేశాలు' సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో ప్రశ్నోత్తరాలు, ఆ తర్వాత 'తెలంగాణ సమగ్ర శిక్ష(టిఎస్ఎస్) 2024–25 , పి ఎం స్కూల్ ఫర్ రైసింగ్ ఇండియా 2024–25, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ 2015–16, 2016–17, 2017–18 వార్షిక ఆడిట్ రిపోర్ట్‌ను సభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ వర్షకాల సమావేశాలు ప్రధానంగా వెయ్యిరోజుల కాంగ్రెస్ పాలన,తొమ్మిదనరేళ్ల బిఆర్ఎస్ పాలనకు వేదిక కానున్నాయి. ప్రతిపక్ష పార్టీలు ప్రస్తావించే అంశాలకు ధీటుగా సమాధానం ఇవ్వాలని ప్రభుత్వం సిద్ధమైంది. సమావేశాల సందర్భంగా జరిగే చర్చలలో సభ్యులు ప్రస్తావించే అంశాలకు, ప్రశ్నలకు ప్రభుత్వం తరపున సమాధానం ఇవ్వాలని, అందుకు ఆయా శాఖలు పూర్తి సమాచారంతో సిద్ధమవ్వాలని ఇది వరకే రాష్ట్ర ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. దీనికి సంబంధించిన శాఖల వారీగా ప్రత్యేకంగా అధికారులకు బాధ్యతలను అప్పగించినట్టు అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఎన్నికల హామీల అమలు, 22ఎ, ఫీజు రియంబర్స్‌మెంట్, నీటి ప్రాజెక్ట్‌లు, రైతు సమస్యలు, ఉద్యోగాల భర్తీ, ఉద్యోగుల సమస్యలు, అవినీతి ఆరోపణలు తదితర అంశాలపైన రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ప్రతిపక్ష పార్టీలు సన్నద్ధమవుతుండగా, అందుకు ధీటుగా సమాధానం ఇవ్వడానికి ప్రభుత్వం కూడా సిద్ధమైంది. అయితే ఉద్యోగ, కార్మిక, గుడిసేవాసులకు ఇళ్ల పట్టాల పంపిణీ, ఫీజుల బకాయిల చెల్లింపు, ప్రజలకు మెరుగైన వైద్యం, అభివృద్ధి పనులు, సంక్షేమ తదితర అంశాలను సిపిఐ ప్రస్తావించనుంది. ఈ సారి జరిగే సమావేశాలు వాడివేడిగా జరగనున్న నేపథ్యంలో అధికార పార్టీ అప్రమత్తంగా ఉండాలని తమ సభ్యులకు సూచించగా, ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడానికి ప్రధానప్రతిపక్ష బిఆర్ఎస్ సిద్ధమవుతోంది.




12

లేబర్ కోడ్‌ల రద్దుకు కార్మికులు

# ఏకమై ప్రతిఘటించాలి

- స్వాతంత్ర్య పోరాటంలో ఎఐటియుసిది త్యాగాల చరిత్ర
- యావత్ ప్రపంచానికి మానవహక్కుల పాఠాన్ని నేర్పింది కార్మిక ఉద్యమమే
- ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్
- ప్రతి రంగంలో కార్మిక సంఘాలను బలోపేతం చేయాలి : కూనంనేని సాంబశివరావు
- కార్మిక హక్కుల సాధనకు రణభేరి మోగిస్తాం : చాడ వెంకట్‌రెడ్డి
- కరీంనగర్‌లో ఘనంగా ప్రారంభమైన ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు

ఇస్రో ప్రైవేటీకరణపై

## ఉద్యోగుల ఆందోళన

- అధికారిక సమాచారం ఇవ్వకుండా దొడ్డిదారి ప్రకటనలేమిటని నిలదీత
- ఖాళీల భర్తీ, నియామకాల క్యాలెండర్‌పై వివరణకు డిమాండ్

చైర్మన్ నారాయణన్‌కు తొమ్మిది సంఘాల లేఖ



**న్యూఢిల్లీ :** దేశ భద్రతకు అత్యంత కీలకమైన,ఎంతో ప్రతిష్టాత్మకమైన భారత అంతరిక్ష పరిశోధనాసంస్థ (ఇస్రో) ప్రభుత్వం చేతుల్లోంచి జారిపోయి ప్రైవేటురంగ భాగస్వామ్యంలోకి వెళుతోందన్న వార్తలు ఇస్రోలోని ఉద్యోగ సంఘాలకు తీవ్ర ఆందోళన,ఆవేదన కలిగిస్తున్నాయి. దీంతో ఇస్రోకు చెందిన తొమ్మిది ఉద్యోగ సంఘాలు వివరణ కోరుతూ ఛైర్మన్ వి.నారాయణన్‌కు గడచిన శుక్రవారం (సెప్టెంబరు 4) ఒక లేఖ రాశాయి. ఉద్యోగ సంఘాలతో సంప్రదింపులు చేయకుండా, వారి సలహాలు తీసుకోకుండా, వారికి కనీస సమాచారాన్ని అధికారికంగా చెప్పకుండా ఎలా నిర్ణయం తీసుకుంటారని సంఘాలు ప్రశ్నించాయి. రాబోయేకాలంలో అంటే 2030 నాటికి ఇస్రో ఒక సంవత్సరానికి 50 ప్రయోగాలు చేయగలస్థాయికి చేరుకోవాలన్న లక్ష్య నిర్దేశం ఉందని,ఈ లక్ష్యాలు చేరుకోవాలంటే కేవలం ఇస్రోకు సాధ్యం కాదని, ప్రైవేటు భాగస్వామ్యంతో ఈ బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుందని ఆదివారంనాడు ఎక్స్ వేదికగా ఇన్–స్పేస్ (ఇండియన్ స్పేస్ ప్రమోషన్–అథరైజేషన్ సెంటర్) ఛైర్‌పర్సన్ పవన్ గోయంకా ఒక పోస్టింగ్ పెట్టారు. ప్రైవేటు భాగస్వామ్యంతో తరువాయి 8లో



ప్రజాసమస్యలపై అసెంబ్లీలో గళమెత్తడంలో

## కెసిఆర్ విఫలం

- చేతకాకపోతే తక్షణమే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి
- కొడుకు, అల్లుడి ప్రయోజనాల కోసం ఫామ్‌హౌస్‌కే పరిమితం
- మహాధర్నాలో కాంగ్రెస్ నేతలు విమర్శ
- వెయ్యిరోజుల ప్రజాపాలనలో సంక్షేమం, అభివృద్ధిని క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపు

ప్రజాపక్షం/హైదరాబాద్

మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ తన కొడుకు, అల్లుడి రాజకీయ ప్రయోజనాల కోసం ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని, అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడటంలో ఘోరంగా విఫలమయ్యారని పలువురు కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. కెసిఆర్ చేతకాకపోతే రాజీనామా చేసి తప్పుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల ప్రజాపాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు తరువాయి 8లో

బూతులు తిడుతున్న వారితో చర్చలకు

## అసెంబ్లీకి రావాలా?

- పాలన చేతకాకే బూతుపురాణం అందుకున్న సిఎం రేవంత్‌రెడ్డి
- కాంగ్రెస్ వెయ్యిరోజుల పాలన ఒక డిజాస్టర్, అట్టర్‌ఫ్లాప్
- కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా లక్షలాది మందితో ప్రత్యక్ష ఉద్యమం
- అసెంబ్లీలో జరిగే ప్రతీ చర్చలోనూ పాల్గొనాలి
- ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో జరిగిన బిఆర్ఎస్ఎల్‌పి సమావేశంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రతిపక్షనేత కెసిఆర్ దిశానిర్దేశం



ప్రజాపక్షం/హైదరాబాద్

కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన ఒక డిజాస్టర్, అట్టర్ ఫ్లాప్ అని బిఆర్ఎస్ అధ్యక్షుడు,ప్రధానప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు మండిపడ్డారు. ప్రజా సమస్యలపైన శాసన మండలి, శాసన సభలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని బిఆర్ఎస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు సూచించారు. పాలన చేతకాకనే సీఎం రేవంత్ రెడ్డి అభ్యంతరకరంగా బూతుపురాణం అందుకున్నారని, అలాంటి వారితో చర్చలకు అసెంబ్లీకి రావాలా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి రెండు ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా రాబోయే రోజుల్లో లక్షలాది మందితో ప్రత్యక్ష ఉద్యమానికి సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. కెసిఆర్ అధ్యక్షతన సిద్ధిపేట జిల్లా ఎర్రవల్లిలో బిఆర్ఎస్ఎల్‌పి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు, శాసనమండలిలో ప్రధానప్రతిపక్ష నేత మదుసూదన చారి, శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాష్, బిఆర్ఎస్ఎల్‌పి ఉప నాయకులు తన్నీరు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీలు ఎల్.రమణ, పోచారం శ్రీనివాస్ రెడ్డితో పాటు మాజీ మంత్రులు జి.జగదీశ్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, గంగుల కమలాకర్‌తో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. శాసనసభ,శాసనమండలి వర్షకాల సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రస్తావించాల్సిన అంశాలు, అసెంబ్లీ బయట, లోపల వ్యవహారించాల్సిన తీరుపైన కెసిఆర్ దిశానిర్ధేశం చేశారు. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం కెసిఆర్ పైవిధంగా స్పందించారు. తన చావు కోరుతూ పదేపదే తరువాయి 8లో



## విద్యార్థుల గొంతు వినండి

- లేదంటే 'ఛాత్రోం కీ గూంజ్' తీవ్రతరం
- వ్యవస్థపై వారికి విశ్వాసం సన్నగిల్లడమే నిరసనలకు కారణం: రాహుల్‌గాంధీ

**న్యూఢిల్లీ :** మహారాష్ట్రలో వేలాది మంది విద్యార్థులు వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారని కాంగ్రెస్ నాయకుడు, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. విద్యార్థుల సమస్యలకు కారణం కేవలం ఒక పరీక్ష లేదా నియామక ప్రక్రియ కాదని, మొత్తం వ్యవస్థపై వారికి నమ్మకం దెబ్బతినడమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వం వారి గొంతు విని వెంటనే చర్యలు తీసుకోవాలని, లేకపోతే 'ఛాత్రోం కీ గూంజ్' (విద్యార్థుల ప్రతిధ్వని) మరింత తీవ్రమవుతుందని ఆయన స్పష్టం చేశారు. కేంద్రమైన, రాష్ట్ర ప్రభుత్వమైనా ప్రతి విద్యార్థి బిజెపి పాలన వల్ల బాధించబడుతున్నారన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. 'పేపర్ లీక్‌లు, నిలిచిపోయిన నియామకాలు, భరించలేని విద్యా వ్యయం, హాస్టళ్లలో అమానవీయ పరిస్థితులు, తరువాయి 8లో

ఎల్‌నినో ఉన్నా జాన్తా నై..

## వరి సాగుకే సై

- ఈనెల 5 నాటికి 57.70 లక్షల ఎకరాల్లో నాట్లు
- గత ఏడాదితో పోల్చితే కేవలం 10 శాతమే తగ్గిన విస్తీర్ణం



ప్రజాపక్షం/హైదరాబాద్

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న వర్ష భావ పరిస్థితులు నేపథ్యంలో ఈ ఏడాది వరి సాగుపై తీవ్ర ప్రభావం పడుతుందని అంతా భావించినప్పటికి రైతులు మాత్రం పెద్దగా లెక్కలోకి తీసుకోలేదు.. వర్ష కాలం ప్రారంభంలో వర్షాలు సకాలంలో కురువకపోవడంతో వరిసాగుపై తీవ్ర ప్రభావం చూపినప్పటికీ జూలై చివరి వారంతో పాటు అగస్టులో మొదటి రెండు వారాలు తర్వాత సెప్టెంబర్‌లో నెల ప్రారంభం నుంచి సైతం వర్షాలు తరువాయి 8లో



## ఉద్యోగుల భద్రతే ముఖ్యం

ఇహెచ్‌ఎస్ అమలులో రాజీ లేదు : డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్

గత ప్రభుత్వాలు పదేళ్లుగా పట్టించుకోని ఉద్యోగుల ఆరోగ్య సమస్యకు తమ ప్రజాప్రభుత్వం పరిష్కారం చూపిందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఉద్యోగులు, వారి కుటుంబాల తరువాయి 8లో

హోర్ముజ్‌లో తొమ్మిది నౌకలపై

## పరస్పర దాడులు


అమెరికా నేవీ డెస్ట్రాయర్‌పై ఐఆర్‌జిసి క్షిపణి దాడులు



**దుబాయ్ :** పశ్చిమాసియాలో నెలరోజులపాటు తుఫాను ముందరి ప్రశాంతత నెలకున్న తర్వాత వారం రోజుల క్రితం తీవ్రరూపం దాల్చిన సంఘర్షణ కొనసాగుతోంది. అమెరికా–ఇరాన్ మధ్య పరస్పర దాడులు జరిగాయి. ఈ సందర్భంగాఇరాన్ జలాల్లో లంగరు వేసి ఉన్న మూడు నౌకలపై అమెరికా దాడులు చేయగా,ఆరు నౌకలపై ఇరాన్ సైన్యాలు ప్రతీకార దాడులు చేశాయి.ఒమన్ గల్ఫ్ ప్రాంతంలో ఒక చమురు నౌకను పూర్తిగా ధ్వంసం చేశామని, మరో రెండు నౌకలను శాశ్వతంగా కదలకుండా చేశామని అమెరికా సైనికదళం సెంట్‌కామ్ వర్గాలు ప్రకటించాయి. దీంతో రగిలిపోయిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ సైన్యాలు హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ నిర్దేశించని అనధికార మార్గంలో ప్రయాణం చేసి వెళుతున్న మూడు నౌకలపై ప్రతీకార దాడులు చేశాయి. అమెరికాకు అనుబంధంగా ఉన్న మరో మూడు నౌకలపై కూడా దాడులు చేశాయి. అమెరికా యుద్ధ విమాన వాహకనౌకపైన,నౌకా విధ్వంసక వ్యవస్థపైనా ఆదివారం అనేక క్షిపణులతో దాడులు చేసినట్లు ఐఆర్‌జిసి ప్రకటించింది. ఈ దాడులను రెండు దేశాలకు చెందిన మీడియా బృందాలు ధృవీకరించాయి. ఆరునెలలుగా కొనసాగుతున్న యుద్ధంలో ఎంతమాత్రం పురోగతి లేదని, ఇది చాలా చిన్న విషయమని ట్రంప్ చెప్పిన ఒక రోజు తర్వాత ఇరు దేశాల సైన్యాలు పరస్పర దాడులు చేసుకున్నాయి. ఇరాన్‌పై చాలా తీవ్రస్థాయిలో దాడులు చేసినట్లు గడచిన మంగళవారం ట్రంప్ ప్రకటించారు. తిరిగి మొదలైన యుద్ధం ఎక్కువ కాలం కొనసాగదన్నారు. ఐతే ఈ దాడులతో ఇరాన్ ఆగ్రహించి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్,బహ్రైన్,కువైట్,జోర్డాన్ సహా ఆ ప్రాంతంలో అమెరికా తరువాయి 12లో

# అనుకరణలో పుట్టే సాహిత్య సృజనాత్మకత 'పేరడీ'

సాహిత్యంలో ప్రతి ప్రక్రియకు తనదైన స్వరూపం ఉంటుంది. కొన్ని ప్రక్రియలు జీవితాన్ని యథాతథంగా చిత్రిస్తే, మరికొన్ని సమాజాన్ని ప్రశ్నిస్తాయి. ఇంకొన్ని నవ్వుల వెనుక గంభీరమైన విమర్శను దాచుకుంటాయి. అలాంటి విశిష్ట ప్రక్రియల్లో పేరడీ ఒకటి. సాధారణంగా పేరడీ అంటే హాస్యం కోసం చేసిన అనుకరణ అనే అభిప్రాయం ఉంది. కానీ సాహిత్య దృష్టిలో పేరడీ అంతకంటే విస్తృతమైన భావన. అది ఒక రచయిత శైలిని, ఒక ప్రసిద్ధ రచనను లేదా ఒక సాహిత్య ప్రక్రియను అనుకరిస్తూ, అందులోని లక్షణాలను ఉద్దేశపూర్వకంగా అతిశయోక్తితో చూపించే సృజనాత్మక ప్రక్రియ. ఆ అతిశయోక్తి పాఠకుడిలో నవ్వును పుట్టించడమే కాదు, అసలు రచనను కొత్త కోణంలో ఆలోచించేలా చేస్తుంది. పేరడీ విజయవంతం కావాలంటే రచయితకు మూల రచనపై లోతైన అవగాహన అవసరం. ఒక రచనలోని భాష, శైలి, వాక్య నిర్మాణం, పాత్రల స్వభావం, కథన పద్ధతి, భావ వ్యక్తీకరణ వంటి అంశాలను క్షుణ్ణంగా గ్రహించినప్పుడే వాటిని కళాత్మకంగా పునర్నిర్మించడం సాధ్యమవుతుంది. అందుకే పేరడీని కేవలం హాస్య రచనగా కాకుండా, విమర్శనాత్మక పునఃసృష్టిగా కూడా పరిగణిస్తారు. మంచి పేరడీ మూల రచనను తక్కువ చేయదు. అందుకు భిన్నంగా, దాని ప్రత్యేకతను మరింత స్పష్టంగా కనిపించేలా చేస్తుంది. పేరడీలో అనుకరణ ప్రధాన లక్షణం. అయితే అది యాంత్రికమైన అనుకరణ కాదు. అసలు రచనలోని శైలి, పదప్రయోగం, లయ, కథన నిర్మాణం వంటి లక్షణాలను నిలుపుకుంటూనే వాటిని కొద్దిగా విస్తరించి, కొన్నిసార్లు అతిశయోక్తిగా మలుస్తుంది. ఈ అతిశయోక్తే పేరడీకి హాస్యాన్ని అందిస్తుంది. ఒక రచయిత తరచూ ఉపయోగించే అలంకారాలు, భావోద్వేగాల తీవ్రత, లేదా ఒక ప్రక్రియలో పదేపదే కనిపించే మూసలను విస్తరించి చూపించడం ద్వారా పేరడీ తన లక్ష్యాన్ని సాధిస్తుంది. అయితే పేరడీ లక్ష్యం ఎప్పుడూ ఎగతాళి చేయడమే కాదని గుర్తించాలి. ఎందుకుంటే, అది కొన్నిసార్లు గౌరవప్రదమైన నివాళిగా కూడా నిలుస్తుంది. ఒక గొప్ప రచయిత ప్రభావం ఎంత బలంగా ఉందో తెలియజేయడానికి కూడా పేరడీ ఉపయోగపడుతుంది. అదే సమయంలో ఏదైనా సాహిత్య ప్రక్రియలో ఏర్పడిన అతిశయాలు, కృత్రిమత, పునరుక్తి, మూస ధోరణులను వెలుగులోకి తీసుకురావడానికి కూడా ఇది సమర్థమైన సాధనంగా పనిచేస్తుంది. అందువల్ల పేరడీని సాహిత్య విమర్శకు, సృజనాత్మకతకు మధ్య నిలిచే ప్రక్రియగా చెప్పవచ్చు. ప్రపంచ సాహిత్యంలో పేరడీకి చిరస్థాయి గుర్తింపు తెచ్చిన రచనల్లో జేన్ ఆస్టిన్ రాసిన 'నార్తాంగర్ ఎబ్బే' ఒకటి. ఆ కాలంలో విపరీత ఆదరణ పొందిన గోతిక్ నవలల్లో కనిపించే రహస్యాలు, భయానక వాతావరణం, అసంభవ సంఘటనలు, అతిగా నాటకీయతను ఆమె చమత్కారంగా పునర్నిర్మించింది. గోతిక్ సంప్రదాయాన్ని పూర్తిగా తిరస్కరించకుండా, అందులోని అతిశయాలను హాస్యంతో చూపించడం ద్వారా ఆ ప్రక్రియపై విమర్శనాత్మక దృష్టిని ఏర్పరిచింది. అలెగ్జాండర్ పోప్ రచించిన 'ది రేప్ ఆఫ్ ది లాక్' మరో విశిష్ట ఉదాహరణ. మహాకావ్యాలకు ఉండే గంభీరమైన శైలిని ఉపయోగించి, ఒక యువతి జుట్టు ముడిని కత్తిరించిన చిన్న సంఘటనను ఆయన అత్యంత వైభవంగా వర్ణించాడు. తుచ్ఛమైన సంఘటనను మహాకావ్య స్థాయికి తీసుకెళ్లడం ద్వారా సమాజంలోని కృత్రిమ గౌరవ భావనలను, ఉన్నత వర్గాల అలవాట్లను వ్యంగ్యంగా చిత్రించాడు. ఈ రచన పేరడీతో పాటు వ్యంగ్య రచనకు కూడా ఆదర్శంగా నిలిచింది. పేరడీని వ్యంగ్యంతో సమానంగా చూడడం సరైంది కాదు. వ్యంగ్యం ప్రధానంగా సమాజాన్ని, వ్యక్తులను లేదా ఆలోచనలను విమర్శిస్తుంది. పేరడీ మాత్రం ముందుగా ఒక నిర్దిష్ట రచన, రచయిత లేదా సాహిత్య శైలిని అనుకరిస్తుంది. ఆ అనుకరణలోనే హాస్యం, విమర్శ, ప్రశంస అనే మూడు అంశాలు సందర్భానుసారం కలిసిపోతాయి. అందువల్ల ప్రతి పేరడీలో వ్యంగ్య లక్షణాలు ఉండవచ్చుగానీ, ప్రతి వ్యంగ్య రచన పేరడీ కాదు. సాధారణంగా, సాహిత్యం నిరంతరం తనను తాను పరిశీలించుకుంటూ ముందుకు సాగుతుంది. ఆ ఆత్మపరిశీలనకు పేరడీ ఒక సమర్థమైన సాధనం. ఒక ప్రక్రియ తన పరిమితులను దాటినప్పుడు, ఒక శైలి మూసగా మారినప్పుడు, ఒక రచయిత ప్రభావం అతిగా పెరిగినప్పుడు పేరడీ వాటిని సున్నితమైన హాస్యంతో ప్రశ్నిస్తుంది. అదే సమయంలో గొప్ప రచనల ప్రత్యేకతను కొత్త తరాలకు పరిచయం చేసే వంతెనగానూ నిలుస్తుంది. అందుకే పేరడీని కేవలం నవ్వించే ప్రక్రియగా చూడలేం. అది పాఠకుడి సాహిత్య అవగాహనను పరీక్షించే ప్రక్రియ. మూల రచన తెలిసిన వారికే పేరడీలోని చమత్కారం పూర్తిగా అర్థమవుతుంది. అనుకరణను కళగా, హాస్యాన్ని విమర్శగా, విమర్శను సృజనాత్మకతగా మలిచే సాహిత్య ప్రక్రియగా పేరడీ నేటికీ తన ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకుంది.




పేరడీ అనేది రూప పరంగా మాత్రమే కాకుండా, దాని అంతర్గత స్వభావం, లక్ష్యాల పరంగా కూడా సంక్లిష్టమైన సాహిత్య ప్రక్రియ. పేరడీకి ఇతర సాహిత్య ప్రక్రియలతో ఉన్న సంబంధాన్ని పరిశీలించడం ఈ సందర్భంలో ఎంతో అవసరం. పాస్టీష్, బర్లెస్క్, ట్రావెస్టీ, మాక్‌హీరోయిక్, సెటైర్, కారికేచర్, ఐరనీ, మిమిక్రీ వంటి ప్రక్రియలకు పేరడీతో దగ్గరి పోలికలు ఉన్నాయి. వీటిలో బర్లెస్క్, ట్రావెస్టీ అనే పదాలను ఆంగ్ల సాహిత్యంలో కొన్ని సందర్భాల్లో పేరడీకి సమానార్థకాలుగా కూడా ఉపయోగించిన ఉదాహరణలు కనిపిస్తాయి. సాహిత్యంలో పేరడీ, బర్లెస్క్, ట్రావెస్టీ వంటి ప్రక్రియలను చర్చించేటప్పుడు వాటి పేర్ల విషయంలో చాలా కఠినమైన విభజనలు చేయడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు. ఎందుకంటే ఈ మూడు ప్రక్రియలూ అసంగతమైన అనుకరణను, తీవ్రమైన లేదా గంభీరమైన విషయాలను ఉద్దేశపూర్వకంగా తక్కువ స్థాయిలో చూపించే పద్ధతిని ఉపయోగిస్తాయి. వీటి ప్రధాన ఉద్దేశం వ్యంగ్య ప్రభావాన్ని సృష్టించడం. ఒక ఉన్నతమైన, గంభీరమైన అంశాన్ని సాధారణమైన లేదా తక్కువ స్థాయి శైలిలో వ్యక్తీకరిస్తే అది బర్లెస్క్‌గా మారుతుంది. దీనికి విరుద్ధంగా, సామాన్యమైన లేదా తక్కువ స్థాయి విషయాన్ని గొప్పదైన, గంభీరమైన శైలిలో చిత్రిస్తే అది మాక్‌హీరోయిక్ అవుతుంది. తెలుగు సాహిత్యంలో దీనికి వ్యాజస్తుతి అలంకారంతో కొంత పోలిక కనిపిస్తుంది. పాస్టీష్, బర్లెస్క్, ట్రావెస్టీ, ఐరనీ వంటి ప్రక్రియలు తెలుగులో ప్రత్యేక సాహిత్య రూపాలుగా పెద్దగా స్థిరపడలేదు. సెటైర్ మాత్రం తెలుగు సాహిత్యంలో కొంత ప్రాచుర్యం పొందింది. కారికేచర్ చిత్రకళలో కార్టూన్ రూపంలో, మిమిక్రీ ధ్వన్యనుకరణ కళారూపంగా తెలుగు సమాజంలో స్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నాయి.

## పేరడీ అవసరం ఏమిటి?

సాధారణంగా ఒక గంభీరమైన విషయాన్ని కూడా వ్యంగ్యంగా, హాస్యాత్మకంగా చెప్పడానికి 'పేరడీ'ని ఆశ్రయిస్తారు. అయితే, కొన్నిసార్లు ఒక రచయిత తన అభిప్రాయాలను నేరుగా వ్యక్తం చేస్తే తీవ్ర విమర్శలు లేదా దూషణలు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. అలాంటి సందర్భాల్లో పేరడీ ఒక సమర్థమైన సాహిత్య సాధనంగా మారుతుంది. ప్రత్యక్ష విమర్శకు బదులుగా హాస్యం, చమత్కారం, అనుకరణ ద్వారా తన భావాన్ని వ్యక్తీకరించే అవకాశం పేరడీ కల్పిస్తుంది. దీనివల్ల విమర్శ మరింత సున్నితంగా, కళాత్మకంగా పాఠకుడికి చేరుతుంది. పేరడీ ఎప్పుడూ అవమానపరచడానికి మాత్రమే ఉద్దేశించిన ప్రక్రియ కాదు. చాలాసార్లు అది మూల రచయిత పట్ల ఉన్న అభిమానానికి, గౌరవానికి కూడా సంకేతంగా ఉంటుంది. ఒక రచయిత శైలిని సమర్థంగా అనుకరించాలంటే ఆ రచనలపై లోతైన అవగాహన అవసరం. అందువల్ల మంచి పేరడీ వెనుక విమర్శతో పాటు ప్రశంస కూడా అంతర్లీనంగా ఉంటుంది. కొన్ని సందర్భాల్లో మహాకవుల రచనా శైలిని పైపైగా అనుకరిస్తూ వారి గొప్పతనాన్ని అర్థం చేసుకోలేని రచయితలను ఎద్దేవా చేయడానికి పేరడీని ఉపయోగిస్తారు. అలాగే కాలానుగుణత కోల్పోయిన సాహిత్య సంప్రదాయాలను ప్రశ్నించడానికి, పాత మూసలను విమర్శించడానికి కూడా ఇది సమర్థమైన ఆయుధంగా పనిచేస్తుంది. మరికొన్ని సందర్భాల్లో ఒక ప్రసిద్ధ రచయిత శైలిని ఆశ్రయించి, అసలు లక్ష్యంగా మరో వ్యక్తిని, ఆలోచనను లేదా సామాజిక పరిస్థితిని వ్యంగ్యంగా చిత్రించడానికి కూడా పేరడీని ఉపయోగిస్తారు. కాబట్టి పేరడీకి మూడు రకాల లక్ష్యాలు ఉంటాయని అనుకోవచ్చు. అంటే, అది మూల రచయితను విమర్శించవచ్చు, మూల రచనను విశ్లేషించవచ్చు లేదా ఆ రచన శైలిని మాధ్యమంగా చేసుకొని పూర్తిగా వేరే అంశాన్ని వ్యంగ్యంగా చిత్రించవచ్చు. పేరడీకి మరో ముఖ్యమైన ప్రయోజనం హాస్యమని ముందుగానే చెప్పుకున్నాం. హాస్యం మనసును తేలికపరుస్తుంది, ఒత్తిడిని తగ్గిస్తుంది, ఆలోచనకు దారితీస్తుంది. పేరడీ ఈ లక్షణాలన్నింటినీ కలగలిపి పాఠకుడికి వినోదంతో పాటు విమర్శనాత్మక దృష్టిని కూడా అందిస్తుంది. నవ్విస్తూ ఆలోచింపజేయడం, చమత్కారం ద్వారా సాహిత్యాన్ని కొత్త కోణంలో చూడేలా చేయడం పేరడీ ప్రక్రియ విశిష్టత. కూచిమంచి జగ్గకవి రచించిన 'చంద్రరేఖా విలాపం' వెనుక వ్యక్తిగత అసంతృప్తి ప్రధాన కారణంగా కనిపిస్తే, కందుకూరి వీరేశలింగం రచించిన 'అభాగ్యోపాఖ్యానం' పూర్తిగా సాహిత్య సంస్కరణ లక్ష్యంతో రూపుదిద్దుకుంది. రచన వెనుక ఉన్న ఉద్దేశాన్ని స్వయంగా కందుకూరి వివరించాడు. తెలుగు ప్రబంధ సాహిత్యం ఒకే తరహా శృంగార వర్ణనలతో నిండిపోయి, వైవిధ్యాన్ని కోల్పోయిందని ఆయన భావించాడు. అలాంటి ప్రబంధాలు సాహిత్యానికి మేలు కంటే కీడే ఎక్కువ చేస్తున్నాయనే అభిప్రాయానికి వచ్చిన తరువాత, ఆ ధోరణిని పరిహసించి సంస్కరించాలనే లక్ష్యంతో ఈ రచనను రూపొందించాడు. అందువల్ల ఇది వ్యక్తిగత దూషణ కోసం రాసిన రచన కాదని, సాహిత్య సంస్కరణ కోసం చేసిన సృజనాత్మక ప్రయత్నమని అర్థం చేసుకోవాలి. ఇక కూచిమంచి జగ్గకవి రచనల్లో కనిపించే వ్యక్తిగత ఆగ్రహం, పరుష వ్యాఖ్యలు వీరేశలింగం రచనలో ఉండవు. ఆయన విమర్శ వ్యక్తులపై కాదు, కాలం చెల్లిన సాహిత్య ధోరణులపై. వ్యాసం రాసి విమర్శించడానికి బదులుగా, ప్రబంధాల్లోని మూస పద్ధతులను అతిశయోక్తితో చిత్రించి, వాటి బలహీనతలను పాఠకుడి ముందుంచాడు. ఈ విధంగా పేరడీని సాహిత్య విమర్శకు సమర్థమైన సాధనంగా ఉపయోగించాడు. 'అభాగ్యోపాఖ్యానం'లో కథా నిర్మాణం, పద్యశైలి, వర్ణనలు, ఉపమానాలు అన్నీ అప్పటి ప్రబంధాల లక్షణాలను ఉద్దేశపూర్వకంగా అనుకరిస్తాయి. 'విజయవిలాసం', 'మనుచరిత్ర' వంటి ప్రసిద్ధ ప్రబంధాల శైలిని ప్రతిబింబించే అనేక సందర్భాలు ఇందులో కనిపిస్తాయి. అభాగ్యుడు అనే రాక్షసుడి కథ, అతని ప్రేమ, అన్వేషణ, చివరికి ఎదురయ్యే హాస్యాస్పద పరిణామాలు పాఠకుడికి నవ్వు పుట్టిస్తూనే, ప్రబంధ సాహిత్యంలో పేరుకుపోయిన కృత్రిమతను కూడా బహిర్గతం చేస్తాయి. ఈ కారణంగానే 'అభాగ్యోపాఖ్యానం' తెలుగు సాహిత్యంలో పేరడీకి ఒక ప్రామాణిక రచనగా గుర్తింపు పొందింది.

విశ్వమిత్ర

### గ్రీకు మూలాలు!

సాధారణంగా 'పేరడీ'ని తెలుగు పదంగానే భావిస్తాం. కానీ, ఈ పదానికి మూలాలు ప్రాచీన గ్రీకు భాషలో ఉన్నాయి. అందులోని 'పరోయిడియా' ఈ పదానికి మూలం. దీనికి ఒక పాటను లేదా కవితను అనుకరిస్తూ, దానికి భిన్నమైన హాస్యాత్మక లేదా వ్యంగ్యాత్మక రూపాన్ని ఇవ్వడం అనే అర్థం ఉంది. ఈ పదం రెండు గ్రీకు పదాల కలయికతో ఏర్పడింది. 'పారా' అంటే 'పక్కన', 'సమాంతరంగా' లేదా 'ఎదురుగా' అని అర్థం. 'ఓయిడే' అంటే 'పాట', 'గీతం' లేదా 'ఓడ్'. ఈ రెండింటి కలయికగా పేరడీకి 'మూల రచనతో సమాంతరంగా సాగుతూ, దానిని కొత్త మలుపుతో అనుకరించే గీతం లేదా రచన' అనే భావం ఏర్పడింది. ప్రాచీన గ్రీసులో పేరడీని మొదట గంభీరమైన మహాకావ్యాలను అనుకరిస్తూ, వాటి శైలిలోనే హాస్యభరితమైన లేదా సాధారణ విషయాలను చెప్పే కవితల కోసం ఉపయోగించారు. తాత్వికుడు అరిస్టాటిల్ ప్రస్తావనలో క్రీ.పూ. ఐదో శతాబ్దానికి చెందిన రచయిత హెగెమోన్ ఆఫ్ థాసోస్ ఈ ప్రక్రియకు తొలి రూపకర్తల్లో ఒకరిగా గుర్తింపు పొందాడు. ఆయన ప్రసిద్ధ కవితల పదాలను మార్చి, గంభీరమైన విషయాలను హాస్యాస్పదంగా మార్చే రచనలు చేశాడు. తరువాత ఈ పదం లాటిన్ భాషలో 'పరోడియా'గా ప్రవేశించింది. అక్కడి నుంచి యూరోపియన్ భాషలకు వ్యాపించి, పదహారో శతాబ్దం చివరినాటికి ఆంగ్ల భాషలో స్థిరపడింది. ముఖ్యంగా ఆంగ్ల నాటకకర్త బెన్ జాన్సన్ కాలంలో ఈ పదానికి విస్తృత ప్రాచుర్యం లభించింది. నేడు పేరడీ సాహిత్యం, సంగీతం, నాటకం, సినిమా వంటి అనేక కళారూపాల్లో ఒక సృజనాత్మక ప్రక్రియగా గుర్తింపు పొందింది.

# పేరడీకి చిరునామా జరుక్ శాస్త్రి

నేడు జరుక్ శాస్త్రి జయంతి

పేరడీ అనే ప్రత్యేక హాస్య ప్రక్రియకు తెలుగులో పునాదులు వేసిన రచయిగా జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి (జరుక్ శాస్త్రి) పేరును ప్రస్తావించుకోవాలి. మొక్కపాటి నరసింహశాస్త్రి, చిలకమర్తి లక్ష్మీనరసింహం, పానుగంటి లక్ష్మీనరసింహారావు, భమిడిపాటి కామేశ్వరరావు వంటి రచయితలు తెలుగు సాహిత్యంలో హాస్యానికి ప్రత్యేక స్థానం కల్పించారు. సున్నితమైన హాస్యంతో పాఠకులను ఆకట్టుకున్నారు. అయితే, జరుక్ శాస్త్రి మాత్రం హాస్యాన్ని, వ్యంగ్యాన్ని పేరడీ రూపంలో అందించి, తన ప్రత్యేకతను చాటుకున్నాడు. వాస్తవానికి పేరడీ రాయడం అంత సులభమైన ప్రక్రియ కాదు. ఒక గొప్ప రచనలోని ప్రత్యేక లక్షణాన్ని గుర్తించి, దానిలోని అతిశయాన్ని సున్నితంగా ఎత్తిచూపుతూ, అసలు రచనను గుర్తు చేసే విధంగా హాస్యాన్ని పండించాలి. మూల రచనను అవమానపరచకుండా, దానిలోని ఒక కోణాన్ని వినోదాత్మకంగా చూపించాలి. ఈ నైపుణ్యంలో జరుక్ శాస్త్రి అసాధారణ ప్రతిభను ప్రదర్శించాడు. అందుకే తెలుగు పేరడీ సాహిత్యానికి ఆయనను ఆద్యుడిగా భావిస్తారు. మహాకవి శ్రీశ్రీ రచించిన 'నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనవుతాను' అనే ప్రసిద్ధ కవితను అనుకరిస్తూ, 'నేను సైతం కిళ్ళీకొట్లో పాతబాకీ లెగర గొట్టాను' వంటి పంక్తులతో సామాజిక వాస్తవాలను వినోదాత్మకంగా ప్రతిబింబించిన పేరడీ ఆయన ప్రతిభకు తార్కాణం. 1914 సెప్టెంబర్ 7న బందరులో జన్మించిన జరుక్ శాస్త్రి సంస్కృతం, తెలుగు భాషల్లో ప్రావీణ్యం సంపాదించాడు. కొంతకాలం ఆంధ్రపత్రిక ఉప సంపాదకుడిగా పనిచేశాడు. మద్రాసు, విజయవాడ ఆకాశవాణి కేంద్రాల్లో స్క్రిప్ట్ రచయితగా సేవలందించాడు. నవ్యాంధ్ర సాహిత్యోద్యమంలోనూ ఆయన కీలక పాత్ర పోషించాడు. తనలో తాను వంటి శీర్షికల ద్వారా తన ప్రత్యేక రచనా శైలిని పరిచయం చేశాడు. 'జరుక్ శాస్త్రి పేరడీలు', 'శరత్ పూర్ణిమ' వంటి సంకలనాలు ఆయన సాహిత్య ప్రతిభకు నిదర్శనాలు. అనేక పత్రికల్లో వ్యాసాలు రాసిన ఆయన, తన చమత్కార రచనలతో తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయాడు. 1968లో ఆయన కన్నుమూసినా, పేరడీ సాహిత్యంలో ఆయన వేసిన ముద్ర ఇప్పటికీ చెరిగిపోలేదు. తెలుగు సాహిత్యంలో పేరడీని ఒక స్వతంత్ర సాహిత్య ప్రక్రియగా స్థిరపరిచిన ప్రముఖుల్లో జరుక్ శాస్త్రి తర్వాత అంతటి పేరు సంపాదించుకున్న రచయిత మాచిరాజు దేవీప్రసాద్. ఆయన కేవలం పేరడీ కవితలకు మాత్రమే పరిమితం కాలేదు. గద్యరచనల్లోనూ ఈ ప్రక్రియకు విశిష్ట స్థానం కల్పించాడు. శ్రీశ్రీ, వేదుల సత్యనారాయణ, విశ్వనాథ సత్యనారాయణ, శివశంకరశాస్త్రి, నాయని సుబ్బారావు వంటి ప్రముఖ రచయితల శైలులను దేవీప్రసాద్ అనుకరిస్తూ, వాటిలోని ప్రత్యేక లక్షణాలను చమత్కారంగా మలిచాడు. కార్యాలయ లేఖలు, పాఠకుల ఉత్తరాలు, అధికార భాష వంటి అంశాలపై కూడా పేరడీలు రచించి గద్య పేరడీకి కొత్త దిశ చూపించాడు. 1922లో జన్మించిన దేవీప్రసాద్ జీవితాన్ని కూడా హాస్య దృష్టితోనే చూశాడు. సాహిత్యంలో పేరుకుపోయిన మూస ధోరణులు, అతిశయ భావుకత, కృత్రిమ భాష, ప్రభుత్వ వ్యవస్థలోని లోపాలు ఆయన పేరడీల ప్రధాన లక్ష్యాలయ్యాయి. ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసిన రోజుల్లో అధికార వ్యవస్థలోని అవకతవకలను రచనల ద్వారా ఎండగట్టడంతో ఇబ్బందులు కూడా ఎదుర్కొన్నాడు. అయినప్పటికీ తన విమర్శనాత్మక దృష్టిని వదల్లేదు. ఆయన ప్రతిభకు చక్కని ఉదాహరణ 'భోజనశాల' అనే పేరడీ. ఇది వేదుల సత్యనారాయణ ప్రసిద్ధ గేయం 'రాధ'కు పేరడీ. మూల రచనలో శ్రీకృష్ణుడి కోసం విరహంతో వెదికే రాధ కనిపిస్తే, దేవీప్రసాద్ పేరడీలో ఆకలితో భోజనశాల కోసం వెదికే భోజనప్రియుడు కనిపిస్తాడు. మూల పద్యంలోని తొలి రెండు పాదాలను యథాతథంగా ఉంచి, తరువాతి పాదాల్లో చిన్న మార్పులతో పూర్తిగా భిన్నమైన హాస్యానుభూతిని సృష్టించాడు. ఈ విధానమే ఆంగ్ల సాహిత్యంలో 'వెర్బల్ పేరడీ'గా స్థిరపడింది. వేణుగాన మాధుర్యాన్ని వర్ణించిన మూల పద్యాన్ని, బుచ్చెమ్మ భోజనశాలలోని పచ్చిపులుసు రుచిని కీర్తించేలా మలచడం దేవీప్రసాద్ చమత్కారానికి నిదర్శనం. యమునా ప్రవాహం స్థానంలో నోరూరడం, ప్రేమ పరవశం స్థానంలో భోజనోత్సాహం వంటి మార్పులు పాఠకుడికి సహజమైన నవ్వును పంచుతాయి. మూల కవిత్వంలోని లయ, భాష, భావవ్యక్తీకరణను కాపాడుతూ, వస్తువును మాత్రమే మార్చి కొత్త అర్థాన్ని సృష్టించడం దేవీప్రసాద్ పేరడీల విశిష్టత. అందుకే తెలుగు సాహిత్యంలో కళాత్మకమైన పేరడీకి ఆయన రచనలు ఆదర్శంగా నిలిచాయి.







## చదవాల్సిన పుస్తకం

### చరిత్ర గమనాన్ని నిగ్గుతేల్చిన డాంగే

భారత దేశ చరిత్రను ఆదిమ కమ్యూనిజం నుంచి బానిస సమాజం వరకూ వివరించిన ఒక చారిత్రక, విశ్లేషణాత్మక పుస్తకం 'ఇండియా: ఫ్రమ్ ప్రిమిటివ్ కమ్యూనిజం టు స్లేవరీ'. శ్రీపాద అమృత డాంగే రచించిన ఈ పుస్తకాన్ని 'ఆదిమ కమ్యూనిజం నుండి బానిస సమాజము వరకు భారత దేశం... ప్రాచీన చరిత్రపై ఒక మార్క్సిస్టు పరిశీలన' అనే పేరుతో పులుపుల వెంకటశివయ్య తెలుగులోకి అనువదించారు. భారతీయ చరిత్రను మార్క్సిస్టు చారిత్రక భౌతికవాద దృక్పథంతో అర్థం చేసుకునే తొలి ప్రయత్నాలలో దీనిని ఒకటిగా పేర్కోవాలి. దీనిని చరిత్రకు మాత్రమే పరిమితైన పుస్తకంలా కాకుండా, భారతీయ సమాజ పరిణామాన్ని వర్గపోరాటం, ఉత్పత్తి సంబంధాలు, ఆస్తి యాజమాన్యం వంటి అంశాల ఆధారంగా పునర్నిర్వచించాలన్న ఒక సిద్ధాంత గ్రంథంగా చూడాలి. తర్వాతి కాలంలో డిడి కోశాంబి, రొమిలా థాపర్, ఆర్ ఎస్ శర్మ వంటి చరిత్రకారులు మరింత ఆధారపూర్వక పరిశోధనలు చేసినప్పటికీ, డాంగే గ్రంథం భారతీయ మార్క్సిస్టు చరిత్ర రచనలో ఒక మైలురాయిగా మిగిలింది. భార త చరిత్రను పురాణాలు, రాజవంశాలు, మత విశ్వాసాల చట్రంలో కాకుం డా ఉత్పత్తి విధానాలు, ఆర్థిక సంబంధాలు, వర్గపోరాటాల దృష్టితో చూడాలంటే 'ఇండియా: ఫ్రమ్ ప్రిమిటివ్ కమ్యూనిజం టు స్లేవరీ' ప్రస్తావన తప్పకుండా వస్తుంది. భారత కమ్యూనిస్టు ఉద్యమానికి ప్రముఖ నాయకుడైన డాంగే, ఈ పుస్తకంలో కార్ల్ మార్క్స్, ఎంగెల్స్ ప్రతిపాదించిన చారిత్రక భౌతికవాదాన్ని భారతీయ సమాజానికి అన్వయించే ప్రయత్నం చేశారు. 1949లో వెలువడిన ఈ రచన, భారతదేశంలో మార్క్సిస్టు చరిత్ర రచనకు తొలి సమగ్ర రూపురేఖలను అందించింది. డాంగే ప్రధానంగా వేదాలు, బ్రాహ్మణ్యాలు, స్మృతులు, మహాభారతం, రామాయణం వంటి ప్రాచీన సాహిత్యాన్ని ఆధారంగా తీసుకుని భారత సమాజ పరిణామాన్ని విశ్లేషించారు. ఆయన దృష్టిలో ఆదిమ గిరిజన సమాజం వ్యక్తిగత ఆస్తి భావన లేని 'ప్రిమిటివ్ కమ్యూనిజం' దశలో జీవించింది. ఉత్పత్తి సాధనాలు అభివృద్ధి చెందడంతో మిగులు సంపద ఏర్పడింది. దాంతో వ్యక్తిగత యాజమాన్యం, సామాజిక అసమానతలు, చివరికి బానిస వ్యవస్థ రూపుదిద్దుకున్నాయని ఆయన వాదిస్తారు. ఈ పరిణామం సహజమైన సామాజికఆర్థిక మార్పుల ఫలితమే తప్ప కేవలం మతం లేదా రాజుల సంకల్పం వల్ల సంభవించలేదని ఆయన స్పష్టం చేస్తారు. మహాభారతంపై చేసిన పునర్వ్యాఖ్యానాన్ని ఈ పుస్తకంలో అత్యంత ఆసక్తికరమైన అంశంగా పేర్కోవాలి. డాంగే దృష్టి లో కురుక్షేత్ర యుద్ధం కేవలం పాండవులు, కౌరవుల మధ్య జరిగిన కు టుంబ కలహం కాదు. అది భూస్వామ్య హక్కులు, సంపద, అధికారాన్ని స్వాధీనం చేసుకోవడానికి పోటీపడిన వర్గాల మధ్య జరిగిన సామాజిక సం ఘర్షణకు ప్రతీక. ఈ వ్యాఖ్యానం సంప్రదాయ పురాణ పఠనానికి పూర్తిగా భిన్నమైనది. ఇదే కారణంగా ఈ గ్రంథం వెలువడినప్పుడు తీవ్రమైన చర్చ కు దారి తీసింది. మరో ముఖ్యమైన అధ్యాయం మాతృస్వామ్యం నుంచి పితృస్వామ్యానికి జరిగిన మార్పు. ఆదిమ తెగలలో స్త్రీకి ఉన్న సామాజిక ప్రా ధాన్యం, ఆస్తి కూడికతో పాటు కుటుంబ నిర్మాణంలో వచ్చిన మార్పుల వల్ల ఎలా క్షీణించిందో డాంగే విశ్లేషిస్తారు. పితృస్వామ్యం ఒక సాంస్కృతి క పరిణామం మాత్రమే కాదని, ఆర్థిక నిర్మాణంలో వచ్చిన మార్పుల ఫలితమని ఆయన అభిప్రాయపడతారు. భారత ప్రాచీన చరిత్రను వర్గ సంబంధాలు, ఉత్పత్తి విధానాలు, సామాజిక పరిణామాల క్రమంలో అర్థం చేసుకోవాలనే చర్చకు డాంగే పుస్తకం బలమైన పునాది వేసింది. తర్వాతి తరాల మార్క్సిస్టు చరిత్రకారులు డాంగే సిద్ధాంతాలను సవరించినా, విభేదిం చి నా, ఆయన లేవనెత్తిన ప్రశ్నలను మాత్రం విస్మరించలేదు. భారత సమాజంలో వర్గం, కులం, అధికారం, ఆస్తి మధ్య ఉన్న సంబంధాలపై జరిగిన అనేక పరిశోధనలకు ఈ గ్రంథం ఒక ఆరంభ బిందువుగా నిలిచింది. నేటి ప్రమాణాల ప్రకారం అన్ని వాదనలూ అంగీకారయోగ్యమైన గ్రంథం కా దు. కానీ భారతీయ చరిత్రను పురాణాల గౌరవభావంతో కాకుండా విమర్శనాత్మకంగా, సామాజిక శాస్త్ర దృష్టితో చదవాలని పాఠకుడిని ప్రేరేపించే అరుదైన రచన. అందువల్ల ఇది తుది సమాధానాలను ఇచ్చే పుస్తకం కంటే, కొత్త ప్రశ్నలను అడగడం నేర్పించే పుస్తకంగా ఎక్కువ విలువను సంపాదించింది.






**పుస్తకం పేరు**

**ఆదిమ కమ్యూనిజం నుండి బానిస సమాజము వరకు భారత దేశం... ప్రాచీన చరిత్రపై ఒక మార్క్సిస్టు పరిశీలన**

**రచన : శ్రీపాద అమృత్ డాంగే**

**అనువాదం: పులుపుల వెంకటశివయ్య**

**వెల : రూ. 150.**

**ప్రతులకు**

**నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).**

## ఈ వారం కవితలు

### చైతన్య జ్వలిత

సమాజ కాన్వాస్‌పై భావాల ఉలితో చెక్కిన అందమైన
సరంగుల అక్షర చిత్రం
ప్రకృతి సమన్వయం ప్రగతి సృజనాత్మకం
అందుకే అది జనాత్మకం.. సజీవ కళాత్మకం..

రుతువుల క్రతువులో శిశిరం రాల్చిన శబ్దం
వసంతం సీమంతంలో వికసించిన పుష్పం
ఉషస్సు విరబూసిన కాంతుల సెలయేరు
సముద్రం లోతులలో ఉప్పొంగిన అలలు..

వర్షం ముద్దాడి పులకించిన నేల
అనుభవ సారం అంకురించిన విత్తనం
పైనబడే పులులను ప్రతిఘటించే లేళ్లు
సంధించిన స్వరాలు సంఘటిత భాస్వరాలు..

నిశీధి పోరులో నిగ్గుదేలిన ఉదయం
వేకువ విజయమై వికసించిన కిరణ
సంక్షోభ జఢత్వాల్లో చలించే జవసత్వాలు
నాగరికత శిథిలాల్లో నవీన ఆవిష్కరణలు..
కులాల నిచ్చెన మెట్లపై కూలని నీడలు
వరుసక్రమాల వేధన జాడలు
అడుగులు వేసినా అందని ఉట్లు
వైకుంఠపాళిలోని పాముల కాటు..
తల్లి స్తైన్యం అందని శిషువుల ఏడుపులు
చెరబట్టి దోచుకునే గద్దల కడుపులు
పంజరంలో పక్షి బయోనేట్ల మోతలు
రగిలే రణతంత్రాలు రక్తమోడే స్వేచ్ఛలు..

సత్యాలు నిత్యాలు సహజత్వ రాగాలు
చీకటికోణలో దాగిన కారణ తత్వాలు
అన్నీ అక్షరాలుగా చెక్కిన అందమైన చిత్రం
అది భాష చెరగనిది భావం తరగనిది..
అందుకే అది నిద్రలేపే కవితనిత్య చైతన్య జ్వలిత
సకల జనాత్మకం.. సజీవ కళాత్మకం...

– వేల్పుల నారాయణ, 9440433475

### జలఖడ్గం

హిమానీ నదుల వలయం
వరద బురదల విలయం
యల్‌నినో గారి ప్రభావం
ప్రకృతి వికృత స్వరూపం

నేపాల్ అయోమయం
జన విలాపాల నిలయం
విగత జీవులతో కలకలం
కలుషిత గాలులే ప్రళయం

గ్రామ రూపు రేఖలు మటు మాయం
ప్రజలు ప్రవాహంలో కనుమరుగవడం
పెను విపత్తుల రుద్ర ప్రాంగణం
గృహాలను కబళించిన జలఖడ్గం

ఆచూకీ లేని పౌరులదృశ్యం
నోరుంది మాట పెగలక విషాద భరితం
సహాయ సేవకుల కన్నీటి వదనం



క ని విని ఎరుగని మరణ మృదంగం

మనుగడ సాగడమిక అబద్ధం
తోడు నీడలు కరువై కుమలడం
గుండెను బండగా మార్చలేం
నిండుగా జగతిలో బతకలేం

నమిలకొండ నాగేశ్వర్ రావు
8688553470

### జెల్ల పురుగు

జెల్ల పురుగు బొద్దింక, కాక్రోచ్
ఎప్పుడు అనుకొని ఉండదు
తన పేరు మార్మోగిపోతుందని
ఊహించి కూడా ఉండదు !

నిశాచర జెల్ల పురుగు
మురికిప్రదేశాలు చీకట్లో మునుగు
అన్నీ తినే సర్వభక్షకం
వ్యాధుల వ్యాప్తి మూలకం!

అది కొందరికి చీదరింపు
మరికొందరికి అసహింపు
ఇంకొందరికి ఒళ్ళు జలదరింపు
కదుగుకుంటే పోతుందా కంపు!

ఒక శోకంలో శ్లోకం పుట్టినట్లు
వెటకారం ను ప్రతీకారం గా
జెల్ల పురుగు సి.జే.పి. గా



నామకరణం చేసుకున్నది !
బారెడు మీసాలతో
భయపెట్టజూస్తున్నది .

అంటించుకున్న మకిలి
వదిలించుకోకుంటే..
ఎగురగలుగుతుందా...
నెగులగలుగుతుందా...!

పట్లోళ్ల బక్కారెడ్డి
9705315250

# అత్యంత వైభవంగా గోదావరి పుష్కరాలు

### మంత్రి జూపల్లి కృష్ణారావు రూ.20కోట్లతో పుష్కర ఘాట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/నిర్మల్ :** తెలంగాణ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా వచ్చే ఏడాది జూన్ 27 నుంచి నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో విస్తృత ఏర్పాట్లు చేపడుతోందని రాష్ట్ర సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. పుష్కరాలకు ఏడాది ముందుగానే మౌలిక వసతులు, పుష్కర ఘాట్లు, ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఆదివారం బాసరలో పర్యటించిన మంత్రి జూపల్లి కృష్ణారావు రూ.20కోట్ల వ్యయంతో చేపట్టనున్న పుష్కర ఘాట్ల నిర్మాణం, విస్తరణ, మరమ్మతులు, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గోదావరి నదీమాతకు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణాన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయడంతోపాటు భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున భక్తుల సౌకర్యం, భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పుష్కర ఘాట్లను అవసరమైన మేరకు విస్తరించడంతో పాటు, కొత్త ఘాట్ల నిర్మాణం, మరమ్మతులు చేపట్టాలని అన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అదనపు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఆలయ ఇఒ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గోదావరి పుష్కరాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏడాది ముందుగానే పనులు ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పుష్కరాల కోసం దాదాపు రూ.1,000 కోట్లతో వివిధ అభివృద్ధి, మౌలిక వసతుల పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు.

పుష్కరాల ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రజాభవన్‌లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తామని చెప్పారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి జాప్యం లేకుండా పనులను నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని ఆదేశించారు. బాసరతో పాటు గోదావరి నదీ తీర జిల్లాల్లోని మొత్తం 12 ప్రాంతాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా బాసర గోదావరి పుష్కరాల ఏర్పాట్లు, పుష్కర ఘాట్ల అభివృద్ధి, శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ సమగ్ర అభివృద్ధికి సంబంధించిన మ్యాపులు, ప్రతిపాదనలు, పనుల పురోగతిని మంత్రి జూపల్లి కృష్ణారావుకు వివరించారు.

నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేసి, పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, అదనపు కలెక్టర్ బి.వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఎఎస్పీ సాయికిరణ్, ఆలయ ఇఒ అంజనా దేవి, తహసీల్దార్ పవన్ చంద్ర, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో 'సిలికాన్ ఫోటోనిక్స్'కు కొత్త ఊపు

### శ్రీధర్‌బాబుతో నీతి ఆయోగ్ సభ్యుడు వి.కె.సారస్వత్ భేటీ వ్యూహాత్మక రోడ్‌మ్యాప్‌పై కీలక చర్చ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిలికాన్ ఫోటోనిక్స్, క్వాంటం కంప్యూటింగ్ వంటి భవిష్యత్ సాంకేతిక రంగాల్లో తెలంగాణను దేశంలోనే కీలక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా 'తెలంగాణ సిలికాన్ ఫోటోనిక్స్ మిషన్'కు దశలవారీ వ్యూహాత్మక రోడ్‌మ్యాప్ రూపొందించడంపై నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్. వి.కె.సారస్వత్, రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మధ్య ఆదివారం కీలక చర్చ జరిగింది. రాష్ట్ర సచివాలయంలో శ్రీధర్‌బాబుతో వి.కె సారస్వత్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఫోటోనిక్స్ వ్యాలీ కార్పొరేషన్ భవిష్యత్ కార్యాచరణతో పాటు 'ఇండియా సెమీకండక్టర్ మిషన్–2.0'తో తెలంగాణ సిలికాన్ ఫోటోనిక్స్ మిషన్‌ను అనుసంధానించే అవకాశాలపై సమీక్షించారు.

రాష్ట్రంలో పరిశోధన నుంచి వాణిజ్య స్థాయి తయారీ వరకు సమగ్ర సిలికాన్ ఫోటోనిక్స్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయడంపై సమావేశంలో ప్రధానంగా దృష్టిసారించారు. డిజైన్, పరిశోధన, తయారీ, ప్యాకేజింగ్, టెస్టింగ్, సరఫరా వ్యవస్థలను పరస్పరం అనుసంధానం చేసి సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరంపై అభిప్రాయాలు పంచుకున్నారు. పరిశోధనా ఫలితాలను వాణిజ్యపరమైన సాంకేతిక పరిష్కారాలు, ఉత్పత్తులుగా మలిచేలా పరిశ్రమలు, విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థల మధ్య భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంపై కూడా చర్చించారు.

**అధునాతన టెక్నాలజీకి కేంద్రంగా తెలంగాణ..**

రాబోయే రోజుల్లో అధునాతన ఫోటోనిక్ ప్యాకేజింగ్, కోప్యాకేజ్డ్ ఆప్టిక్స్ వంటి తదుపరి తరం సాంకేతికతలకు తెలంగాణను కీలక కేంద్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. నిపుణులు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమలతో కలిసి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకు ఇప్పటి నుంచే దృష్టి సారించినట్లు వివరించారు. త్వరలో ఏర్పాటు చేయనున్న 'సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ క్వాంటం కంప్యూటింగ్'లో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని సారస్వత్‌ను మంత్రి ఆహ్వానించారు. ఫోటోనిక్స్, క్వాంటం కంప్యూటింగ్‌పై ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న అడ్వైజరీ కౌన్సిల్‌కు నాయకత్వం వహించాలని కూడా కోరారు. తెలంగాణతో కలిసి ఫోటోనిక్స్, క్వాంటం కంప్యూటింగ్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని వీకే సారస్వత్ తెలిపారు. పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. సమావేశంలో ఐటిఇ అండ్ సి సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, ఫోటోనిక్స్ వ్యాలీ కార్పొరేషన్ సిఇఒ ఎఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# టిపిసిసి అధ్యక్షుడిగా రెండేళ్లు పూర్తిచేసుకున్న మహేష్‌కుమార్ గౌడ్

### పార్టీ బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణ.. ప్రభుత్వం–పార్టీ సమన్వయానికి పెద్దపీట



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో టిపిసిసి అధ్యక్షుడిగా ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ రెండేళ్ల ప్రస్థానం పూర్తి చేసుకున్నారు. అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్‌కు రెండేళ్లలో సంస్థాగతంగా కొత్త ఊపునిచ్చే ప్రయత్నంతో ముందుకు సాగుతున్నారు. రాజకీయంగా అనేక సవాళ్లు ఎదురైనప్పటికీ పార్టీని కేవలం ఎన్నికల యంత్రాంగంగా కాకుండా గ్రామస్థాయి నుంచి పటిష్టమైన సంస్థగా తీర్చిదిద్దే దిశగా ఆయన ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. పార్టీ బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణతో పాటు ప్రభుత్వం–పార్టీ సమన్వయానికి పెద్దపీట వేశారు. బిసి కులగణన, సామాజిక న్యాయం వంటి అంశాలను పార్టీ అజెండాలో ముందుకు తీసుకెళ్లడంతో పాటు డిసిసి అధ్యక్షుల నియామకాల్లో సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యం ఇచ్చారు. సంఘటన్ సృజన్ అభియాన్‌లో భాగంగా వికారాబాద్‌లో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల డిసిసి అధ్యక్షుల శిక్షణ శిబిరాన్ని భారీ స్థాయిలో నిర్వహించడం సంస్థాగత నిర్మాణంలో కీలక కార్యక్రమంగా నిలిచింది. ఈ శిబిరానికి రాహుల్ గాంధీ, కెసి వేణుగోపాల్ హాజరుకావడం, మహేష్‌కుమార్ గౌడ్ పనితీరును రాహుల్ ప్రశంసించడం పార్టీ వర్గాల్లో అప్పట్లో చర్చనీయాంశమైంది. జిల్లాల్లో డిసిసి అధ్యక్షుల ఆధ్వర్యంలో జరిగే కార్యవర్గ సమావేశాలకు మహేష్‌కుమార్ గౌడ్ స్వయంగా హాజరై నియామక పత్రాలు అందజేయడం ద్వారా రాష్ట్ర–జిల్లా నాయకత్వాల మధ్య ప్రత్యక్ష అనుసంధానానికి ప్రాధాన్యం ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు క్షేత్రస్థాయి సమస్యలను పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకురావడంపై దృష్టి సారించారు. మంత్రులతో ముఖాముఖి కార్యక్రమాలు, పాదయాత్రలు పార్టీకి ప్రజలతో అనుసంధానాన్ని పెంచే ప్రయత్నాలుగా నిలిచాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, నిజామాబాద్ మున్సిపల్ ఎన్నికలు, స్థానిక సంస్థల్లో సాధించిన ఫలితాలు కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని పెంచాయి. రానున్న రోజుల్లో ఈ ఎన్నికల విజయాలను సంస్థాగత బలంగా మలచడం, గ్రామస్థాయిలో కేడర్‌ను మరింత పటిష్టం చేయడంపై మహేష్‌కుమార్ గౌడ్ ఇప్పటీ నుంచే దృష్టి సారించారు.

# 23 ఏళ్లుగా సేవలందిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

### టూరిజం కార్పొరేషన్ ఎండికి ఎఐటియుసి కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ వినతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో ఏళ్ల తరబడి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (ఎఐటియుసి) డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి ఆధ్వర్యంలో శనివారం టూరిజం కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్పొరేషన్‌లో గత 23 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ ఉద్యోగులుగా సేవలందిస్తున్న వారిని క్రమబద్ధీకరించాలని యూనియన్ కోరింది. ప్రభుత్వ ఉద్యోగుల వయోపరిమితిని 61 సంవత్సరాలకు పెంచిన నేపథ్యంలో అదే ప్రయోజనాన్ని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా వర్తింపజేయాలని విజ్ఞప్తి చేసింది. టూరిజం ప్లాజాలో పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు ఇతర ఉద్యోగులకు కూడా వేతనాలు పెంచాలని యూనియన్ కోరింది. ఉద్యోగులకు బస్సు పాస్ సౌకర్యం కల్పించడంతో పాటు తెలంగాణ ఇన్‌క్రిమెంట్లు వర్తింపజేయాలని డిమాండ్ చేసింది.

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్‌తో పాటు టూరిజం శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని కోరింది. ఏళ్ల తరబడి సంస్థలో విధులు నిర్వహిస్తున్నప్పటికీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పలు ప్రయోజనాలు అందడం లేదని యూనియన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఇతర ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న తమకు న్యాయం చేయాలని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అధికారులు సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**145 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులకు న్యాయం చేయాలి :**

తెలంగాణ టూరిజం కార్పొరేషన్‌లో గత 23 సంవత్సరాలుగా పనిచేస్తున్న సుమారు 145 మంది ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, వయోపరిమితి పెంపు ప్రయోజనాన్ని 61 సంవత్సరాలకు వర్తింపజేయాలని యూనియన్ కోరింది. తమ డిమాండ్లపై ప్రభుత్వం, టూరిజం కార్పొరేషన్ యాజమాన్యం తక్షణమే స్పందించి ఉద్యోగులకు న్యాయం చేయాలని సబ్బు రాజమౌళి విజ్ఞప్తి చేశారు.



### కోదండరెడ్డి, కొండలరావు, కనకవ్వలకు పొన్నం సత్తయ్య

# జీవిత సాఫల్య పురస్కారాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వ్యవసాయం, సాహిత్యం, కళారంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న ముగ్గురిని పొన్నం సత్తయ్య జీవిత సాఫల్య పురస్కారాలకు ఎంపిక చేశారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి పొన్నం సత్తయ్య స్మారకార్థం పొన్నం సత్తయ్య ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏటా ఈ పురస్కారాలను అందిస్తున్నారు. వ్యవసాయ రంగంలో విశేష కృషి చేస్తున్న రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, సాహిత్య రంగంలో వెలిచాల కొండలరావు, కళారంగంలో సేవలందిస్తున్న గొట్టే కనకవ్వలను అవార్డులకు ఎంపిక చేసినట్లు ట్రస్టు ఉపాధ్యక్షుడు పొన్నం అశోక్ గౌడ్ తెలిపారు. అవార్డుల జ్యూరీ కమిటీ కన్వీనర్ డాక్టర్ పొన్నం రవిచంద్ర ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ జరిగింది. జ్యూరీ సభ్యులు ఎంపిక చేసిన జాబితాను ఆదివారం ట్రస్టు చైర్మన్ పొన్నం ప్రభాకర్‌కు అందజేశారు.

**ఈనెల 13న రవీంద్రభారతిలో కార్యక్రమం..**

పొన్నం సత్తయ్య 16వ వర్ధంతి సందర్భంగా ఈనెల 13న మధ్యాహ్నం 2 గంటలకు రవీంద్రభారతిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. అవార్డులకు ఎంపికైన ముగ్గురికి రూ.50వేల నగదు పురస్కారంతో పాటు మెమెంటో, ప్రశంసాపత్రం అందజేయనున్నారు. పొన్నం సత్తయ్య ఆశయాలను కొనసాగిస్తూ వివిధ రంగాల్లో సమాజానికి సేవలందిస్తున్న ప్రతిభావంతులను గుర్తించి సత్కరించడమే పురస్కారాల ప్రధాన ఉద్దేశమని పొన్నం అశోక్ గౌడ్ తెలిపారు.

# బిసి కులగణనపై ప్రత్యక్ష పోరాటం

### ఈనెల 11న ధర్మ పోరాట దీక్షలు.. 20న హైదరాబాద్‌లో జాతీయ సదస్సు నవంబర్‌లో పార్లమెంట్ ముట్టడి జాజుల శ్రీనివాస్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా చేపడుతున్న జనగణనలో ఓబిసి కాలమ్‌ను చేర్చాలని డిమాండ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధమవుతున్నట్లు బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. కేంద్రం స్పందించే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని బిసి భవన్‌లో ఆదివారం జరిగిన బిసి సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 11న అన్ని జిల్లా కేంద్రాల్లో బిసిల ధర్మ పోరాట దీక్షలు, 20న హైదరాబాద్‌లో 29 రాష్ట్రాల ఓబిసి ప్రతినిధులతో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. నవంబర్‌లో పార్లమెంట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. ఓబిసి కాలమ్ లేకుండా రూపొందించిన జనాభా లెక్కల ప్రశ్నావళిని రద్దు చేసి, కులగణన ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేయాలని జాజుల డిమాండ్ చేశారు. అఖిలపక్ష పార్టీలు, సామాజిక నిపుణులతో కేంద్ర ప్రభుత్వం సమావేశం నిర్వహించిన అనంతరం కులగణనపై ముందుకు వెళ్లాలని కోరారు.

'బిసి కులగణన చేస్తారో.. గద్దె దిగుతారో బిజెపి తేల్చుకోవాలి' అని ఆయన వ్యాఖ్యానించారు. కులగణనపై కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన వంద రోజుల ప్రత్యక్ష పోరాట కార్యాచరణను స్వాగతిస్తున్నామని చెప్పారు. ఇదే విధంగా ఇతర రాజకీయ పార్టీలు కూడా కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసి బిసిల ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం ఈనెల 20న హైదరాబాద్‌లో జరగనున్న జాతీయ ఓబిసి సదస్సు బ్రోచర్‌ను బిసి సంఘాల నేతలు కుందారం గణేషాచారి, గుజ్జ కృష్ణ, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, తాటికొండ విక్రమ్ గౌడ్, కనకాల శ్యాంకుర్మా, రావులకోల్ నరేష్ ప్రజాపతి, జాజుల లింగం గౌడ్, ఈడిగ శ్రీనివాస్ గౌడ్, డాక్టర్ రమేష్, పానుగంటి విజయ్, గూడూరు భాస్కర్ మేరు, ఇంద్రమ్ రజక, బ్రహ్మాచారి, వెంకటేష్ తదితరులతో కలిసి జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు.

# జిఒ నెం.33ను మంత్రివర్గం ఆమోదించొద్దు

### కె. నారాయణ డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కిడ్నీ మార్పిడిలకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జిఒ నెం.33ను తక్షణమే ఉపసంహరించుకోవాలని, దీనిని రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించవద్దని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె.నారాయణ డిమాండ్ చేశారు. గతంలో కిడ్నీ మార్పిడిల పేరుతో అనేక అక్రమ దందాలు జరిగాయని, కోట్లాది రూపాయల వ్యాపారం సాగిందని నారాయణ అన్నారు. కొత్త జిఓ అమలులోకి వస్తే పేదలు, సామాన్య ప్రజలు మోసపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కిడ్నీ మార్పిడికి రక్త సంబంధీకులకు మాత్రమే అవకాశం కల్పించేలా నిబంధనలను కఠినంగా అమలు చేయాలని కోరారు. జిఓ నెం.33 ద్వారా ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులకు మరింత అవకాశం కల్పించే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. దీనివల్ల అవయవ మార్పిడి వైద్యం వ్యాపారంగా మారి పేద ప్రజలే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. సామాన్యులకు ప్రయోజనం కల్పించకుండా కార్పొరేట్ వైద్య రంగానికి మేలు చేసే విధానాలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు. తెలంగాణ కేబినెట్ సమావేశంలో జిఒ నెం.33కు ఆమోదం తెలిపే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించాలని నారాయణ సూచించారు.

# కాంగ్రెస్‌లో క్రమశిక్షణ కొరడా..!

### ఆరుగురికి షోకాజ్ నోటీసులు.. వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తూ వ్యవహరించారంటూ వచ్చిన ఫిర్యాదులపై తెలంగాణ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ కొరడా ఝుళిపించింది. పార్టీ వ్యవహారాల్లో వివాదాస్పదంగా వ్యవహరించారన్న ఆరోపణలపై ఆరుగురు నాయకులకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వారం రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించినట్లు క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌కు పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరించారన్న ఫిర్యాదుపై నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు. సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి మధ్య చోటుచేసుకున్న వివాదానికి సంబంధించి సంజీవరెడ్డికి కూడా షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. నర్సారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఫిర్యాదుతో జూపల్లి మల్లారెడ్డికి నోటీసులు జారీ చేసినట్లు మల్లు రవి చెప్పారు. అలాగే ఎంపి వంశీ కారుపై దాడి చేశారన్న ఫిర్యాదుపై గజ్వేల్ నర్సారెడ్డికి షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. క్రమశిక్షణ కమిటీ నిర్ణయాలపై స్పందించిన మల్లు రవి.. పార్టీకి వ్యతిరేకంగా పనిచేయడం తన డిక్షనరీలోనే లేదని స్పష్టం చేశారు. తాను ఏదైనా తప్పు చేసి ఉంటే ఎఐసిసికి ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. తనకు టికెట్ రాకపోయినా పొత్తులో భాగంగా బిఆర్‌ఎస్ కోసం పనిచేసిన సందర్భం ఉందని గుర్తు చేశారు. తాను ఎవరికీ వ్యతిరేకం కాదని, కాంగ్రెస్‌కు అనుకూలంగా మాత్రమే ఉంటానని పేర్కొన్నారు. ఎవరిపైనా కక్షతో నివేదిక ఇవ్వలేదని, కొండా సురేఖ, చిన్నారెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని మల్లు రవి స్పష్టం చేశారు. వారంతా తనకు మిత్రులేనని తెలిపారు.

**రాజగోపాల్‌రెడ్డి రాక శుభ పరిణామం :** నకిరేకల్ సభకు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హాజరు కావడం మంచి పరిణామమని మల్లు రవి అన్నారు. ఆయన సీనియర్ నాయకుడని, ఒకసారి బిజెపిలోకి వెళ్లి తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. ఏ సమస్యనైనా చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చనే విషయాన్ని ఆయన చూపించారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన ధర్మబద్ధంగా సాగుతోందని మల్లు రవి అన్నారు. మహిళా మంత్రిగా కొండా సురేఖ సిఎంకు రాఖీ కట్టిన తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు ధర్మం ప్రకారమే జరిగాయని వ్యాఖ్యానించారు. అయితే వారిపై తనకు ప్రేమ, గౌరవం ఏమాత్రం తగ్గలేదన్నారు. పార్టీ క్రమశిక్షణ విషయంలో కఠినంగా ఉండాలని పార్టీ అధిష్ఠానం ఆదేశించిందని తెలిపారు. పార్టీకి సంబంధించిన ఫిర్యాదులు, సమస్యలు ఉంటే గాంధీభవన్‌కు వచ్చి చెప్పుకోవాలని సూచించారు. ధర్నాలు, బహిరంగ నిరసనలకు దిగితే మాత్రం క్రమశిక్షణ చర్యలు తప్పవని మల్లు రవి హెచ్చరించారు.

# మెట్రో, ఆర్‌టిసి ఉమ్మడి పాస్‌లను వెంటనే ప్రవేశ పెట్టాలి

### అధికారులను ఆదేశించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో మెట్రోరైల్, ఆర్‌టిసి బస్సు ప్రయాణానికి ఉమ్మడి పాస్‌ను వెంటనే ప్రవేశపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. ప్రజలకు సౌలభ్యంగా ఉండేలా నెలవారీ, రోజువారీ పాస్‌లను జారీ చేయడానికి ఏర్పాట్లు చేయాల్సిందిగా మెట్రో, ఆర్‌టిసి అధికారులకు సూచించారు. బేగంపేట్ మెట్రోరైల్ భవన్‌లో ఆదివారం మెట్రోరైల్, టిజిఎస్ ఆర్‌టిసి, విద్యుత్, జలమండలి శాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎం.డి. సర్ఫరాజ్ అహ్మద్, అడిషనల్ ఎంపి అజిత్ రెడ్డి, జాయింట్ ఎండి శివేంద్ర ప్రతాప్‌లు మెట్రోరైల్ మొదటి, రెండవ దశలకు సంబంధించిన పనుల వివరాలను సిఎస్‌కు వివరించారు. నగర ప్రజలకు మెరుగైన, సమర్థవంతమైన, సురక్షితమైన ప్రజా రవాణా సేవలు అందించేందుకు తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న రవాణా అవసరాలకు అనుగుణంగా మెట్రో రైలు వ్యవస్థను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవడం, ప్రజలకు మెరుగైన కనెక్టివిటీ కల్పించడం, ప్రయాణికుల సౌకర్యాలను మరింత విస్తరించడంపై అధికారులతో చర్చించారు.

పాతనగరంలో 7.5 కిలోమీటర్ల మెట్రో కారిడార్ కోసం రహదారుల విస్తరణ పనులు, తాజా స్థితిగతులను ఆయన అడిగి తెలుసుకున్నారు. జనరల్ కన్సల్టెన్సీ నియామకానికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ ప్రస్తుత స్థితిని అధికారులు ఆయనకు వివరించారు. విస్తరణ పనులు వేగవంతం చేయాలని, త్వరితగతిన మెట్రో పనులు ప్రారంభం కావాలని సిఎస్ ఆదేశించారు. మెట్రో, ఆర్‌టిసి ప్రయాణికులకు ఉమ్మడి పాస్ జారీ చేయడానికి సాంకేతిక పరంగా సిద్ధంగా ఉన్నామని, ఏ రోజైనా అమలు చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎల్ అండ్ టి, మెట్రోరైల్, ఆర్‌టిసి అధికారులు తెలిపారు. ఉమ్మడి చార్జీలను త్వరితగతిన ఖరారు చేసి, వెంటనే పాస్‌ల విధానాన్ని అమలు చేయాలని సిఎస్ ఆదేశించారు.

**మెట్రో సేవలపై సిఎస్ సంజయ్ జాజు సంతృప్తి**

వేగవంతమైన, సురక్షితమైన, పర్యావరణహిత ప్రజా రవాణా అందించడంలో మెట్రో రైలు కీలక పాత్ర పోషిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. బేగంపేట్ మెట్రో స్టేషన్ నుంచి ప్యారడైజ్ మెట్రో స్టేషన్ వరకు సాధారణ ప్రయాణికుడిలా ప్రయాణించారు. మెట్రోరైల్‌లో సేవలు, స్టేషన్‌లలోని ప్రయాణికుల సౌకర్యాలు, నిర్వహణ వ్యవస్థను పరిశీలించారు. ప్రయాణ సమయంలో రైళ్ల నిర్వహణ, ప్రయాణికుల రద్దీ, స్టేషన్‌లలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, సేవల నాణ్యత వంటి అంశాలను తనిఖీ చేశారు. సేవల నాణ్యతను నిరంతరం మెరుగుపరిచే దిశగా చర్యలు కొనసాగించాలని అధికారులకు సూచించారు. సాధారణ ప్రయాణికుడిగా ప్రయాణించడం ద్వారా క్షేత్రస్థాయిలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను, వారి అనుభవాలను నేరుగా తెలుసుకోవడానికి వీలు కలిగిందని తెలిపారు.

పెరుగుతున్న నగర అవసరాలకు అనుగుణంగా మెట్రో సేవలను మరింత సమర్థవంతంగా విస్తరించాలని, సేవల నాణ్యతను నిరంతరం పెంచేలా చర్యలు తీసుకోవాలని సిఎస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో జలమండలి ఎండి అశోక్ రెడ్డి, హెచ్‌ఎంఆర్ చీఫ్ ఎలక్ట్రికల్ ఆఫీసర్ డివిఎస్ రాజు, సిఎస్‌టిఈ స్వప్న కుమార్ దాస్, చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద్ మోహన్, చీఫ్ ఇంజనీర్ భాస్కర్ రెడ్డి, జిఎం(ఫైనాన్స్) సూర్యప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

## ఎఐటియుసి 4వ మహాసభ బహిరంగ సభకు తరలిన నాయకులు




**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** తెలంగాణ రాష్ట్ర ఎఐటియుసి మహాసభకు మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు ఉమామహేష్ జెండా ఊపి కరీంనగర్ సభకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షు లు హరినాథ్ రావ్, కార్యదర్శి స్వామి, మిన్సిపల్ సంఘము నాయకురాలు కమల, గంగమణి, హమాలి సంఘము నాయకులు మహేందర్, బక్కడి మ ల్లేష్, హరీషరెడ్డి భవననిర్మాణ కార్మిక సంఘము నాయకులు సామేల్, మహిళ సంఘం అధ్యక్షురాలు హైమావతి తదితరులు మహాసభకు బయలుదేరారు.

## ఎఐ ఎంఎల్‌పై అనురాగ్ వర్సిటీ కీలక ఒప్పందం



**ప్రజాపక్షం /ఘట్‌కేసర్ :** కృత్రిమ మేధస్సు యంత్ర అభ్యాస రంగాల్లో విద్యార్థులకు పరిశ్రమ స్థాయి నైపుణ్యాలు అందిచేందుకు అనురాగ్ యూ నివర్సిటీ కీలక అడుగు వేసింది. భారత్ శ్రీలంక,యునైటెడ్ కింగ్‌డమ్‌లలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న లోమూస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో అనురాగ్ యూనివర్సిటీ కృత్రిమ మేధస్సు,యంత్ర అభ్యాస విభాగం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంపై లోమూస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ముఖ్య నిర్వహణ అధికారి వినోద్ కుమార్ కిల్లే సంతకం చేశారు. అనురాగ్ యూనివర్సిటీ విభాగాధిపతి డా.ఎ.మల్లికార్జున రెడ్డి, సహాయ ఆచార్యుడు డా.ఆర్ శ్రవంత్ కుమార్ రామకూరి సమన్వయంతో ఒప్పంద ప్రక్రియ పూర్తియింది.ఈ భాగస్వామ్యం ద్వారా విద్యార్థులకు పరిశ్రమ ఆధారిత శిక్షణ,శిక్షణార్థి అవకాశాలు ప్రాయోగిక ప్రాజెక్టులు,పరిశోధన సహకారం నిపుణుల ఉపన్యాసాలు,ఉద్యోగ అవకాశాలు అందనున్నా యి. అభివృద్ధి చెందుతున్న కృత్రిమ మేధస్సు సాంకేతికతలపై పరిశ్రమ అ నుభవంతో కూడిన ప్రాయోగిక పరిజ్ఞానం పొందే అవకాశం కలగనుంది. విద్య,పరిశ్రమ భాగస్వామ్యంతో విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలు,పరిశోధనా దృక్పథం,ఆవిష్కరణ సామర్థ్యం పెరగడంతో పాటు భవిష్యత్ ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని విశ్వవిద్యాలయ ప్రతినిధులు తెలిపారు.

## ఆలయంలో సీసీ కెమెరాలు ప్రారంభం



**ప్రజాపక్షం/దుండిగల్ :** శివాలయ నగర్ దుర్గామాత ఆలయం వద్ద భక్తులు, కాలనీ ప్రజల భద్రత కోసం 293వ జిహెచ్‌ఎంసి సురారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి.శ్రీశైలం యాదవ్ అందజేసిన సీసీ కెమెరాలను ప్రారంభించి వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమం సిఐ బాల రాజు, ఎస్‌ఐ రాజు సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా ఆలయ పరిసరాల్లో భద్రత మరింత పటిష్టం అవుతుందని, అనుమానాస్పద కదలికలను గుర్తించడంలో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రజా భద్రతకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని పి.శ్రీశైలం యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ నాయకులు వెంకటేష్ గౌడ్, రేషన్ డీలర్ శాలివాహన వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షులు కుమ్మరి వెంకటేష్, మణి, నాగరాజు, శివ, శ్రీను, సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానికి గడ్డు కాలమే



**ప్రజాపక్షం/ఉప్పల్ :** 1000 రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిరసనగా ఆదివారం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మల్లాపూర్ ఎలిఫెంట్ చౌరాస్తా నుండి నాచారం వరకు భారీ ఆటో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆటో డ్రైవర్ దుస్తులతో ఆటో ఎక్కి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఇకనైనా ప్రభుత్వం కళ్లు తెరచి మిగిలిన కాలంలోఅయినా ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేసారు. రానున్న కాలమంతా కాంగ్రెస్ ప్రభుత్వానికి గడ్డు కాలమేనని, ఆ పార్టీకి పుట్టగతులు లేకుండా ప్రజల చేతిలో చావుదెబ్బ తింటారని దుయ్యబట్టారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చటంలో ప్రభుత్వ చాతకానితనం స్పష్టంగా కనపడుతోందని, బిఆర్ఎస్ పార్టీ మాత్రమే రాష్ట్రానికి సుభిక్ష పాలన అందచేయగలదన్న విషయం ప్రజల్లో బలంగా నిండిపోయిందని, రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ మరో సారి అధికారంలోకి రావటం తథ్యమన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా బస్తీ దవఖానాలు, ప్రభుత్వ పాఠశాలల ఏర్పాటు చేయాలని, అవసరమైన మౌలిక సదుపాయాలు కలుగ చేయాలని డిమాండ్ చేసారు.

## ప్రేమ వైఫల్యంతో యువకుడి ఆత్మహత్య

**ప్రజాపక్షం/ఉప్పల్ :** ప్రేమ వైఫల్యం అంటూ సూసైడ్ నోట్ రాసి ఓ యువకుడు ఓయో హోటల్‌లో ఆత్మహత్య చేసుకొన్న ఉదంతం ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని వారాసిగూడ ప్రాంతానికి చెందిన చుక్క హేమంత్‌సాగర్ (26) ఉప్పల్‌లోని ఎన్ఎస్ఎల్ ఆరీనా టవర్‌లోని ఓ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం సాయంత్రం అతడు ఉప్పల్‌లోని ఎస్ఎల్ఎన్ గ్రాండ్ ఓయో హోటల్‌లో ఓ గదిని అద్దెకు తీసుకొన్నాడు.అప్పటి నుండి ఆదివారం మధ్యాహ్నం వరకు గదిలోంచి బయటకు రాక పోవటం, గదిని శుభ్రం చేసేందుకు హోటల్ సిబ్బంది ఎన్ని సార్లు పిలిచినా తెరవక పోవటంతో అనుమానం వచ్చిన యాజమాన్యం గదిని పరిశీలించగా బాత్‌రూంలోని షవర్ పైపుకు చున్నీతో ఉరేసుకొని ఉండటం కనిపించింది. ఈ మేరకు హోటల్ యాజమాన్యం అందించిన సమాచారంతో అక్కడకి చేరుకొన్న పోలీసులు మృతదేహాన్ని శవ పంచనామా నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కాగా హోటల్ గదిలో ఓ యువతి తనను ప్రేమించి మోసం చేసిందని, ఆ కారణంగానే తనువు చాలిస్తున్నాన్న సూసైడ్ లేఖ కనిపించిందని, దీన్ని స్వాధీనం చేసుకొని తదుపరి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## తక్షణమే ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

**ప్రజాపక్షం/దుండిగల్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను నెరవేర్చడంలో విఫలమైందని దుండిగల్ మాజీ వైస్ చైర్మన్ తుడుము పద్మారావు అన్నారు. అనంతరం మాట్లాడుతూ, 1000 రోజుల పాలన పూర్తయినా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు నేటికీ కాగితాలకే పరిమితమయ్యాయనీ, ప్రజలకు ఇచ్చిన మాటను నీరుగార్చి, వారి నమ్మకాన్ని దెబ్బతీశారనీ ఓట్ల కోసం నెరవేర్చలేని వాగ్దానాలు చేసి, అధికారంలోకి వచ్చాక ప్రజలను గాలి కొదిలేసిన కాంగ్రెస్ వైఫల్యాలను ప్రతి వీధిలోనూ, ప్రతి ఇంట్లోనూ ఎండగడతామని రుణమాఫీ అని చెప్పి రైతులను, ఉద్యోగాలని చెప్పి నిరుద్యోగ యువతను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని, ఇది ప్రజా పాలన కాదు, అబద్ధాల పాలన అని అన్నారు.

## గణేశ్ ఉత్సవాల్లో విద్యుత్ భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నెం:1912

**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** భారతదేశంలోనే తెలంగాణలో జరిగే సామూహిక వినాయక ఉత్సవాలకు ఎంతో ప్రత్యేకమైనది. కోట్లాది మంది భక్తులు పాల్గొనే ఉత్సవాల సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో చేపట్టే ఏర్పాట్లకు ప్రాధాన్యత ఉంటుంది. ఈ క్రమంలోనే రాష్ట్ర వ్యాప్తంగా వేలాది గణేశ్ మంటపాలు ఏర్పాటు చేసి భక్తులు ఘనంగా ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ వేడుకలు సురక్షితంగా, ప్రమాదరహితంగా జరగాలంటే విద్యుత్ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం అవసరం. చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారి తీసే అవకాశం ఉంది. గణేశ్ మంటపాల్లో అధికంగా లైటింగ్, సౌండ్ సిస్టమ్స్, డిజిటల్ డిస్‌ప్లేలు, అలంకరణలు ఏర్పాటు చేయడం వల్ల విద్యుత్ వినియోగం పెరుగుతుంది. ఈ సమయంలో నాసిరకం వైరింగ్, ఓవర్‌లోడింగ్, అనధికారిక కనెక్షన్లు, భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. గణేశ్ మంటపాలకు అవసరమైన విద్యుత్ కనెక్షన్లను కేవలం టిజిఎస్‌పిడిసిఎల్ అధికారుల ద్వారా మాత్రమే పొందాలి. విద్యుత్ స్తంభాలు లేదంటే లైన్ల నుంచి అనధికారికంగా కనెక్షన్లు తీసుకోవడం చట్టవిరుద్ధమే కాకుండా అత్యంత ప్రమాదకరం. మంటపాల్లో ఉపయోగించే కేబుళ్లు, వైర్లు, స్విచ్‌బోర్డులు నాణ్యమైనవిగా ఉండాలి. ప్రతి రోజు వైరింగ్ వ్యవస్థను తని ఖీ చేయాలి. ఎక్కడైనా వైర్లు దెబ్బతిన్నా, ఇన్సులేషన్ ఊడిపోయినా వెంటనే మార్చాలి. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లకు సమీపంలో మంటపాలు ఏర్పాటు చేయరాదు.

### నిమజ్జన ఊరేగింపులో జాగ్రత్తలు

గణేశ్ నిమజ్జన ఊరేగింపుల సమయంలో భారీ విగ్రహాలు, క్రేన్లు, ట్రక్కులు వినియోగిస్తారు. ఎత్తైన విగ్రహాలు విద్యుత్ లైన్లకు తగిలే ప్రమాదం ఉంటుంది. అందువల్ల ఊరేగింపు మార్గాలను ముందుగానే పరిశీలించి విద్యుత్ లైన్ల నుంచి సురక్షిత దూరం పాటించాలి. క్రేన్లు, లోహపు ఫ్రేములు, ఎత్తైన అలంకరణలు ఉపయోగించే సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్ తీగలకు సమీపంగా వెళ్లే పరిస్థితి ఉంటే వెంటనే టిజిఎస్‌పిడిసిఎల్ అధికారులను సంప్రదించాలి. కాగా వినాయక ఉత్సవాలు ఆనందోత్సాహాల మధ్య జరిగే ప్రజా పండుగని... ఈ పండుగలో భక్తి ఎంత ముఖ్యమో, భద్రత కూడా అంతే ముఖ్యమైనదని ఎస్‌పిడిసిఎల్ సిఎండీ జితేష్ పాటిల్ సూచించారు. విద్యుత్ భద్రతా నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాల ను నివారించడంతో పాటు ప్రతి కుటుంబం, ప్ర తి భక్తుడు సురక్షితంగా ఉత్సవాలను జరుపుకోవచ్చని తెలిపారు. విద్యుత్ సంబంధిత అత్యవస ర పరిస్థితి తలెత్తినప్పుడు టిజిఎస్‌పిడిసిఎల్ టోల్ ఫ్రీనెం 1912కు వెంటనే సమాచారం అం దించాలన్నారు. భద్రతతో కూడిన గణేశ్ నవరా త్రి ఉత్సవాలు ప్రతి ఒక్కరి సహకారంతోనే సా ధ్యమని సిఎండి జితేష్ పాటిల్ స్పష్టం చేశారు.

## అనంతగిరి కొండల్లో సైక్లింగ్ సందడి



**ప్రజాపక్షం /వికారాబాద్ :** పర్యావరణ పరిరక్షణ అటవీ సంరక్షణతోపాటు పర్యావరణ పర్యాటకపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో నిర్వహించిన, టూర్ ఆఫ్ అనంతగిరి సైక్లింగ్ కార్యక్రమం ఆదివారం ఉత్సహభరితంగా సాగింది. నార్సింగి నుంచి ప్రారంభమైన సైక్లింగ్ కార్యక్రమం అనంతగిరిలో ముగిసింది. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో సైక్లిస్టు లు ఉత్సాహంగా పాల్గొని ప్రకృతి అందాల నడుమ సైక్లింగ్ చేశారు. చార్మినార్ సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ ప్రియాంక వర్గీస్ , ఐఎఫ్ఎస్ చొరవతో మార్గదర్శకత్వంలో ఈకార్యక్రమాన్ని ప్రోత్సహించడంతో పాటు అడవుల సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెపోందించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వహకులు తెలిపారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా అటవీశాఖ అధికారి విశాల్ బత్తుల సైక్లిస్టులను ఉద్దేశించి ప్రసగించారు. అటవీ సంరక్షణ ప్రాధాన్యతను వివరించడంతోపాటు వికారాబాద్ జిల్లాలోని ప్రకృతి సౌందర్యం, అటవీ ప్రాంతాలు , పర్యావరణ పర్యాటకానికి ఉన్న అవకాశాలను వివరించారు.ప్రకృతి సంపదను ఆస్వాదించడంతో పాటు దాని పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృ షి చేయాలని సూచించారు. కార్యకమంలో వేదిక వద్ద అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రచార ప్రధర్శనలను ఏర్పాటు చేశారు అనంతగిరి ఎకోఆర్బన్ పార్క్,కోట్‌పల్లి బోటిం గ్‌తో పాటు జిల్లాలో చేపడుతున్న కార్యక్రమలపై అవగాహన కల్పించారు.

## డైమండ్ ఫుడ్ కోర్ట్‌లో అన్నంలో ఎలుకల మలం!

హోటళ్లలో ఆహార భద్రతపై అధికారుల పర్యవేక్షణ ఏదీ..?



**ప్రజాపక్షం/నవాబుపేట్ :** నవాబుపేట్ మండల కేంద్రంలోని కొన్ని హోటళ్ల నిర్వాహకులు ఆహార భద్రతా నిబంధనలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆదివారం మండల కేంద్రంలోని డైమండ్ ఫుడ్ కోర్ట్‌లో అన్నంలో ఎలుకల మలం ఉన్నట్లు వినియోగదారులు గుర్తించి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై హోటల్ నిర్వాహకులను ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానాలు ఇచ్చారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఇటీవల కూడా నవాబుపేట్ మండల కేంద్రంలోని జై భవాని హోటల్‌లో అన్నంలో పురుగులు కనిపించిన ఘటన వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఆ సమయంలోనూ నిర్వాహకులు పొరపాటు జరిగిందంటూ సమాధానం చెప్పినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. హోటళ్లలో అపరిశుభ్రత, నాణ్యత లేని ఆహారం అందిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నప్పటికీ సంబంధిత ఫుడ్ సేఫ్టీ అధికారులు ఇప్పటివరకు హోటళ్లపై పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహించకపోవడంపై మండల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కలుషితమైన లేదా అపరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం వల్ల ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నవాబుపేట్ మండల కేంద్రం లోని హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, ఆహార నాణ్యతను పరిశీలించాలని, నిబంధనలు ఉల్లంఘించిన హోటళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## ఇందిరమ్మ ఇల్లు.. నెరవేరిన సొంతింటి కల

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సామ వెంకట్ రెడ్డి

**ప్రజాపక్షం/నవాబుపేట్:** యావపూర్ గ్రామానికి చెందిన రమణ కుమార్ దంపతుల సొంతింటి కల ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సాకారమైంది. ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకున్న రమణ కుమార్ దంపతులు ఆదివారం నూతన గృహప్రవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. నూతన గృహప్రవేశ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ శివనీల లక్ష్మణ్, నవాబుపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సామా వెంకటరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై రిబ్బన్ కట్ చేసి రమణ కుమార్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. సొంత ఇల్లు నిర్మించుకుని గృహప్రవేశం చేసుకోవడం ప్రతి కుటుంబానికి ఎంతో ఆనందకరమైన విషయమని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని, సొంతింటితో ప్రతి కుటుంబంలో ఆత్మవిశ్వాసం, భరోసా పెరుగుతుందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మేడిపల్లి వెంకటయ్య, నవాబుపేట్ సర్పంచ్ గాజులగూడెం నరసింహారెడ్డి, మామిడిపల్లి సర్పంచ్ దాన నర్సింలు, తిమ్మారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ అంతగిరిపల్లి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ నాయకులు బైక్ ర్యాలీ

ప్రజాపాలన విజయోత్సవాల్లో కాంగ్రెస్ శ్రేణులు



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా మహా బైక్‌ర్యాలీ ఘనంగా నిర్వహించారు. నారపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద డివిజన్ అధ్యక్షుడు కర్రే రాజేష్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీని మేడ్చల్ మాజీ శాసనసభ్యుడు మల్లి పెద్ది సుధీర్ రెడ్డి, మల్లిపెద్ది శరత్ చంద్రా రెడ్డిలు జెండా ఊపి ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు గ్రామశాఖ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని డివిజన్‌లోని పలు గ్రామాల్లో బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కర్రే రాజేష్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు పాలించినా ప్రజలకు ఆశించిన స్థాయిలో మేలు జరగలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తోందని తెలిపారు.రాబోయే ఎన్నిక ల్లో బిఆర్ఎస్, బిజెపికి దీటుగా కాంగ్రెస్ పార్టీ జెండాను మళ్లీ ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పేదల సంక్షేమం కోసమే ఇందిరమ్మ ఇళ్ల పథకం

అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** నిరుపేదల సంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం తీసుకవచ్చిందని, తెలంగాణ రాష్ట్రంలో లక్షలాది కుటుంబాలకు భరోసా కల్పుతుందని అలియాబాద్ మున్సిపాలిటి చైర్‌పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం అలియాబాద్ మున్సిపాలిటీ లాల్‌గడిమలక్‌పేటలో కైర పార్వతమ్మ శంకరయ్య, తుర్కపల్లిలో చీర్ల లక్ష్మి , మల్లేష్‌ల నూతన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశాలను ప్రారంబించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నెరవేర్చుతున్న సిఎం రేవంత్‌రెడ్డికి ప్రతి ఒక్కరు రుణపడి ఉండాలని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ కన్‌రెడ్డి మాలతి మాధవరెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్, కౌన్సిలర్లు కైర గణేష్, గుర్క దీప సాయికృష్ణ యాదవ్, జశ్వంతరెడ్డి, ఎఎంసి డైరక్టర్ తుంకి బిక్షపతి, నాయకులు బండారి బాబు, నేమూరి రాంప్రసాద్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

### మూడుచింతలపల్లిలో

మూడుచింతలపల్లి మున్సిపల్‌లో ఉద్దెమర్రి, పొన్నాల్ గ్రామాల్లో నవనీత శ్రీను, శ్యామలకు మంజూరైన నూతన ఇందిరమ్మ ఇండను మూ దుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్ ఆధ్వర్యంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖ్య అతిదిగా విచ్చేసి రిబ్బన్ కట్‌చేసి ప్రారంబించారు. అనంతరం వారు మాట్లాడుతూ మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అ ధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ సహాకారం తో ఇందిరమ్మ ఇండ్లతో పాటు ప్రభుత్వ సంక్షే మ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల ర్లు దోసకాయల లత వెంకటేష్, రాజిగళ్ల లతా భూపాల్, పెద్ది శ్రీలత వెంకట్ రెడ్డి, తుంకి వెంకటేష్, గడ్డం రమేష్, ఆకుల నాగేష్, బొమ్మలపల్లి మల్లేష్ యాదవ్,లక్ష్మ ణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా వినాయక ఉత్సవాలు

జీనోమ్‌వ్యాలీ ఇన్స్‌పెక్టర్ గురువయ్య గౌడ్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** వినాయక చవితి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జరుపుకోవాలని జీనోమ్‌వ్యాలీ ఇన్స్‌పెక్టర్ గోపగాని గురువయ్యగౌడ్ తెలిపారు. ఆదివారం తుర్కపల్లిలోని జీనోమ్‌వ్యాలీ పోలీస్‌స్టేషన్‌లో వినాయక మండప నిర్వాహకులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండపాల భద్రత ప్రమాణాలు పాటించాలని, విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు జరుగుకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ట్రాఫిక్ అంతారాయం కలుగకుండా చూసుకోవాలని చెప్పారు. సౌండ్ సిస్టమ్‌ల విషయంలో నిబంధనలు పాటించడం వంటి అంశాలపై నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మంటప నిర్వాహకులు, పోలీసులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బిఆర్ఎస్ నిరసన హోరు

చీపురు పట్టిన మాజీ ఎంఎల్ఎ పైలెట్





**ప్రజాపక్షం/తాండూరు :** కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలనపై బిఆర్ఎస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు తాండూరు పట్టణంలో మాజీ ఎంఎల్ఎ పైలెట్ రోహిత్‌రెడ్డి నిరసన వ్యక్తం చేశారు. పల్లెల విధ్వంసం...తాగునీటి సమస్యలు, పడకేసిన పారిశుధ్యంపై నిరసన కార్యక్రమంలో భాగంగా తాండూరు పట్టణంలో ఆదివారం మాజీ ఎంఎల్ఎ పైలెట్ రోహిత్‌రెడ్డి బిఆర్ఎస్ కౌన్సిలర్‌లు, మహిళలతో కలసి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. మహిళలతో కలసిన బసవన్న కట్ట సమీపంలో స్వయంగా చీపురులు చేతపట్టి రోడ్డు శుభ్రం చేశారు. అనంతరం భద్రేశ్వర చౌక్‌లో కాలీ బిందెలతో మహిళలతో కలసి మంచినీటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ పనితీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్ఎ పైలెట్ రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతుంటే నాయకులు, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పట్టణంలో నెలకొన్న పారిశుధ్యం, తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దీపాన ర్సింములు, మాజీ కౌన్సిలర్‌లు శోభరాణి, కౌన్సిలర్‌లు,మహిళలు, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### నవాబుపేట్ మండల కేంద్రంలో...

కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో నగరాలు చీకట్లోకి, పల్లెలు చెత్తకుప్పల్లోకి వెళ్లాయని బిఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. నవాబుపేట్ మండల కేంద్రంలో ఐదో రోజు ప్రభుత్వ ఆసుపత్రి, బిసి, ఎస్‌సి హాస్టళ్లను నాయకులు పరిశీలించారు. ఆసుపత్రిలో పారిశుధ్య సమస్యలను వెంటనే పరిష్కరించాలని డాక్టర్ రోహిత్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం బిసి, ఎస్‌సి హాస్టళ్లను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న వసతులు, పరిశుభ్రతపై వార్డెన్లను అడిగి తెలుసుకున్నారు. నగరాల్లో తాగునీరు, వీధి దీపాలు, బస్తీ దవాఖానాలు, శాంతిభద్రతల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ నగరాల్లో ఆటోల ర్యాలీలు, పల్లెల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పురుషోత్తం చారి, శాంతి కుమార్, ప్రధాన కార్యదర్శి పోలీస్ మహేశ్వర్ రెడ్డి, రైతు సంఘం అధ్యక్షులు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

### కొడంగల్ నియోజకవర్గంలో

కొడంగల్ నియోజకవర్గంలోని బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో పల్లె విధ్వాంసం, గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యానికి నిరసనగా మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు యాదగిరి దుద్యాల మండల మాజీ అధ్యక్ష చాంద్‌పాషా,శావణ్‌గౌడ్ ,మధుసూదన్ ,మహేందర్,నారాయణరెడ్డి,మహేందర్‌రెడ్డి ,సలాం తదితరులు పాల్గోన్నారు.



## ప్రతి పాఠశాలకు గ్రంథాలయం, లైబ్రేరియన్ ఉండాలి : సత్యప్రసాద్

**ప్రజాపక్షం/చర్లపల్లి :** ప్రతి పాఠశాలకు గ్రంథాలయం,అర్హత కలిగిన లైబ్రేరియన్ ఉండాలని ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్ తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ మంత్రి ధనసరి అనసూయా(సీతక్క)కు తెలంగాణ లైబ్రరీ సైన్స్ నిరుద్యోగ ప్రొపెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సాయిలుతో కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పౌర గ్రంథాలయాలు పౌరులకు సరైన వసతులు కల్పించక, పుస్తకాలు అందుబాటులో లేక ఎంతోమంది యువత ప్రైవేట్ స్టడీ సర్కిల్స్‌కు వెళ్లాల్సి వస్తోందని ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి లైబ్రరీల నిర్వహణ రాక లైబ్రరీ సేవలు సరిగ్గా అందుబాటులోకి తేవడం లేదని,గత 35 సంవత్సరాల నుండి పౌర గ్రంథాలయంలో ప్రత్యక్ష నియమాకాలు లేక లైబ్రరీ సైన్స్ కోర్సెస్ చేసిన సుమారు 2లక్షల అభ్యర్థులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో కచ్చితంగా ఈ సమస్య విద్యా శాఖ మంత్రి, సిఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా నాయకులు గగనం గిరిబాబు,మల్లుల చంద్రశేఖర్,విజయ్ లైబ్రరీ సైన్స్ అభ్యర్థులు సుదర్శన్,కపిల్,ప్రతాప్,విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## 80 మంది ఉపాధ్యాయులకు సన్మానం

**ప్రజాపక్షం/చర్లపల్లి :** ఉపాధ్యాయ స్థాయి నుండి రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయాలను అమలు జరిపే క్రమంలో ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని లయన్స్ క్లబ్ ఆఫ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కళ్లెం కృష్ణారెడ్డి అన్నారు.ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా డిస్ట్రిక్ట్ 320సి ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సన్మాన నిర్వాహకులు, టీచర్స్ హనరింగ్ సెక్రెటరీ సభాధ్యక్షులు లయన్ చంద్రమోహన్ వివిధ జిల్లాలకు చెందిన 80 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్లు ఇన్నారెడ్డి,వెంకటనారాయణరెడ్డి,డిస్ట్రిక్ట్ ఫస్ట్ వైస్ గవర్నర్ మండా సురేష్,సెకంట్ వైస్ గవర్నర్ గుంటుక శేఖర్‌రెడ్డి,లయన్ నాగన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్లెం మోహన్‌రెడ్డి,కోశాధికారి మూలపర్తి శ్రీనివాస్, రాములు,లయన్ పెంటయ్యగౌడ్,కోమల్‌రెడ్డి,పావనీరెడ్డి,వంజరి ప్రవీణ్ కరిపే తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ సంఘం పగ్గాలు చంద్రశేఖర్‌కే

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ముదిరాజ్ సంఘం అధ్యక్ష పదవికి పసులాది చంద్రశేఖర్ ముదిరాజ్ రెండోసారి ఎన్నికయ్యారు. ముదిరాజ్‌ల అభివృద్ధి, సంక్షేమం, సంఘటిత బలోపేతం, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగేందుకు నాయకులు ముదిరాజ్ సోదరులు ఆయనకు మరోసారి బాధ్యతలు అప్పగించారు. ఆదివారం ఘట్‌కేసర్‌లోని ముదిరాజ్ సంఘం కార్యాలయంలో మన్నే రమేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో పాల్గొన్న మెజారిటీ ముదిరాజ్ సోదరులు పసులాది చంద్రశేఖర్‌ను సంఘం అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నుకున్నారు.అనంతరం చంద్రశేఖర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మరోసారి అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన ముదిరాజ్ సోదరులకు కృతజ్ఞతలు తెలిపారు.ముదిరాజ్‌ల అభివృద్ధి,సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు.

## యువత స్వయం ఉపాధి దిశగా అడుగులు




**ప్రజాపక్షం/శామీర్ పేట :** యువత స్వయం ఉపాధిలో రాణించాలని ఆ దిశగా అడుగులు వేస్తు ఆర్థికంగా స్థిరపడాలని లక్ష్మాపూర్ 3వ వార్డు కౌన్సిలర్ శ్రీవా ణి వైద్యనాథ్ అన్నారు. ఆదివారం మూడుచింతలపల్లి మున్సిపల్ లక్ష్మాపూర్ 3వ వార్డులో కటికెల శ్రీవాణి వైద్యనాద్ ముదిరాజ్ సాన్వి బోటిక్ బ్యూటీ పార్లర్‌ను ప్రారంబించారు. ఈ సందర్భంగా కటికెల శ్రీవాణి వైద్యనాద్ మాట్లాడుతూ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

## 'సర్' ప్రత్యేక విచారణ ప్రారంభం

ఎంపిడిఒ ప్రవీణ్ కుమార్

**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మండలం పొద్దుటూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆదివారం ప్రత్యేక ఇంటెన్స్ రివిజన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక ఎంపిడిఒ వి.ప్రవీణ్ కుమార్ హాజరయ్యారు. ఎస్ఐఆర్‌కు సంబంధించి ప్రత్యేక హియరింగ్ కార్యక్రమాన్ని ఎంపిడిఒ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బండ లక్ష్మీ నరసింహ, గ్రామపంచాయతీ కార్యదర్శి, సంబంధిత బిఎల్‌ఓలు పాల్గొన్నారు. ఎస్ఐఆర్ నమోదుకు సంబంధించి జారీ చేసిన నోటీసులపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.

## రియల్ ఎస్టేట్ రంగంలో నమ్మకమైన సేవలు



ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** రియల్ ఎస్టేట్ రంగంలో నమ్మకమైన సేవలు అంధించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఆదివారం పట్టణంలోని అయ్యప్ప కాలనీలో గోపాల్ గౌడ్, విశ్వనాథ్ గౌడ్‌లు ఏర్పాటు చేసిన జీవి ప్రాపర్టీస్ రియల్ ఎస్టేట్ కార్యాలయాన్ని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ రంగంలో జీవి ప్రాపర్టీస్ సంస్థ రాణించాలని, వినియోగదారులకు నమ్మకమైన, పారదర్శకంగా సేవలు అందించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిజాయితీగా రియల్ వ్యాపారం చేసేందుకు నిర్వాహకులు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బిఎస్ సుధీర్, వాణి పాండురంగారెడ్డి, గౌస్ జానీ, అశోక్, పోమాల్‌పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు కానుగు అనంతయ్య, చింటు ప్రతాప్ రెడ్డి, యుగేందర్, చెట్ల నర్సింహులు, నేతలు శ్రీనివాస్ గౌడ్, చిన్న యాదగిరి, చెన్నయ్య, నక్కట వెంకటేష్ గౌడ్, రాజునాయక్, దినేష్ సాగర్, శివచారి, మల్లేష్, అల్లాడ శేఖర్, అన్వారీ రాజు, సంతు, అనిల్‌లు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ విమర్శలు అర్ధరహితం

శంకర్‌పల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లారం వెంకటరెడ్డి

**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, మహిళల సంక్షేమం, యువతకు ఉపాధి, గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లారం వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం శంకర్‌పల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొల్లారం వెంకటరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ తీవ్రంగా ఖండించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు రాజకీయ దురుద్దేశంతోనే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నాం" అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, సంక్షేమం అభివృద్ధిని సమతుల్యంగా ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. పదేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిన వారు.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందని అన్నారు. శంకర్‌పల్లి మండలంలో కూడా సిఎం రేవంత్ రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే యాదయ్య అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, గ్రామాలు, మున్సిపాలిటీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందని పేర్కొన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. ఎవరిది మాటల ప్రభుత్వం, ఎవరిది చేతల ప్రభుత్వమో ప్రజలకు తెలుసు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల పక్షాన నిలిచి పనిచేస్తోంది. ప్రతిపక్షాల విమర్శలకు ప్రజల అభివృద్ధే మా సమాధానం అని బొల్లారం వెంకటరెడ్డి స్పష్టం చేశారు.

## శిక్షా రత్న అవార్డుతో డాక్టర్ కేశవులుకు సత్కారం

ఓటరు చైతన్యం, సమాచార హక్కుపై అవగాహన కార్యక్రమాలకు గుర్తింపు

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** శ్రీ రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో స్థాపించబడిన భారతదేశపు మొట్టమొదటి గ్రీన్‌ఫీల్డ్ డీమ్డ్ యూనివర్సిటీ అయిన హార్ట్‌ఫుల్‌నెస్ అకాడమీ ఆఫ్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ ఛైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు ముదిరాజ్‌కు 'శిక్షా రత్న' అవార్డును ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ప్రపంచ ప్రఖ్యాత కన్హా శాంతివనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఛైర్మన్ ఆచార్య బాలకృష్ణారెడ్డి చేతుల మీదుగా డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు ముదిరాజ్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు ముదిరాజ్ మాట్లాడుతూ.. ఎంతో మంది ప్రముఖుల సమక్షంలో ప్రపంచ ప్రఖ్యాత హార్ట్‌ఫుల్‌నెస్ యూనివర్సిటీలో అవార్డు అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తాను,తన సంస్థ ద్వారా చేపట్టిన సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ అవార్డును అందజేయడం ఆనందంగా ఉందని తెలిపారు. సమాచార హక్కు పరిరక్షణ సమితి,ఎలక్షన్ వాచ్ కమిటీలను స్థాపించి విస్తృతంగా ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహించామని, ఇందుకు ఎన్నికల కమిషన్ నుంచి ప్రశంసలు కూడా అందుకున్నామని చెప్పారు. అలాగే సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామ,మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు. ప్రస్తుతం అందుకున్న 'శిక్షా రత్న' అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని డాక్టర్ కేశవులు ముదిరాజ్ పేర్కొన్నారు. హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ అందించిన ఈ అవార్డు స్ఫూర్తితో తాను, తమ సంస్థ సభ్యులు మరింత విస్తృతంగా సమాచార హక్కు, ఓటరు చైతన్యం, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

## ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఖేలో ఇండియా ఖో ఖో ఎంపిక పోటీలు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఈ నెల 9న ఖేలో ఇండియా ఖోఖో ఎంపిక పోటీలు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో సమయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు రంగారెడ్డి జిల్లా ఖో ఖో అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి తోట జైప్రకాష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 2మంది బాలురు, బాలికలతో కూడిన జట్లను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జనవరి 1, 2008 లేదా ఆ తర్వాత జన్మించిన వారై ఉండాలని, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, గురుకులాలు, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ, మైనార్టి సంక్షేమ విద్యాసంస్థలు, స్పోర్ట్స్ క్లబ్‌లకు చెందిన అర్హులైన క్రీడాకారులందరు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని చెప్పారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు తమ వయస్సు ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, విద్యా సంస్థ ఐడి కార్డులతో నిర్ణీత సమయానికి సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్దకు చేరుకోవాలని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు రంగారెడ్డి జిల్లా ఖోఖో అసోషియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరి శ్రీనివాస్‌యాదవ్‌ను సంప్రదించాలని కోరారు.

## ప్రయాణ సమయాన్ని తగ్గించేందుకే ప్రాజెక్టులు

ఎలివేటెడ్ కారిడార్‌లను పరిశీలించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రయాణ సమయాన్ని తగ్గించి, వాహనదారులకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించి, ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం అందించే లక్ష్యంతో ప్రతిపాదించిన ఎలివేటెడ్ కారిడార్‌లను సంజయ్ జాజు ఆదివారం పరిశీలించారు. హెచ్ఎండిఏ ఎం.డి. సర్ఫరాజ్ అహ్మద్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు ఈ పర్యటనలో సిఎస్ వెంట ఉన్నారు. నగరంలో మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు చేపట్టిన మౌలిక సౌకర్యాల ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిరీ ఫార్మ్ రోడ్ వరకు ఎన్‌హెచ్44పై, అలాగే ప్యారడైజ్ నుంచి బొల్లారం, గన్‌రాక్ ఎన్‌క్లేవ్, శామీర్‌పేట్ మీదుగా ఓఆర్ఆర్ జంక్షన్ వరకు ఎన్‌హెచ్1పై ప్రతిపాదించిన ఎలివేటెడ్ కారిడార్‌ల ప్రణాళికలను అధికారులు ఈ సందర్భంగా సిఎస్‌కు వివరించారు. ఈ కారిడార్లు అందుబాటులోకి వస్తే ప్యారడైజ్, సికింద్రాబాద్, బొల్లారం, గన్‌రాక్ ఎన్‌క్లేవ్, శామీర్‌పేట్ ప్రాంతాల మధ్య రవాణా సదుపాయం మరింత మెరుగుపడుతుందని, ఉత్తర హైదరాబాద్ నుంచి ఓఆర్ఆర్‌కు వేగవంతమైన అనుసంధానం ఏర్పడుతుందన్నారు. సికింద్రాబాద్ బొల్లారం శామీర్‌పేట్ మార్గంలో నానాటికీ పెరుగుతున్న వాహన రద్దీని దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్ అవసరాలకు తగినట్టుగా కారిడార్లను సమగ్రంగా తీర్చిదిద్దాలని సంజయ్ జాజు సూచించారు. ప్యారడైజ్, బొల్లారం, గన్‌రాక్ ఎన్‌క్లేవ్, శామీర్‌పేట్ పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించడం, ప్రయాణ సమయాన్ని కుదించడం, వాహనదారులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని కల్పించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని సంజయ్ జాజు అన్నారు. భూసేకరణ, యుటిలిటీల మార్పిడి, వివిధ శాఖల మధ్య సమన్వయం, అవసరమైన అనుమతుల విషయంలో వేగంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే మెట్రో రైల్, ప్రధాన రహదారులు, ఓఆర్ఆర్‌ల మధ్య మెరుగైన అనుసంధానం ఏర్పడేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ పరిశీలనలో హెచ్ఎండిఏ చీఫ్ ఇంజనీర్ పరంజ్యోతి, తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి

సర్పంచ్ సంతోష శ్రీశైలం యాదవ్

**ప్రజాపక్షం/కేశంపేట :** ప్రజల అవసరాలకు అనుగునంగా గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని కేశంపేట సర్పంచ్ బొజ్జ సంతోష శ్రీశైలం యాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు, ప్రయాణికులకు మరుగుదొడ్లు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి నూతన మరుగుదొడ్లను నిర్మించినట్లు చెప్పారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తూ అబివృద్ధి పనులు చేపడుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాట్రావత్ రాజు, వార్డు సభ్యులు మంచె కృష్ణయ్య, గంజాయి దశరథం, తలసాని లత ప్రవీణ్‌రెడ్డి, పోలెమోని సతీష్, కమ్లికార్ అనిత నాగేశ్వర్, తిమ్మగళ్ళ చంద్రకళ రామచంద్రి, మాజీ సర్పంచ్ బైరమోని బాల్‌రాజ్, గ్రామ యువకులు తలసాని పవన్‌కుమార్‌రెడ్డి, పిల్లి అమరేష్ యాదవ్, బైకని శేఖర్‌లు పాల్గొన్నారు.



## గిరిజన సంప్రదాయాలకు ప్రతీక తీజ్

ఉత్సవాల్లో పాల్గొన్న మధుయాష్కీ గౌడ్

**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** ఎల్‌బి నగర్ నియోజకవర్గంలో బంజారా సోదరి, సోదరులకు వారి సాంప్రదాయలకు ఆనవాయితీగా నిర్వహించే తీజ్ ఉత్సవాలు దేశ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని మాజీ ఎంపీ, ఎల్‌బి నగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మధుయాష్కీ గౌడ్ అన్నారు. ఆదివారం సాహెబ్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు కేతావత్ రమేష్ నాయక్ ఆధ్వర్యంలో తీజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బంజారా మహిళలు వారి సంప్రాదాయలకు అనుగుణంగా తీజ్‌ను తొమ్మిది రోజుల పాటు పెళ్లి కాని ఆడపడుచులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు. సేవాలాల్ మహారాజ్ బంజారా సేవాదళ్ పేరుతో వెంకటేశ్వర కాలనీలో తీజ్ ఉత్సవాలు జరిపారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ ఈ భూమి, వనరులు అందరివి అని, గిరిజన బంజారా సోదరులు ఐక్యమత్యంతో పోరాడినప్పుడే హక్కులు లభిస్తుందని ఆయన పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్, ప్రొఫెసర్ బాలాజీ నాయక్, వనస్థలిపురం డివిజన్ అధ్యక్షులు శ్రీనాథ్, డిసిసి ఉపాధ్యక్షులు కొండోజు శ్రీనివాస్, దాము మహేందర్‌యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మెగావత్ గణేష్ నాయక్, రేణుగౌడ్, సరస్వతి, సురేష్‌యాదవ్, నందకిషోర్, సాయికుమార్ పాల్గొన్నారు.

## అర్హులైన పేదలందరికీ స్మార్ట్ కార్డుల పంపిణీ

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** అర్హులైన పేదలందరికి స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తున్నామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. ఆదివారం షాద్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ అగ్గనూరి బసవేశ్వర్ అధ్యక్షతన రేషన్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రేషన్ కార్డుల వ్యవస్థను తీసుకువచ్చేందే కాంగ్రెస్ ప్రభుత్వం అన్న విషయాన్ని ప్రజలందరు గుర్తించుకోవాలని సూచించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉన్న సమయంలో రేషన్ కార్డులు ఇచ్చామని, మళ్లీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోనే స్మార్ట్ రేషన్ కార్డులు ఇస్తున్నామని తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏ ఒక్క లబ్దిదారుడికి రేషన్ కార్డులు ఇవ్వలేదని వాపోయారు. స్వర్గీయ ఎన్‌టిఆర్ హయాంలో రెండు రూపాయలకు కిలో బియ్యం ఇచ్చారని, రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అనే విషయాన్ని ప్రజలందరు గుర్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన లబ్దిదారులు మీసేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకుంటే ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను అంధించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ హయాంలో నాణ్యత లేని ముక్కిన బియ్యం ఇచ్చారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో నాణ్యమైన సన్న బియ్యం అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పేదలకు అన్ని విధాల న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిపాలనలో ఇప్పటి వరకు లక్షల రేషన్ కార్డులు, ఇండ్లు మంజూరు చేశామని తెలిపారు. గత ప్రభుత్వం పేదల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ వాళ్ల హయాంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాతే సంక్షేమ పథకాలు కొనసాగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్, కమీషనర్ సునీతారెడ్డి, ఫరూఖ్‌నగర్ తహశీల్దార్ నాగయ్య, సింగిల్ విండో చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్‌తోపాటు మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రిజర్వాయర్‌పై అనుమానాలను ప్రశ్నిస్తే బెదిరింపులేమిటి?

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నేతలు



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్‌పై ఉన్న అనుమాలను ప్రశ్నిస్తుంటే బెదిరింపులకు పాల్పడటం ఎంతవరకు సమంజసమని ప్రజా సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. ఆదివారం పట్టణంలోని దేవీ గ్రాండ్ హోటల్‌లో ప్రజా సంఘాల నేతలు మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ భూసేకరణకు సంబంధించిన గేజిట్ విడుదలై నేపధ్యంలో డిపిఆర్‌ను బయట పెట్టాలని ప్రజా సంఘాల నేతలు కోరితే అధికార పార్టీ నేతలు బెదిరింపులకు పాల్పడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రిజర్వాయర్ ద్వారా రైతులకు, పరిశ్రమలకు ఎంతమేరకు నీరు అందిస్తారనే విషయాలను ప్రభుత్వం స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. సాగునీరు, తాగు నీరు అంధించడమే రిజర్వాయర్ లక్ష్యం అయినప్పటికి ఏ గ్రామానికి, ఏ మండలానికి ఎంతమేరకు నీరు అందిస్తారనే విషయాలపై స్పష్టత ఇవ్వాలని పేర్కొన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా మొదట జూరాల నుంచి నీటిని ఎత్తిపోయాలని ప్రతిపాధించారని, కానీ బిఆర్ఎస్ ప్రభుత్వం డిజైన్ మార్చి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 2.8టిఎంసిలుగా ప్రతిపాదన చేశారని గుర్తు చేశారు. దాంతో నాలుగు లక్షల 13వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రతిపాదనలు చేశారని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం రిజర్వాయర్‌ను పూర్తిగా విస్మరించిందని పేర్కొన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నుండే నల్గొండకు నీటిని తరలిస్తే లక్ష్మీ దేవిపల్లికి చుక్కనీరు కూడా వచ్చే అవకాశం లేదని, కాబట్టి డిండి లిఫ్టును అడ్డుకోవాలని చెప్పడం జరిగిందని వివరించారు. ఈ ప్రాంతంలో పర్యావరణ విధ్వంసం చేసే డేటా సెంటర్ల నిర్మాణం శరవేగంగా జరుగుతన్నాయని, డేటా సెంటర్ల నిర్వహణకు సర్వర్లను చల్లబర్చటానికి విపరీతమైన నీటిని వినియోగించాల్సిన అవసరం ఉంటుందని పేర్కొన్నారు. లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ డిపిఆర్ బయట పెట్టాలని, డిండి లిఫ్ట్‌ను వ్యతిరేకించాలని, డేటా సెంటర్లకు నీరు ఎక్కడి నుండి ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ ద్వారా ఎన్ని లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తారో తెలియజేయాలని కోరారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు తిరుమలయ్య, పినపాక ప్రభాకర్, టిజి శ్రీనివాస్, రవీంద్రనాథ్, బి.సత్యం, అర్జునప్ప, ప్రశాంత్, శ్రీకాంత్, ఆకాష్ నాయక్, సత్యనారాయణలు పాల్గొన్నారు.



## ఓటర్లు డాక్యుమెంట్లను సమర్పించాలి

కొత్తూరు తహసీల్దార్ ముంతాజ్ భేగం

**ప్రజాపక్షం/కొత్తూరు :** అర్హులైన ఓటర్లకు వచ్చిన నోటీసులు తీసుకొని సంబంధిత డాక్యుమెంట్స్‌ను సమర్పించేందుకు కృషి చేయాలని తహశీల్దార్ ముంతాజ్ భేగం సూచించారు. ఆదివారం కొత్తూరు తహశీల్దార్ కార్యాలయంలో నోటీసులు అందుకు ఓటర్లు సంబంధిత పత్రాలను సమర్పించి వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ముంతాజ్ భేగం మాట్లాడుతూ ఓటరు జాబితాలో తప్పులు ఉన్న ఓటర్లకు ఎన్నికల కమీషన్ నుండి నోటీసులు వచ్చాయని, వారు వివరణ ఇవ్వడంతోపాటు సంబంధిత పత్రాలను సైతం సమర్పించారని గుర్తు చేశారు. నోటీసులు అందిన వారు మోగా హియరింగ్‌లో పాల్గొని డాక్యుమెంట్స్‌లకు సంబంధించిన పత్రాలను బిఎల్‌ఓలకు సమర్పించి ఓటును భద్ర పరుచుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 16వ తేది వరకు ఎన్నికల కమీషన్ అవకాశం కల్పించడం జరిగిందని, 2026 అక్టోబర్ 1వ తేది నాటికి 18ఏళ్ళు నిండిన యువతి, యువకులు ఫామ్ 6ద్వారా ఓటు హక్కును నమోదు చేసుకోవాలని, ఓటర్ జాబితాలో తప్పులు ఉంటే వాటిని సరి చేసేందుకు ఫామ్ 8ను తీసుకోవాలని సూచించారు. ఓటు హక్కును తొలగించేందుకు ఫామ్ 07ను తీసుకొని వివరాలను నమోదు చేసి బిఎల్‌ఓలకు సమర్పించాలని పేర్కొన్నారు. అర్హులైన ఓటర్లు విధిగా ఓటరు జాబితాను పరిశీలించి సరైన పత్రాలను సమర్పించి ఓట్టు హక్కును పొందాలని ఆకాంక్షించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో వైఫల్యం



మండల బిఆర్ఎస్ నాయకులు

మోకిలా గ్రామంలో పల్లె విధ్వంసం, పడకేసిన పారిశుద్ధ్యంపై నిరసన

**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వెయ్యి రోజులైనా హామీల అమలులో తీవ్రంగా విఫలమైందని మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు అన్నారు. బీఆర్ఎస్ పార్టీ పిలుపుమేరకు కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనకు నిరసనగా ఆదివారం మండలంలోని మోకిల గ్రామంలో పల్లె విధ్వంసం, పడకేసిన పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమంలో భాగంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలోని వాడ వాడ తిరుగుతూ పారిశుద్ధ్య పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం హయాంలో గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు, నూతన గ్రామపంచాయతీ కార్యాలయాలు, అంగన్వాడి భవనాల పనులు, రైతు వేదికలు, పల్లె ప్రకృతి వనాలు, వాడవాడలో అండర్ డ్రైనేజ్, మంచినీటి వసతి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు, ప్రతి గ్రామంలో యువకుల కోసం క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారని, ప్రస్తుతం వాటి నిర్వహణ, పారిశుద్ధ్య వ్యవస్థ పూర్తిగా కుంటుపడిందని మండిపడ్డారు. అభివృద్ధి పనులు జరగాలంటే మళ్ళీ కెసిఆర్ ప్రభుత్వం రావాలని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీలను కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అధోగతి పాలయిందని దుయ్యబట్టారు. బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని, పార్టీ అధినేత కేసిఆర్ ను విమర్శించడం తప్ప కాంగ్రెస్ పార్టీ నేతలు మరే పని చేయడం లేదని తెలిపారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరు కెసిఆర్ పాలనను కోరుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గండిచేర్ల గోవర్దన్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు, శంకర్ పల్లి పిఎసిఎస్ చైర్మన్ బద్ధం శశిధర్ రెడ్డి, మాజీ ఎంపీపీలు మాల చిన్న నరసింహులు, ధర్మాన్న గారి గోవర్ధన్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాణిక్య రెడ్డిy, రాజు నాయక్, మన్నే లింగం ముదిరాజ్, శ్రీకాంత్ రెడ్డి, రాజ్ కుమార్( నందు) మాజీ సర్పంచ్లు బిసోల శ్రీధర్, సత్యనారాయణ రెడ్డి, దూసాడ నరసింహారెడ్డి, బద్దం సురేందర్ రెడ్డి, సుధాకర్, ఫరీద్, లేగల నరసింహులు, కొండకల్ సర్పంచ్ శేఖర్, మోకిలా గ్రామ అధ్యక్షుడు గోపాల చారి, కమల్ నాయక్, సాయన్న,విజయ్ కుమార్, ఈశ్వర్, సయ్యద్ ఫయుం, టిఆర్ఎస్ రాజు, కొండ మానయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఉచిత వైద్య శిభిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం శామీర్‌పేట డివిజన్ దేవరయాంజాల్‌లో కొంపల్లిలోని ఫోకస్ ఐ హాస్పటల్ ఆద్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కంటి ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉమాశంకర్, మాజీ చైర్మన్ లక్ష్మి నారాయణ, పిన్నంటి ధర్మారెడ్డి, సాయికుమార్, పాండుగౌడ్, హస్పటల్ సిబ్బంది శ్రీరామ్, నందుకిషోర్, మణితేజ, కల్పన, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలం

ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** వెయ్యి రోజు కాంగ్రెస్ పాలనలో గిరిజనుకలు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మూడావత్ రాంబల్‌నాయక్ ఆరోపించారు. ఆదివారం రంగారెడ్డి జిల్లాలోని ఇంజాపూర్‌లో లంబాడి హక్కుల పోరాట సమితి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబల్‌నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో లంబాడీల సంస్కృతి, సాంప్రదాయాలను గోర్ బోలి భాషను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని, రాజ్యాంలోని 8వ షెడ్యూల్లో చేర్చేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు అవుతుందని, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రజలను మభ్యపెడుతూ దొండ హామీలు ఇస్తున్నారే తప్పా వెయ్యి రోజుల్లో చేసిందేమి లేదని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చేసిన అభివృద్ధి పనులే గ్రామీణ ప్రాంతాల్లో దర్శనమిస్తున్నాయని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని, దాంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రాష్ట్రంలో అభివృద్ధి కుంటుబడటంతోపాటు ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారని వాపోయారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నేటి వేసిందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళేందుకే ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన చేవెళ్ల ఎస్సీ, ఎస్టి డిక్లరేషన్‌లో గిరిజనులకు ఇచ్చిన 12హామీలలో ఒక్క మామీ కూడా నేరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. లంబాడిల భూములను గుంజుకోవడమే వారు పనిగా పెట్టుకున్నారని, దేశంలో పెట్టుబడులు పెరుగుతున్నాయని, తెలంగాణ రాష్ట్రం మాత్రం దివాల తీస్తుందని వివరించారు. గురుకుల కళాశాలలో గిరిజన విద్యార్థినీలు ఆత్మహత్యలు చేసుకుంటుంటే ప్రభుత్వానికి ఎలాంటి చలనం లేదని వాపోయారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బాతావత్ శ్రీనివాస్ నాయక్, హితావత్ రమేష్, బాబునాయక్, సుభాష్ నాయక్, ఎస్ఎస్ శ్రీనివాస్ నాయక్, రాజ్‌కుమార్ నాయక్, మకట్లాల్నాయక్, భాషనాయక్, జైపాల్ నాయక్, జానకిరామ్ నాయక్, కిషన్ సింగ్ నాయక్, శ్రీనివాస్ నాయక్, శివ నాయక్, గోవర్ధన్ నాయక్, భూక్య సుభాస్నాయక్‌లు పాల్గొన్నారు.



## ప్రజాస్వామ్యం అపహాస్యం




ప్రజాపక్షం/చార్మినార్: ప్రజాస్వామ్య విలువలను మాజీ సిఎం కెసిఆర్ అపహాస్యం చేస్తున్నారని హైదరాబాద్ డిసిసి అధ్యక్షుడు సయ్యద్ ఖాలీద్ సైఫుల్లా, కాంగ్రెస్ నేత వెంకటేష్ విమర్శించారు. ఈ మేరకు ధర్నా చౌక్‌కు బయలుదేరే సందర్భంలో వారు మాట్లాడారు. ఇదిలాఉండగా...అసెంబ్లీకి రాని ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ తన పదవికి రాజీనామా చేయాలని ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉష్రశీ గౌడ్ డిమాండ్ చేశారు. ధర్నా చౌక్‌కు తరలివెళ్లిన సమయంలో ఆమె మాట్లాడారు. కాగా మహాధర్నాలో పాల్గొనేందుకు కాంగ్రెస్ నేత కేపీ మురళీకృష్ణ నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సీహెచ్ మురళి, టీ.లాలయ్య గౌడ్, రఘురాం, రాజేష్, సుభద్ర, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## తెప్పోత్సవ శోభాయాత్ర



ప్రజాపక్షం/అంబర్‌పేట్: గంగా తెప్పోత్సవ శోభాయాత్ర ఘనంగా జరిగింది. అంబర్‌పేట్ నియోజకవర్గం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ విద్యార్థి విభాగం నాయకుడు రాజశేఖర్ గంగాపుత్ర పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గంగ తెప్పోత్సవ కమిటీ సభ్యులు సాయి ప్రసాద్, మైలారం రాజు, ఆంధ్రపు శ్రీధర్, తిరుపతి గుప్తా, బలరాం, సాయి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కీళ్ల చికిత్సలో మార్పులు




ప్రజాపక్షం/పంజాగుట్ట: కీళ్ల చికిత్సలు, ఆర్థోపెడిక్ రంగంలో వస్తున్న అత్యాధునిక పురోగతులు, సరికొత్త శస్త్రచికిత్సా పద్ధతులపై అవగాహన కల్పిస్తూ అపోలో హాస్పిటల్స్ ఆధ్వర్యంలో '10వ ఆర్థ్రోప్లాస్టీ ఆర్థ్రోస్కోపీ సదస్సు 2026' జరిగింది. తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ (టీఓఎస్ఎ), ట్విన్ సిటీస్ ఆర్థోపెడిక్ సొసైటీ (టీసీఓఎస్) సహకారంతో అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎఎస్ కోర్స్ డైరెక్టర్, సికింద్రాబాద్ అపోలో హాస్పిటల్స్ సీనియర్ ఆర్థో, జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ మిథిన్ ఆచి మాట్లాడుతూ, రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్స అత్యుత్తమ చికిత్సా విధానాలలో ఒకటిగా గుర్తింపు పొందిందన్నారు.

## ఉత్సాహంగా క్రీడా పోటీలు



ప్రజాపక్షం/వెంగళరావునగర్: రాబోయే గణేశ్ ఉత్సవాల్లో భాగంగా రాజీవ్‌నగర్‌లో ఆదివారం చిన్నారులకు రన్నింగ్ రేస్, మహిళలకు కళ్లకు గంతలు కట్టి నిర్వహించిన నడక పోటీలు ఉత్సాహంగా జరిగాయి. అనంతరం ఎస్ఆర్‌నగర్ ఏసీపీ రాఘవేంద్ర సాంస్కృతిక కార్యక్రమాల బ్రోచర్‌ను విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కిలారి మనోహర్, కార్యదర్శులు బాపయ్య చౌదరి, సుబ్బరాఘవయ్య, క్రీడల కన్వీనర్ రజిని, కాలనీ పెద్దలు ఎన్ఎస్‌రెడ్డి, మురళీధర్రాజు, హేమలత, లక్ష్మి, నరసింహరాజు, పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

## గంగమ్మ తల్లి తెప్పోత్సవం



ప్రజాపక్షం/ఖైరతాబాద్: గంగమ్మ తల్లితోనే గంగపుత్రుల జీవితాలు ముడిపడి ఉన్నాయని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. తెలంగాణ గంగ తెప్పోత్సవం సందర్భంగా ఆదివారం ఖైరతాబాద్‌లోని ఏడు గుళ్ళ ఆలయంలో ఖైరతాబాద్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పూజలకు ఆయన హాజరయ్యారు. అమ్మవార్లకు పూజలు అనంతరం ఉత్సవ కమిటీ మహిళలకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ బోనం అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మహేందర్ బాబు, చందు, నాయకులు రాంరెడ్డి, మహేష్ యాదవ్, ఆనంద్, కమిటీ సభ్యులు చందు, రాజు, నర్సింగ్, శంకర్ తదితరులు ఉన్నారు.

## అంబేద్కర్‌ను అవమానించిన హమారా ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాపక్షం/బంజారాహిల్స్: భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానించిన హమారా ప్రసాద్‌పై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని 'ది నేషనల్ అంబేద్కర్ సేన' తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు తాలూకా రాజేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దళిత వాదం పేరుతో విద్వేష ప్రచారం చేస్తూ, అంబేద్కర్ వాదంపై అవమానకర దాడులు కొనసాగిస్తూ, అసత్య ఆరోపణలు చేస్తున్న హమారా ప్రసాద్‌పై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. హమారా ప్రసాద్ మాటలు, చర్యలు ఎస్సి, ఎస్టి, మిగతా కులాల మధ్య సమాజంలోని విభిన్న వర్గాల ప్రజల మధ్య విద్వేషం, శత్రుత్వాన్ని రెచ్చగొట్టేలా ఉన్నాయని ప్రజాశాంతి, సామాజిక సామరస్యంపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉన్నందున హమారా ప్రసాద్‌కు సంబంధించిన సోషల్ మీడియా ఖాతాలను, వెబ్ సైట్లను వీడియోలను ఇతర డిజిటల్ కమ్యూనికేషన్‌కు సంబంధించిన ఎలక్ట్రానిక్ ఆధారాలను పరిశీలించి వీటిని తొలగింపచేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.

# మౌలిక వసతులు బలోపేతం

ప్రజాపక్షం/హైదరాబాద్‌సిటీ: తెలంగాణ రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ మౌలిక వసతులను బలోపేతం చేస్తూ టిజిఎస్‌పిడిసిఎల్ గణనీయమైన పురోగతి సాధించింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలనలో భాగంగా విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడం, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సామర్థ్యాన్ని పెంచడం లక్ష్యంగా విస్తృత స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడం జరుగుతోంది. ఈ క్రమంలోనే ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత డిసెంబర్ 1, 2023 నుంచి ఆగస్టు 31, 2026 వరకు ఎస్‌పిడిసిఎల్ పరిధిలో మొత్తం 333 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు (పిటిఆర్) ఛార్జ్ చేయడం జరిగింది. వీటిలో 5 ఎంవిఎ, 8 ఎంవిఎ, 12.5 ఎంవిఎ, 16 ఎంవీఏ సామర్థ్యాల పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ఈ సామర్థ్య పెంపు ద్వారా విద్యుత్ అంతరాయాలు తగ్గడంతో పాటు ఓవర్ లోడింగ్ సమస్యలు నివారించి, వినియోగదారులకు మరింత నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతోంది.

### 333 పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల చార్జ్



**ఇదిలాఉండగా..**
**హైదరాబాద్‌తో పాటు ఐటీ కారిడార్..**

అభివృద్ధి చెందుతున్న శివారు ప్రాంతాల్లో విద్యుత్ అవసరాలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో సైబర్‌సిటీ, మెడ్చల్, రాజేంద్రనగర్, హబ్సిగూడ, సరూర్‌నగర్ సర్కిళ్లలో అధిక సామర్థ్యం కలిగిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. దీంతో ఐటీ సంస్థలు, పారిశ్రామిక యూనిట్లు, వాణిజ్య సముదాయాలు, గృహ వినియోగదారులకు విశ్వసనీయ విద్యుత్ సరఫరా అందుతోంది. గ్రామీణ ప్రాంతాల విషయంలో... వ్యవసాయం, గ్రామీణ గృహాలు, చిన్న పరిశ్రమల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నల్గొండ, సూర్యాపేట్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి, నారాయణపేట్, వికారాబాద్ తదితర జిల్లాల్లో విద్యుత్ మౌలిక వసతులను మరింత బలోపేతం చేశారు. కొత్త పిటిఆర్‌ల ఏర్పాటుతో తక్కువ వోల్టేజ్ సమస్యలు తగ్గి రైతులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందుతోంది. ఈ సందర్భంగా టిజిఎస్‌పి డిసిఎల్ సిఎండి జితేష్ పాటిల్ మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన, నిరంతరాయ. విశ్వసనీయ విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా టిజిఎస్‌పిడిసిఎల్ పనిచేస్తోందని, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మరిన్ని సబ్‌స్టేషన్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఆధునిక విద్యుత్ మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు.

## ఆటో కార్మికులకు కుచ్చుటోపి



ప్రజాపక్షం/కంటోన్మెంట్: కాంగ్రెస్ పాలనలో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించి కుచ్చుటోపి పెట్టారని బిఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం బిఆర్ఎస్ నాయకులు భారీ ఆటో ర్యాలీ నిర్వహించారు. కార్ఖానా 3వ వార్డులోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం, మన్నె క్రిశాంక్, నివేదిత ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పెద్ద సంఖ్యలో ఆటో కార్మికులు పాల్గొని వారి సమస్యలు, ఇబ్బందులు, తమపై జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు బిఆర్ఎస్ ఆటో కార్మికులకు అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ వాటి అమలుపై నిర్లక్ష్యం వహిస్తోందని మన్నె క్రిశాంక్ విమర్శించారు. కార్యక్రమంలో పాండు యాదవ్, అనిత, ప్రభాకర్, నలిని, కిరణ్, టిఎన్ శ్రీనివాస్, కేబీ శంకర్‌రావు తదితరులు పాల్గొనారు.

## దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మితం

- రాష్ట్ర పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ సభ్యులు డా.వర్రె వెంకటేశ్వర్లు
- ఘనంగా యాదవ ఉపాధ్యాయ పురస్కార మహోత్సవం



ప్రజాపక్షం/హిమాయత్‌నగర్:దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మితమవుతుందని రాష్ట్ర పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ సభ్యులు, పూర్వ ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. అందుకే దేశ భవిష్యత్తు నిర్మాతలు గురువులని నిర్మోహమాటంగా చెప్పవచ్చన్నారు. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గురుపూజ మహోత్సవం సందర్భంగా యాదవ్స్ సేవా సంఘం ఆధ్వర్యంలో యాదవ ఉపాధ్యాయ పురస్కార మహోత్సవం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుడు అంటే కేవలం పాఠాలు చెప్పేవారు కాదని, ఒక విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారిలో ఆత్మవిశ్వాసం, ధైర్యాన్ని నింపేవారని కొనియాడారు. చీకటి నుంచి వెలుగువైపు నడిపించే గురువుకు మన దేశంలో విశిష్ట స్థానం ఉన్నదన్నారు. తల్లిదండ్రుల తర్వాత గురువుకే మొదటి స్థానం ఇస్తామన్నారు. అలాంటి గురువులను ఈరోజు సన్మానించుకోవడం సంతోషంగా ఉన్నదన్నారు. డిజిటల్ టెక్నాలజీ ఆన్‌లైన్ విద్య, కృత్రిమ మేధస్సు వంటి సాంకేతిక పరిజ్ఞానాలు మన విద్యా విధానాన్ని కూడా మార్చుతున్నాయన్నారు. అయితే, టెక్నాలజీ ఒక ప్రశ్నగా సమాధానం ఇవ్వగలదని, కానీ ఏ ప్రశ్న అడగాలి, ఏ సమాధానాన్ని ఉపయోగించాలి, అది సమాజానికి ఎలా ఉపయోగపడాలి అనే విషయాన్ని నేర్పించేది ఉపాధ్యాయుడేనని తెలిపారు. విద్యార్థులు కూడా ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులకు ఇలాంటి పురస్కార ప్రదాన కార్యక్రమాలతో వారి వృత్తికి మరింత గౌరవం తెచ్చినట్టు అవుతుందన్నారు. అనంతరం యాదవ ఉపాధ్యాయులను శాలువా, మెమెంటోతో ఘనంగా సన్మానించి, వారి సేవలను అభినందించారు. యాదవ్స్ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు అల్లాడి శరత్ యాదవ్ మాట్లాడుతూ యాదవ ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దడమే కాకుండా యాదవ కుల సంఘాలకు చేయూతనివ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మహేశ్ యాదవ్, రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస యాదవ్, శ్రీకాంత్ యాదవ్, ఉపాధ్యక్షులు మనోజ్ యాదవ్, యాదవ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కెసిఆర్ రాజీనామా చేయాలి



ప్రజాపక్షం/నల్లకుంట/కంటోన్మెంట్/జూబ్లీహిల్స్/వెంగళరావునగర్: అసెంబ్లీకి రాని బిఆర్ఎస్ అధినేత, బిఆర్ఎస్ శాసనసభాపక్ష నేత కెసిఆర్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ శ్రేణులు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఆదివారం ధర్నాచౌక్ వద్ద నిర్వహించిన మహాధర్నాలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్‌యాదవ్ పాల్గొని ప్రసంగించారు.ప్రతిపక్ష పాత్ర పోషించకుండా.. ప్రజాధనం పొందుతున్న కెసిఆర్ వెంటనే రాజీనామా చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ధర్నాచౌక్‌కు పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ... ప్రజా పాలనలో వెయ్యి రోజుల ప్రగతిని వివరిస్తూ.. బీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగడుతున్నట్లు తెలిపారు. ఇదిలాఉండగా.. మహాధర్నాకు పిసిసి మాజీ కార్యదర్శి లక్పతి యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో అంబర్‌పేట్ నియోజకవర్గం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మాజీ పిసిసి ప్రధాన కార్యదర్శి నాగభూషణం, పిసిసి మాజీ ఉపాధ్యక్షుడు బొల్లు కిషన్, ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణ గౌడ్, శ్రీకాంత్, వికాస్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలోనే కేసీఆర్ వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చెయ్యాలని డిమాండ్ చేస్తూ ఏఐసీసీ జాతీయ కో ఆర్డినేటర్ డా.పివి రవిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌కు భారీ ర్యాలీ బయలుదేరి వెళ్లింది. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత వేణుగోపాల్ స్వామి, ఏఐసీసీ కేకేసీ చైర్మన్ డాక్టర్ ఉదిత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నవ దంపతులకు ఆశీర్వాదం



ప్రజాపక్షం/జూబ్లీహిల్స్: కేంద్ర మంత్రి బండి సంజయ్ తమ్ముడి కుమార్తె వివాహ (రిసెప్షన్) వేడుకలు ఎరినా గ్రాండ్ హోటల్‌లో ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. వేడుకలో జూబ్లీహిల్స్ అసెంబ్లీ బిజెపి సీనియర్ నాయకులు బరిగెల జ్ఞానేశ్వర్, పులి రామ్మోహన్, బదుగు సతీష్, దొండి గణేష్, పొన్నాల శ్రీనివాస్ పాల్గొని నవ దంపతులను ఆశీర్వదించారు.

## సిపిఎస్ రద్దు చేయాలి



ప్రజాపక్షం/గోషామహల్: భాగస్వామ్య పింఛను పథకం రద్దు చేయాలని ఏఐఎన్‌పిఎస్ఈఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మాచన రఘునందన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎస్ రద్దు కావాలన్న తమ అభిమతం నెరవేరాలని కోరుతూ అప్పికొండ సోమేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. పాలకులు ఎప్పటికప్పుడు సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి పబ్బం గడుపుకుంటున్నారే తప్ప..భాగస్వామ్య పింఛను పథకం రద్దు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఇందిరమ్మ ఇల్లు గాయబ్

- *పేద దంపతుల సొంతింటి కలకు అధికారులు బ్రేక్?*
- *డ్రాలో ఇల్లు వచ్చిందని ప్రకటించిన హౌసింగ్ అధికారి*
- *అనంతరం ఇల్లు రాలేదంటూ బుకాయింపు*

ప్రజాపక్షం/అంబర్‌పేట్: పట్టణ పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తున్నామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా... క్షేత్రస్థాయిలో జరుగుతున్న వ్యవహారాలు అర్హులకు మొండిచేయి చూపిస్తున్నారు? అనే విమర్శలు వస్తున్నాయి. ఇటువంటి వ్యవహారానికి ఉదాహరణగా బాగ్అంబర్‌పేట్ బతుకమ్మకుంట ప్రాంతానికి చెందిన దళిత దంపతుల వ్యవహారం నిలిచింది. బతుకమ్మకుంట ప్రాంతానికి చెందిన చిట్కోళ్ల మున్నీ, నరసింహ దళిత దంపతులు గత పదేళ్లుగా అద్దె ఇంట్లోనే నివాసం ఉంటున్నారు. నరసింహ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తుండగా, మున్నీ ఇళ్లలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో మున్నీ రెండుసార్లు డబుల్ బెడ్రూమ్ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ,ఆమెకు ఇల్లు మంజూరు కాలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించడంతో ఈసారైనా తమకు సొంతిల్లు దక్కుతుందనే ఆశతో మున్నీ రూ.10 వేల వరకు ఖర్చు చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంది. ఆమె దరఖాస్తుకు (137409) అప్లికేషన్ నంబర్ వచ్చింది. ఈ క్రమంలో ఆగస్టు 29న అంబర్‌పేట్ నియోజకవర్గానికి సంబంధించిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం చే నెంబర్‌లోని మహారాణా ప్రతాప్ ఫంక్షన్ హాల్లో హౌసింగ్ బోర్డు అధికారులు లక్కీ డ్రా నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు. లాటరీ పద్ధతిలో మొత్తం 480 ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేశారు.అదే లక్కీ డ్రాలో హౌసింగ్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాబురావు ఎస్సీ కోటా కింద చిట్కోళ్ల మున్నీ (అప్లికేషన్ నంబర్ 137409)కు ఇందిరమ్మ ఇల్లు మంజూరైనట్లు అందరి సమక్షంలో ప్రకటించారు. ఆ సమయంలో ఈఈ బాబురావును కలిసి మాట్లాడగా.. డ్రాలో మీకు ఇల్లు వచ్చిందని, రెండు రోజుల తర్వాత మీ ఫోన్‌కు మేసేజ్ వస్తుందని, అనంతరం నాంపల్లిలోని హౌసింగ్ బోర్డు కార్యాలయానికి రావాలని సూచించారు. అయితే రెండు రోజులు గడిచినా ఫోన్‌కు ఎలాంటి మేసేజ్ రాకపోవడంతో మున్నీ, నరసింహ దంపతులు ఆందోళనకు గురయ్యారు. దీంతో ఈనెల 2వ తేదీ బుధవారం నాంపల్లిలోని హౌసింగ్ బోర్డు కార్యాలయానికి వెళ్లి ఈఈ బాబురావును వారు కలిశారు. అయితే మీరు ఐడీ ప్రూఫ్‌లు సరిగా పెట్టలేదని, డ్రాలో మీకు ఇల్లు రాలేదంటూ బాబురావు చెప్పడంతో తాము అవాక్కయ్యామని మున్నీ, నరసింహ దంపతులు తెలిపారు. అందరి సమక్షంలో ఇల్లు వచ్చిందని ప్రకటించి.. ఇప్పుడు ఇల్లు రాలేదని చెప్పడం ఏమిటని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ స్పందించి దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపించి, తమకు న్యాయం చేయాలని మున్నీ, నరసింహ దంపతులు వేడుకుంటున్నారు.

## రోస్టర్ విధానంపై రణగర్జన



ప్రజాపక్షం/ఉస్మానియా వర్సిటీ: మాల విద్యార్థులు, నిరుద్యోగులకు జరుగుతున్న అన్యాయం, రోస్టర్ విధానంపై ఉస్మానియా విశ్వవిద్యాలయం వేదికగా 'మాల విద్యార్థి, నిరుద్యోగ రణ గర్జన' మహాసభ నిర్వహిస్తున్నట్లు మాల స్టూడెంట్స్ జేఏసీ, అంసా, ఐక్య విద్యార్థి సంఘాలు ప్రకటించాయి. ఈ మేరకు ఓయూలో జరిగిన కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు మాట్లాడుతూ.. అక్టోబర్ మొదటి వారం, ఆదివారం ఉస్మానియా విశ్వవిద్యాలయం, ఆర్ట్స్ కాలేజ్ ప్రాంతంలో మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాల స్టూడెంట్ జేఏసీ చైర్మన్ మాదాసు రాహుల్‌రావు, ఎఎంఎస్ఎ ఓయూ అధ్యక్షుడు నామ సైదులు, మాల స్టూడెంట్ జేఏసీ వైస్ చైర్మన్ పండుగ భానుతేజ, మాల స్టూడెంట్ జెఎసి మద్దెల రాజు, ఎఎంఎస్ఎ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు చిక్కుడు వెంకట్, మాల స్టూడెంట్ జెఎసి బత్తుల రమేష్, దిలీప్, అర్జున్ కొప్పుల, బాలరాజుఉదయ్ కుమార్, మాల స్టూడెంట్స్ జేఏసీ, అంసా, ఐక్య విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు.

## బిసిల పట్ల సిఎం వైఖరి మారాలి



10న బిసిల రాష్ట్ర స్థాయి సమావేశం: ఎంపి ఆర్.కృష్ణయ్య

ప్రజాపక్షం / హిమాయత్‌నగర్:బిసిల పట్ల సిఎం రేవంత్ రెడ్డి వైఖరి మారాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య కోరారు. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బిసి యువజన సంఘం అధ్యక్షులు జిల్లపల్లి అంజి, బిసి కులాల ఐక్య వేదిక అధ్యక్షులు అనంతయ్య, బిసి సంఘం అధ్యక్షులు సి.రాజేందర్ సంయుక్త అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి, మాట్లాడారు. బిసిల సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ నిర్ణయించడానికి ఈ నెల 10న హైదరాబాద్‌లో బిసి సంక్షేమ సంఘం విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఫీజులు కట్టలేని 6లక్షల మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు రాక అవస్థలు పడుతున్నారని ఆందోళన చెందారు. ఫీజుల స్కీంను పాత పద్ధతిలోనే అమలుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లపై ఉన్న స్టే తొలగించాలని కోరారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధాని మోదీతో సమావేశపర్చాలని సిఎం రేవంత్ రెడ్డిని విజ్ఞప్తి చేశారు. బిసి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలన్నారు. బిసి సంక్షేమ శాఖకు కమిషనర్‌ను, ప్రిన్సిపల్ సెక్రటరీ నియమించాలని కోరారు. రాష్ట్రంలో మరో 120 కాలేజీ హాస్టళ్లు, 100 బిసి గురుకుల పాఠశాలలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్ ఫీజులు చెల్లించేంతవరకు ఉద్యమం కొనసాగుతుందని ఆర్.కృష్ణయ్య తెలిపారు. సమావేశంలో బిసి సంఘం నేతలు నిఖిల్ పటేల్, ప్రీతమ్, భీంరాజు తదితరులు పాల్గొన్నారు.

## నూర్‌బాషా, దూదేకుల అభివృద్ధికి కార్పొరేషన్ తేవాలి

రాష్ట్ర ప్రభుత్వానికి మహమ్మద్ రాజమ్మద్ డిమాండ్

ప్రజాపక్షం/హిమాయత్‌నగర్:నూర్‌బాషా– దూదేకుల సమాజ అభివృద్ధి, సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ముస్లిం బిసి వెల్ఫేర్ జెఎసి వైస్ చైర్మన్ మహమ్మద్ రాజమ్మద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జెఎసి ప్రతినిధులతో కలిసి ఆయన మాట్లాడారు. 2010లో జారీ చేసిన జిఒ నంబర్ 125కు అనుగుణంగా నూర్‌బాషా – దూదేకుల సమాజానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు ప్రక్రియను ప్రభుత్వం తక్షణమే ప్రారంభించాలని కోరారు. నూర్‌బాషా–దూదేకుల సమాజం విద్య, ఉపాధి, ఆర్థిక, మహిళల సాధికారత, సామాజిక, రాజకీయ రంగాల్లో అత్యంత వెనుకబడి ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. తాము ఎవరికీ వ్యతిరేకం కాదని, ఏ ప్రభుత్వానికి, ఏ రాజకీయ పార్టీకి శత్రువుల కాదని, తమ సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నదే తమ లక్ష్యమన్నారు. ప్రభుత్వం నూర్‌బాషా– దూదేకుల సమాజంపై సమగ్ర సామాజిక, ఆర్థిక సర్వే నిర్వహించాలన్నారు. స్వయం ఉపాధికి సబ్సిడీ రుణాలు, విద్యార్థులకు ప్రత్యేక విద్యా సహాయం, స్కాలర్‌షిప్‌లు అందించాలని కోరారు. నామినేటెడ్ పదవుల్లో నూర్‌బాషా,దూదేకుల సమాజానికి తగిన ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జెఎసి రాష్ట్ర నేతలు నసురుద్దీన్, చాంద్ పాషా, సజిత్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు షాజహాన్, మహమ్మద్ హుస్సేన్, మహమ్మద్ అబ్దుల్లా, షమీనా బేగం, సలీం, వివిధ జిల్లాల నేతలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం




ఆర్‌టిఐ సాధన కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్

ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రజా సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) సాధన కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్ అన్నారు. ఆర్‌టిఐని ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రతి జిల్లాల్లో కమిటీని బలోపేతం చేస్తామని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో కమిటీ జాతీయ,రాష్ట్ర, జిల్లా స్థాయి రౌండ్‌టేబుల్ సమావేశం జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి సంయుక్త అధ్యక్షతననిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ భవిష్యత్తు కార్యాచరణ, సంస్థాగత బలోపేతం, ప్రజా సమస్యలు, ఆర్‌టిఐ చట్టాన్ని ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. డాక్టర్ చంటి ముదిరాజ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలకు సంబంధించిన ఆధారాలను సేకరించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపునకు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సూర స్రవంతి మాట్లాడుతూ ప్రతి జిల్లాలో కమిటీ కార్యకలాపాలు విస్తరింపజేయాలని సూచించారు. సమావేశాన్ని విజయవంతం చేసిన సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో కమిటీ జాతీయ ప్రధానకార్యదర్శి మల్లం వెంకటేశం, ఉపాధ్యక్షులు గోపీనాథ్ కట్టెకోలా, సహాయ కార్యదర్శి అన్నవరం సందీప్ రెడ్డి, వంగల వివేకానందు, కార్యదర్శి నవీన్ కుమార్, వేణుగోపాల్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు శ్రీకాంత్ రెడ్డి, అశోక్ కుమార్, కాశీ సతీశ్ కుమార్, గడప కృష్ణ, 33 జిల్లాల ఆర్‌టిఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

### శాసనసభల్లోనే కాదు..
# ప్రభుత్వరంగ సంస్థల్లోనూ మహిళల వాటా ఏదీ?

న్యూఢిల్లీ : మహిళలకు సరైనా వాటా కల్పించే విషయంలో అన్ని ప్రభుత్వాలు మాటలకే పరిమితం అవుతున్నాయి. ప్రజాప్రతినిధుల 'మహిళా శ్రేయస్సు' నినాదం 'మాటలగారడీని' తలపిస్తోంది. శాసనసభల్లో మహిళలకు మూడవ వంతు కోటాను అమలు చేయడంలో జాప్యంపై రాజకీయ నిందారోపణలు కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వరంగ సంస్థలలో మహిళా ఉద్యోగుల నిష్పత్తి అత్యంత తక్కువగా ఉండటం అనే మరో అడ్డంకి చెక్కుచెదరకుండా ఉందని నిపుణులు, విధానరూపకర్తలు విచారం వ్యక్తం చేస్తున్నారు. అందుబాటులో ఉన్న తాజా ప్రభుత్వ గణాంకాల ప్రకారం, కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ (సిపిఎస్ఇ')లలో శ్రామిక శక్తిలో మహిళల వాటా 10శాతం కంటే తక్కువగా ఉంది. అయితే, బాధాకరమైన విషయం ఏమిటంటే ప్రతీ 10మందిలో ఒక్కరు కూడా పర్యవేక్షక స్థాయికి చేరుకోలేకపోతున్నారు. తగినంత ప్రాతినిధ్యానికి ఇంకా చాలా దూరంలో ఉన్నప్పటికీ, ప్రైవేట్ రంగంలో దాదాపు 4వ వంతు మహిళలు నిర్వాహక పదవులను కలిగి ఉన్నారు. వివిధ సర్వేల ప్రకారం ప్రవేశస్థాయి ఉద్యోగాల విషయానికి వస్తే వారి నిష్పత్తి సుమారు మూడవ వంతుకు పెరుగుతోంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, దేశంలో మొత్తం



మీద కార్మికశక్తి భాగస్వామ్య రేటు (ఎల్ఎఫ్‌పిఆర్) 34శాతానికి పైగా ఉంది. అయితే, ఇది 2024–25 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి 40శాతం పడిపోయింది. తాజాగా ప్రభుత్వ రంగసంస్థల సర్వే ప్రకారం, 2024–25 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలలోని మొత్తం ఉద్యోగులలో మహిళల వాటా 9.8శాతంగా ఉంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 77,625గా ఉన్న ఈ సంఖ్య 2024–25 ఆర్థిక సంవత్సరంలో 76,685కు తగ్గింది. గత కొన్ని సంవత్సరాలుగా ఈ సంఖ్య 10శాతం కంటే తక్కువగానే ఉంది. ప్రభుత్వం విడుదల చేసిన సర్వే ప్రకారం, సిపిఎస్ఇలలోని మొత్తం మహిళల్లో 32.4 శాతం మంది మేనేజీరియల్ /ఎగ్జిక్యూటివ్ స్థా యిలో ఉండగా, కేవలం 8.7 శాతం మం ది మాత్రమే పర్యవేక్షక స్థాయిలో 58.9 శాతం మంది కార్మిక వర్గాలలో ఉన్నారు. పర్యవేక్షక స్థాయిలో మహిళల ప్రాతినిధ్యం 2022–23లో 10.08 శాతం నుంచి 2023–24నాటికి 9శాతానికి పడిపోయింది. ప్రభుత్వరంగ సంస్థలలో మహిళల ప్రాతినిధ్యం తక్కువగా ఉండటం ఒక సమస్య అని వైఎస్ఆర్‌సిపి ఎంపి డాక్టర్ గుమ్మ తనూజ రాణి అన్నారు. ముఖ్యంగా పార్లమెంట్, శాసనసభలలో మహిళల ప్రాతినిధ్యంపై రాజకీయ చర్చ కొనసాగుతోన్న తరుణంలో ఇది ఆందోళన కలిగిస్తోంది. ఈ దేశంలో మహిళలు పార్లమెంట్‌లో సీటు కోసం, పనిప్రదేశంలో తమ గళం వినిపించడం కోసం చాలాకాలంగా ఎదురుచూస్తున్నారు' అని తనూజ రాణి 'పిటిఐ'కి చెప్పారు. రాష్ట్ర శాసనసభలలో మ హిళలకు 33శాతం రిజర్వేషన్ అమలు చేయడ ంలో జాప్యంపై ప్రభుత్వం, ప్రతిపక్షాలు పరస్పరం నిందలు వేసుకుంటున్నాయి. లోక్‌సభలో మహిళల ప్రాతినిధ్యం మొదటి లోక్‌సభలో 10శాతం ఉండగా, ప్రస్తుత లోక్‌సభలో అది 15శాతానికి పెరిగింది. అంతేకాకుండా, ఏ రాష్ట్ర శాసనభలోనూ మహిళల ప్రాతినిధ్యం 20శాతానికి మించిలేకపోవడం గమనార్హం. హిమాచల్‌ప్రదేశ్ వంటి కొన్ని రాష్ట్రాలలో కేవలం ఒకే ఒక్క శాసనసభ్యురాలు ఉండటం ఆశ్చర్యపోయే విషయం.'అసలైన దిగ్భ్రాంతికరమైన విషయం మన సొంత ప్రభుత్వరంగంలోనే ఉంది. అక్కడ మహిళల వాటా 10శాతం కంటే తక్కువగా ఉంది. పర్యవేక్షక పదవుల్లో గత పదేళ్లుగా ఈ సంఖ్యలో ఎలాంటి మార్పులేదు. హక్కుల కార్యకర్త రంజనా కుమారి 'పిటిఐ'తో మాట్లాడుతూ సిపిఎస్ఇలలో మహిళల తక్కువ ప్రాతినిధ్యాన్ని , విస్తృత ఆర్థిక వ్యవస్థలో మహిళలు చేస్తున్న ఉద్యోగా ల పరిపక్వతతోపాటుగా పరిశీలించాల్సిన అవసరం ఉందని అన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ రూరల్ ఇండియా (టిఆర్ఐ) లో లింగ నిపుణురాలైన డాక్టర్ సీమా భాస్కరన్ మాట్లాడుతూ, భారతదేశంలోని పితృస్వామ్య వ్యవస్థ బాలికలు, మహిళలకు నాణ్యమైన, సాంకేతిక విద్యకు పరిమిత ప్రాప్యత, వృత్తిపరమైన పురోగతి లేకపోవడం, కుటుంబ సభ్యులపై ఆర్థిక, భావోద్వేగ ఆధారపడటం, అలాగే ప్రస్తుత సామాజిక నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలనే సామాజికి ఒత్తిడి వంటి నిర్మాణాత్మక అడ్డంకులను సృష్టిస్తుందని పేర్కొన్నారు.

# కల్తీ మద్యం కలకలం

- మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో 11 మంది మృతి



సాగర్: మధ్యప్రదేశ్‌లో కల్తీమద్యం కలకలక రేపింది. సాగర్ జిల్లాలో కల్తీ మద్యం సేవించి పది మంది మత్యువాత పడ్డారు. మరికొందరు అస్వస్థతకు గురయ్యారు. అయితే, స్థానిక బిజెపి ఎమ్మెల్యే మాత్రం కల్తీ మద్యం సేవించడం వల్ల 11 మంది మరణించారని తెలిపారు. మద్యం తయారీ, అమ్మకం, వినియోగంపై నిషేధం ఉన్న 'డ్రై స్టేట్' (మద్యపాన నిషేధిత రాష్ట్రం) అయిన గుజరాత్‌లోని భావ్‌నగర్ జిల్లాలో గత నెలలో కల్తీ మద్యం సేవించి 13 మంది మరణించిన ఘటన తర్వాత మధ్యప్రదేశ్‌లో ఈ విషాదం చోటుచేసుకుంది. జిల్లా కేంద్రానికి సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న బండా తహసీల్‌లోని రెండు గ్రామాల్లో అక్రమ కల్తీ మద్యం సేవించి పది మంది మరణించారని అని ప్రభావిత ప్రాంతాలను సందర్శిస్తున్న సాగర్ కలెక్టర్ ప్రతిభా పాల్ పిటిఐతో ఫోన్‌లో చెప్పారు. అస్వస్థతకు గురైన వారి సంఖ్య గురించి అడిగినప్పుడు, ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం తనిఖీలు (స్క్రీనింగ్) జరుగుతున్నాయని, జ్వరం, తలనొప్పితో బాధపడుతున్న వారిని ప్రభుత్వ ఆధ్వర్యంలోని బుందేల్‌ఖండ్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ (బిఎంసిహెచ్)కు తరలిస్తున్నామని తెలిపారు. అలాంటి ముగ్గురు వ్యక్తులను బిఎంసిహెచ్‌కు పంపారు. వారిలో ఎవరి పరిస్థితి కూడా విషమంగా లేదు అని ఆ అధికారి పేర్కొన్నారు. బండా బిజెపి ఎమ్మెల్యే వీరేంద్ర లోధిని సంప్రదించగా, 'నాకు తెలిసినంత వరకు, కల్తీ మద్యం సేవించి 11 మంది మరణించారు. మెరుగైన వైద్యం కోసం సుమారు 25 మందిని బండా సివిల్ ఆసుపత్రి నుండి ఇతర ఆసుపత్రులకు తరలించారు' అని చెప్పారు. ఆదివారం తెల్లవారుజామున మొదటి మరణం నమోదైందని పాల్ తెలిపారు. ప్రాథమిక పోస్ట్‌మార్టం నివేదికలు ఇంకా అందలేదని ఆమె పేర్కొన్నారు.

# 2029 నాటికి డ్రగ్స్ రహిత భారతదేశమే లక్ష్యం

కేంద్ర హోంమంత్రి అమిత్ షా



పనాజి: డ్రగ్స్ రహిత భారత్‌తోనే 'వికసిత్ భారత్' కల సాకరమవుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. 2029 నాటికి దేశాన్ని పూర్తిగా డ్రగ్స్ రహితంగా మార్చేందుకు కేంద్రం స్పష్టమైన రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేసిందని వెల్లడించారు. గోవా పర్యటనలో భాగంగా ఆ రాష్ట్ర సిఎం ప్రమోద్ సావంత్‌తో అమిత్ షా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో మాట్లాడిన అమిత్ షా, నక్సలిజాన్ని దేశం నుంచి ఏ విధంగా నిర్మూలించామో, అదే రీతిలో మత్తుపదార్థాల ముప్పును కూడా పూర్తిగా తుడిచిపెడతామన్నారు. '2047 నాటికి మాదకద్రవ్యాలు లేని యువశక్తి వికసిత్ భారత్‌ను ముందుకు నడిపించాలనేది ప్రధాని మోదీ లక్ష్యం. 2014 కంటే ముందు, నార్కోటిక్స్ (మాదక ద్రవ్యాల)పై పోరాటం చాలా వరకు చిన్న చిన్న విభాగాలుగా, ఒంటరిగానే సాగింది. అప్పట్లో ఏజెన్సీలు చిన్న చిన్న నిందితులను పట్టుకోవడంతోనే సరిపెట్టుకునేవి. కానీ మా ప్రభుత్వం ఈ పోరాటాన్ని జాతీయ భద్రతకు సంబంధించిన అత్యంత ముఖ్యమైన అంశంగా తీసుకుంది' అని అమిత్ షా అన్నారు.

**పక్కా ప్లాన్‌తో డ్రగ్స్ నివారణ**

2029 నాటికి మాదకద్రవ్య రహిత భారతే మా లక్ష్యం. అందుకే డ్రగ్స్ అక్రమ రవాణా, నిధుల సమీకరణ నుంచి పునరావాసం వరకు మొత్తం మాదక ద్రవ్యాల నెట్‌వర్క్‌ను నిర్మూలించడానికి కేంద్రం ఒక పక్కా వ్యూహాన్ని అవలంబిస్తోంది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రత్యేక మాదక ద్రవ్యాల నిరోధక టాస్క్‌ఫోర్స్‌లను (ఎఎన్‌టిఎఫ్) ఏర్పాటు చేశాం. స్థానిక పోలీసులను జాతీయ వ్యూహంతో అనుసంధానించాం. అంతేకాదు మాదక ద్రవ్యాల నియంత్రణ బ్యూరో కేడర్‌ను పునర్వ్యవస్థీకరించి, దాని సిబ్బందిని, కార్యాచరణ సామర్థ్యాలను పెంచడం ద్వారా బలోపేతం చేశామని అమిత్ షా చెప్పారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మకశ్మీర్‌లో వేర్పాటువాద భావనలు తగ్గాయని ఆయన అన్నారు. దేశ అంతర్గత భద్రతను మరింత మెరుగుపర్చడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

**నక్సలిజం ఇప్పుడు గతమైపోయింది!**

ఐదు దశాబ్దాలుగా దేశాన్ని పీడించిన నక్సలిజం ఇప్పుడు గతంగా మారిపోయిందని అమిత్ షా అన్నారు. 'తిరుపతి నుంచి పశుపతినాథ్ వరకు రెడ్ (మావోయిస్టు) కారిడార్' నిర్మించాలని కలలు కన్నవారు, నేడు ఆయుధాలు వీడి ప్రధాన స్రవంతిలో చేరారు. ఈశాన్య రాష్ట్రాలు కూడా ఇప్పుడు ప్రశాంతంగా ఉన్నాయి. అక్కడ 11వేల మందికి పైగా యువకులు ఆయుధాలు విడిచిపెట్టారు. మేము కన్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాం. మాదక ద్రవ్యాల ముప్పును కూడా అదే పద్ధతిలో ఎదుర్కొంటాం' అని అమిత్ షా చెప్పుకొచ్చారు.

# జార్ఖండ్ మంత్రి సుదివ్య హఠాన్మరణం



రాంచీ: జార్ఖండ్ ప్రభుత్వంలో విషాద ఛాయలు అలముకున్నాయి. రాష్ట్ర ఉన్నత, సాంకేతిక విద్యాశాఖ మంత్రి సుదివ్య కుమార్ (56) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. తన స్వస్థలమైన గిరిడిలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో తెల్లవారుజామున 2.30 గంటల ప్రాంతంలో చేరగా, ఉదయం 4 గంటల సమయంలో వైద్యులు ఆయన మరణాన్ని ధృవీకరించారని అధికారులు పేర్కొన్నారు. జెఎంఎం శాసనసభ్యుడైన సుదివ్య పట్టణాభివృద్ధి, పర్యాటకం, కళలు, సంస్కృతి, క్రీడలు, యువజన వ్యవహారాల శాఖల బాధ్యతలను కూడా నిర్వహించారు. ఆయనకు భార్య శ్వేతా శర్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు అత్యంత సన్నిహితుడైన ఆయన, జెఎంఎం నేతృత్వంలోని ప్రభుత్వం ఎదుర్కొన్న అనేక రాజకీయ సంక్షోభాలను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించారు. ఇందులో గత నెలలో రాంచీలో జరిగిన విద్యార్థుల నిరసనలు కూడా ఉన్నాయి. కుమార్ మరణం పట్ల ముఖ్యమంత్రి సోరెన్, అసెంబ్లీ స్పీకర్ రవీంద్ర నాథ్ మహతో, కాంగ్రెస్ నాయకుడు రాజేష్ ఠాకూర్ సంతాపం తెలిపారు. 'సోను భయ్యా మరణం నా జీవితంలో మాటల్లో చెప్పలేని శూన్యతను మిగిల్చింది' అని ముఖ్యమంత్రి సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు. కుమార్ కేవలం ఒక సీనియర్ సహచరుడు లేదా రాజకీయ మిత్రుడు మాత్రమే కాదని, ప్రతి కష్ట సమయంలోనూ ఆప్యాయతతో, మార్గదర్శకత్వంతో నా పక్కనే నిలిచిన అన్నయ్య లాంటి వారని ఆయన అన్నారు. సుదివ్య కుమార్ అకాల మరణం పట్ల జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం) కుటుంబం దిగ్భ్రాంతికి, తీవ్ర వేదనకు గురైంది అని పార్టీ సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొంది. కుమార్ 2019లో గిరిడిహ్ నియోజకవర్గం నుంచి తొలిసారిగా జార్ఖండ్ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 2014లో భూ కుంభకోణం, మనీలాండరింగ్ ఆరోపణలకు సంబంధించి ముఖ్యమంత్రి అరెస్టు తర్వాత తలెత్తిన సంక్షోభాన్ని చక్కదిద్దడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. గత నెలలో రాష్ట్రంలో జరిగిన విద్యార్థుల ఆందోళన సమయంలో కూడా ఆయన ప్రముఖ పాత్ర పోషించారు. నిరసనకారులతో పలు దఫాలుగా చర్చలు జరిపిన ప్యానెల్‌కు ఆయన నేతృత్వం వహించారు. రాష్ట్రంలో పర్యాటక మౌలిక సదుపాయాల నిర్వహణను మెరుగుపరిచే మార్గాలను అన్వేషించడానికి జార్ఖండ్ ప్రభుత్వ ప్రతినిధి బృందానికి నేతృత్వం వహించిన ఆయన, ఈ వారం కర్ణాటక నుంచి తిరిగి వచ్చారు. ఈ పర్యటన సందర్భంగా, ఆయన కర్ణాటక పర్యాటక శాఖ మంత్రి కె.జె. జార్జ్‌ను కలిసి, పర్యాటకం, అటవీ నిర్వహణ రంగాలలో ఇరు రాష్ట్రాల మధ్య సహకారంపై చర్చించారు.

### జెన్ జీ ఉద్యమం
# రాజకీయ పార్టీలు హైజాక్

బిఎస్‌పి అధినేత్రి మాయావతి



లక్నో : జెన్ జీ యువత, నిరుద్యోగుల సమస్యలపై కేంద్రీకృతమైన ఉద్యమాలను రాజకీయ పార్టీలు హైజాక్ చేస్తున్నాయని బిఎస్‌పి అధినేత్రి మాయావతి అన్నారు. ఇది యువత, విద్యార్థులలో తీవ్ర అనుమానాలను రేకెత్తించిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఆమె ఎక్స్‌లో పోస్టు చేస్తూ యువత, విద్యార్థులు, నిరుద్యోగుల తీవ్ర సమస్యలకు సంబంధించి సిజెపి చేపట్టిన జెన్ జీ ఉద్యమం స్వతంత్రంగా ఉండకుండా, క్రమంగా రాజకీయమయం అవుతోందన్న నమ్మకానికి దేశంలో అనేక ఉదాహరణలు ఉన్నాయన్నారు. జంతర్ మంతర్ ఉద్యమ సమయంలో గొప్ప కలలు చూసిన యువత, విద్యార్థులు ఇప్పుడు తీవ్ర అనుమానాలను ఎదుర్కొంటున్నారని, ఎందుకంటే వివిధ రాజకీయ పార్టీలు అటువంటి ఉద్యమాలను తమ చేతుల్లోకి తీసుకున్నాయని ఆమె ఆరోపించారు. అయితే, జెన్‌జీ జెన్ ఆల్ఫా యువత న్యాయబద్ధమైన డిమాండ్ల పట్ల బిఎస్‌పి ఎల్లప్పుడూ సానుభూతితో, ఆందోళనతో ఉందని మాయావతి అన్నారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలకు శాంతియుత పరిష్కారం లభించేలా సహాయం చేయడానికి సిద్ధంగా ఉండాలని, తమతమ రాష్ట్రాలు, ప్రాంతాల్లోని సంబంధిత అధికారులను కలవాలని అన్ని బిఎస్‌పి రాష్ట్ర విభాగాలకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆమె తెలిపారు. అదే సమయంలో, పార్టీ క్రమశిక్షణకు అనుగుణంగా బిఎస్‌పి కార్యకర్తలు ధర్నాలు, ప్రదర్శనలు లేదా ఆందోళనలలో పాల్గొనకూడదని, బదులుగా తమ శారీరక, మానసిక, ఆర్థిక బలాన్ని, శక్తిని ఎన్నికల కోసం కాపాడుకోవాలని మాయావతి అన్నారు. 'సర్వజన హితాయ్, సర్వజన సుఖాయ్ (అందరికీ సంక్షేమం, సంతోషం)' అనే సూత్రం ఆధారంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం, జెన్ జీ జెన్‌ఆల్ఫా, సమాజంలోని అన్ని వర్గాల సమస్యలకు శాశ్వత పరిష్కారాలు అందించడమే బిఎస్‌పి లక్ష్యమని ఆమె అన్నారు. ఉత్తరప్రదేశ్‌లో తమ నాలుగు పర్యాయాల అధికార కాలంలో పార్టీ దీనిని నిరూపించిందని బిఎస్‌పి అధినేత్రి పేర్కొన్నారు. జంతర్ మంతర్ వద్ద జెన్ జీ ఉద్యమం సందర్భంగా సంజయ్ ఆజాద్‌పై జరిగిన దాడిని ప్రస్తావిస్తూ, పోలీసులు సకాలంలో సరైన చర్యలు తీసుకుని ఉంటే ఈ తీవ్రమైన సంఘటనను నివారించగలిగేదని మాయావతి అన్నారు. ఈ కేసులో నిందితులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. అవసరమైతే ఇటువంటి విషయాలలో గళం విప్పడంలో బిఎస్‌పి వెనుకాడదని అన్నారు.

# ఢిల్లీలో కూలిన ఐదంతస్తుల భవనం

- ముగ్గురు మృతి, ఐదుగురి పరిస్థితి విషమం
- శిథిలాల కింద పలువురు బాధితులు



న్యూఢిల్లీ/కాన్పూర్/బుదౌన్ : దేశ రాజధాని ఢిల్లీ, పొరుగున ఉన్న ఉత్తరప్రదేశ్‌లో ఓ భవనం, ఇల్లు కుప్పకూలాయి. ఈ రెండు ఘటనల్లో మొత్తం తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. పలవురు శిథిలాల కింద చిక్కుకుపోయారు. దక్షిణ ఢిల్లీలోని సత్య నికేతన్ ప్రాంతంలో బాలుర పిజి ఉన్న ఓ ఐదు అంతస్తుల భవనం ఆదివారం మధ్యాహ్నం కూలిపోయింది. ఈ ప్రమాదంలో ముగ్గకు విధ్యార్థులు మృతి చెందగా, పలువురు భవన శిథిలాల కింద చిక్కుకుపోయినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రాంతం ఢిల్లీ విశ్వవిద్యాలయం సౌత్ క్యాంపస్‌కు సమీపంలో ఉంది. ఇక్కడ విద్యార్థుల హాస్టళ్లు, భోజనశాలలతో రద్దీగా ఉండే సందులు ఉన్నాయి. ఈ భవనం దాదాపు 20 ఏళ్ల నాటిదని, మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగినప్పుడు బేస్‌మెంట్‌లో నిర్మాణ పనులు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. ప్రమాదం అనంతరం సహాయక సిబ్బంది శిథిలాల నుంచి 8 మందిని వెలికి తీసి ఆసుపత్రికి తరలించగా, అందులో ముగ్గురు ప్రాణలు కోల్పోగా ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని, ఎయిమ్స్ వర్గాలు తెలిపాయి. స్థానిక పోలీసు సిబ్బంది, అగ్నిమాపక దళం, క్యాట్ అంబులెన్స్, ఇతర అత్యవసర సేవల బృందాలు ఘటనా స్థలంలో ముమ్మరంగా చర్యలు చేపట్టాయి. ఎన్‌డిఆర్ఎఫ్ బృందం కూడా చేరుకుందని, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని ఒక పోలీసు అధికారి తెలిపారు. నానక్‌పురా గురుద్వారా సమీపంలో భవనం కూలిపోయినట్లు మధ్యాహ్నం 1.34 గంటలకు సౌత్ క్యాంపస్ పోలీస్ స్టేషన్‌కు పిసిఆర్ కాల్ అందిందని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. శిథిలాల్లో చిక్కుకున్న/గాయపడిన వారి కచ్చితమైన సంఖ్య ప్రస్తుతం తెలియదని, ఇప్పటివరకు కొంతమందిని రక్షించారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. భవనం యజమానిని గుర్తించి, అతని ఆచూకీ కనుగొనేందుకు బృందాలను ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. అధికారుల ప్రకారం, కూలిపోయిన భవనాన్ని 'హాస్టల్ డేజ్' అని పిలుస్తారు. ఘటనా స్థలంలోని ప్రత్యక్ష సాక్షుల అంచనా ప్రకారం, శిథిలాల కింద 20 మందికి పైగా చిక్కుకుని ఉండవచ్చు, కానీ ఈ సంఖ్య ఇంకా అధికారికంగా ధృవీకరించబడలేదు.

### ఉత్తరప్రదేశ్‌లోనూ ఘటన



ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ జిల్లాలో ఆదివారం కురిసిన వర్షాలకు ఒక ఇల్లు కూలిపోవడంతో, ఒక వ్యక్తి, అతని ముగ్గురు మైనర్ కు మార్తెలు మరణించగా, మరో కుమార్తె తీవ్రంగా గాయపడ్డారని పో లీసులు తెలిపారు. బుదౌన్ జిల్లాలో రాత్రి కురిసిన భారీ వర్షాలకు ఇంటి గోడ కూలిపోవడంతో, శిథిలాల కింద చిక్కుకున్న ఒక రైతు అక్కడికక్కడే మరణించగా, అతని భార్య తీవ్రంగా గాయపడ్డారని వారు పేర్కొన్నారు.దయం మట్టి గోడ కూలి పడటంతో ఆరేళ్ల బాలిక మరణించిందని పోలీసులు తెలిపారు. కాన్పూర్ పోలీస్ కమిషనర్ రఘుబీర్ లాల్ పిటిఐతో మాట్లాడుతూ, హిర్ని గ్రామంలో ఉదయం 11 గంటల సమయంలో ఒక 'కచ్చా' (మట్టి/తాత్కాలిక) ఇల్లు కూలిపోవడంతో ఒక కుటుంబానికి చెందిన ఐదుగురు సభ్యులు శిథిలాల కింద చిక్కుకుపోయారని చెప్పారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు ఆ కుటుంబ సభ్యులను రక్షించి పటారాలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సిహెచ్‌సి)కు తరలించగా, అక్కడ నలుగురు మరణించినట్లు నిర్ధారించారు. మరణించిన వారిని ముఖేష్ కుమార్, అతని కుమార్తెలు మాయ (17), నీతూ (ఏడు), పల్లవి (ఐదు)గా గుర్తించారు. కుమార్ మరో కుమార్తె కాజల్ ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి కాన్పూర్‌లోని లాలా లజపత్ రాయ్ ఆసుపత్రి (ఎల్ఎల్ఆర్)లో చికిత్స పొందుతోందని పోలీసులు తెలిపారు. ఘటనా స్థలానికి రక్షణ పరికరాలతో కూడిన మూడు అగ్నిమాపక వాహనాలు, విపత్తు నిర్వహణ వాహనాన్ని పంపారు. ఆ 'కచ్చా' ఇంటి ముందు భాగం పూర్తిగా ధ్వంసమవ్వగా, వెనుక భాగంలో ఉన్న గది వంటి నిర్మాణం పాక్షికంగా దెబ్బతిన్నదని పోలీసులు పేర్కొన్నారు. ఇల్లు కూలిన తర్వాత కుటుంబ సభ్యులు సాద్ పోలీస్ స్టేషన్‌కు పదేపదే ఫోన్ చేసినప్పటికీ, మొదట్లో ఎవరూ స్పందించలేదని, ఇది పోలీసుల నిర్లక్ష్యమేనని కుమార్ బంధువు తేజ్ బహదూర్ సింగ్ ఆరోపించారు. బాధితులను పటారా సిహెచ్‌సికి తీసుకెళ్లినప్పుడు అక్కడ డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో చికిత్స ఆలస్యమైందని కూడా ఆ కుటుంబం ఆరోపించింది. ఈ లోపాలపై నిష్పాక్షిక విచారణ జరపాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## మణిపూర్‌లో ఇద్దరు మిలిటెంట్లు హతం

ఇంఫాల్/చురన్‌చాంద్‌పూర్:మణిపూర్‌లోని చురన్‌చాంద్‌పూర్ జిల్లాలో ఆర్మీ, అస్సాం రైఫిల్స్ జరిపిన సంయుక్త కాల్పుల్లో ఇద్దరు యుకెఎన్ఎ మిలిటెంట్లు మరణించగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారని అధికారులు తెలిపారు. నిఘా సమాచారం ఆధారంగా భద్రతా బలగాలు ఆగస్టు 29న రాత్రి హెంగ్లెప్ సబ్ డివిజన్‌లోని ఫైబాంగ్ గ్రామంలో ఆపరేషన్ నిర్వహించాయని వారు పేర్కొన్నారు. భద్రతా బలగాలు సెప్టెంబరు 2న తెల్లవారుజామున 5 గంటలకు యుకెఎన్ఎ క్యాంప్‌ను చుట్టుముట్టాయన్నారు. యుకెఎన్ఎ మిలిటెంట్లు విచక్షణారహితంగా కాల్పులు జరిపారని, తాము జరిపిన ప్రతి దాడుల్లో ఇద్దరు మిలిటెంట్లు హతమయ్యారని, మరో ఇద్దరు గాయపడ్డట్లు అస్సాం రైఫిల్స్ శనివారం తమ సోషల్‌మీడియా ఖాతాలో పోస్ట్ చేసింది. అనంతరం ఘటన స్థలంలో జరిపిన సోదాల్లో రెండు ఎంఎ రైఫిల్స్, ఎకె 56 రైఫిల్, ఒక లాథోడ్ గన్, ఏడు లాథోడ్ గ్రనేడ్లు, 15 ఎకె మ్యాగజైన్లు, 371 ఎకె–56 రౌండ్లు, 601 ఎంఎ రైఫిల్ రౌండ్స్, 172 ఎస్ఎల్ఆర్ రౌండ్లు, 15 కాంబాట్ యూనిఫాంలు, ఏడు సంచులు మందుగుండు సామాగ్రి స్వాధీనం చేసుకున్నట్లు అస్సాం రైఫిల్స్ తెలిపింది.

# 17 నగరాల్లో 4 వేల టన్నుల బఫర్ ఉల్లిగడ్డ విక్రయం



న్యూఢిల్లీ: వంటింటి రారాజు అయిన ఉల్లిగడ్డ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. అయితే ధరలను అరికట్టే లక్ష్యంతో చేపట్టిన రాయితీ అమ్మకాల మొదటి పది రోజుల్లోనే, 17 నగరాల్లో సుమారు 4,000 టన్నుల బఫర్ ఉల్లిపాయలను ప్రభుత్వం విక్రయించిందని వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి నిధి ఖరే ఆదివారం తెలిపారు. కేంద్రం, తన ఏజెన్సీలైన ఎన్‌సిసిఎఫ్, నాఫెడ్ ద్వారా, 2026 సంవత్సరానికి సరిపడా 1.21 లక్షల టన్నుల ఉల్లిపాయల బఫర్ నిల్వను కలిగి ఉంది. ధరలను అదుపులో ఉంచే లక్ష్యంతో చేపట్టిన రిటైల్ చర్యలో భాగంగా, ఈ ఏజెన్సీలు నిల్వ ఉంచిన ఉల్లిపాయలను ఉత్పత్తి చేసే రాష్ట్రాల నుండి వినియోగ కేంద్రాలకు 'కందా ఎక్స్‌ప్రెస్' అని పేరు పెట్టిన ప్రత్యేక రైలు బోగీల ద్వారా గానీ లేదా ట్రక్కుల ద్వారా గానీ పెద్దమొత్తంలో రవాణా చేస్తున్నాయి. ధరల పట్ల సున్నితంగా ఉండే ఎంపిక చేసిన నగరాల్లో ఉల్లిపాయలను కిలోకు రూ. 35 రాయితీ ధరకు విక్రయిస్తున్నారు. ఇప్పటి వరకు 17 నగరాల్లో సుమారు 4,000 టన్నుల బఫర్ ఉల్లిపాయలు అమ్ముడయ్యాయి అని ఖరే పిటిఐకి తెలిపారు. కాండా ఎక్స్‌ప్రెస్ ద్వారా భారీ సరుకులు ఇప్పటికే ఢిల్లీ, చెన్నైకి చేరుకున్నాయని, రానున్న రోజుల్లో గౌహతికి పంపించేందుకు మూడో రేక్‌ను ఇప్పుడు లోడ్ చేస్తున్నారని ఆమె తెలిపారు. బఫర్ ఉల్లిపాయల పంపిణీ వినియోగదారులకు కొంత ఉపశమనం కలిగించిందని, ధరలు కొద్దిగా తగ్గాయని ఖరే అన్నారు. ఎన్‌సిసిఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ అనిస్ జోసెఫ్ చంద్ర మాట్లాడుతూ, ఫెడరేషన్ ఒక్కటే ఇప్పటివరకు 1,500 టన్నుల బఫర్ ఉల్లిపాయలను విక్రయించిందని చెప్పారు. 'ఇప్పటివరకు, మేము దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో 1,500 టన్నుల బఫర్ ఉల్లిపాయలను విక్రయించాము. రిటైల్ అమ్మకాలపై, కిలోకు రూ. 35 చొప్పున విక్రయించడంపై దృష్టి సారించాము' అని ఆమె అన్నారు. సహకార సంఘాలు, ఇతర వేదికల ద్వారా అమ్మకాలు జరిపేందుకు ఎన్‌సిసిఎఫ్ కొన్ని రాష్ట్రాలతో ఒప్పందాలు కుదుర్చుకుందని ఆమె అన్నారు. ప్రస్తుతం ఢిల్లీ–ఎన్‌సిఆర్ ప్రాంతం, తమిళనాడు, ఉత్తర ప్రదేశ్, కేరళ, రాజస్థాన్, పంజాబ్, ఒడిశా, మరికొన్ని రాష్ట్రాలలో ఎన్‌సిసిఎఫ్ రిటైల్ జోక్యం కొనసాగుతోంది. ఈ రాష్ట్రాలకు బఫర్ ఉల్లిపాయల వర్గీకరణ, గ్రేడింగ్, ప్యాకింగ్, రవాణాను నోడల్ సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ (సిడబ్ల్యుసి) నిర్వహిస్తోంది. చంద్రా తెలిపిన వివరాల ప్రకారం, రాయితీ ధరపై విక్రయాలు చేపట్టడం వల్ల ఉల్లి ధరలు కిలోకు రూ. 23 మేర తగ్గాయి. వినియోగదారుల వ్యవహారాల శాఖ గణాంకాల ప్రకారం, ఆగస్టు 28న రాయితీ ధరపై విక్రయాలు ప్రారంభించినప్పుడు ఉల్లి సగటు దేశవ్యాప్త రిటైల్ ధర కిలోకు రూ. 48.5గా ఉండగా, ప్రస్తుతం అది రూ. 50.79గా నమోదైంది. సెప్టెంబర్ 5 నాటికి, ఉల్లి రిటైల్ ధర ఢిల్లీలో కిలోకు రూ. 58, ముంబయిలో రూ. 53, చెన్నైలో రూ. 63, రాంచీలో రూ. 40గా ఉండగా, సగటు హోల్‌సేల్ ధర కిలోకు రూ. 42.79గా ఉంది. కొత్త ఖరీఫ్ ఉల్లి పంట పరిస్థితి ఆశాజనకంగా ఉందని, అక్టోబర్ మధ్య నుండి మార్కెట్‌లోకి ఈ పంట రాకతో సరఫరా ఒత్తిడి తగ్గి ధరల విషయంలో మరింత ఉపశమనం లభిస్తుందని అధికారులు తెలిపారు.

### మోదీ సొంత వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే...
# ప్రతిపక్షానికి ఏటా ఒక కొత్త విశేషణం

'నరాజ్ ఫూపా' వ్యాఖ్యలపై కాంగ్రెస్ ధ్వజం

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ 'నరాజ్ ఫూపా' (అలిగిన బాబాయి) వంటి పదబంధాలను ఉపయోగించడం అనేది, తన సొంత వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రతీసారి ప్రతిపక్షానికి ఏదో ఒక కొత్త విశేషణాన్ని ఆపాదించే ఆయన పనితీరులో ఒక భాగమేనని ఆదివారం కాంగ్రెస్ ధ్వజమెత్తింది.శనివారం ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన శ్రీరామ్ కాలేజి ఆఫ్ కామర్స్ (ఎస్ఆర్‌సిసి) శతాబ్ది ఉత్సవాలలో ప్రసంగించినప్పుడు, ఆ వేదికను మరొక రాజకీయ ప్రచార వేదికగా మార్చడం ద్వారా, ఆయన ఆ వేదికను దుర్వినియోగం చేశారని కూడా ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖర్జున్ ఖర్గే మాట్లాడుతూ 'నరేంద్రమోదీజీ, నిన్న మీరు ఢిల్లీ యూనివర్సిటీలోని శ్రీరామ్ కాలేజీ ఆఫ్ కామర్స్‌ను సందర్శించారు. 'దేశ యువత, విద్య, వారి భవిష్యత్తుపై చర్చకు అది ఒక అవకాశం. కానీ విచారకరమైన విషయమేమిటింటే, యువత ప్రశ్నలను ఎదుర్కోవడానికి బదులుగా, ఆ ప్రసంగం మరో రాజకీయ ప్రచారంగా మారిపోయింది' అని ఆయనఅన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నలను అణిచివేసి, తన వైఫల్యాలు కనబడకుండా ఉండేందుకు, ప్రతీ ఏటా ప్రతిపక్షానికి ఒక విశేషణం ఇవ్వడమే మోదీజీ పంథా. 'నారాజ్ ఫూపా', 'దిమాగ్ నక్సల్' 'అర్బన్ నక్సల్', 'ఖాన్ మార్గెట్ గ్యాంగ్', 'ఆందోళన్ జీవి' 'పర్‌జీవి' అనే పదాలను మల్లికార్జున్ ఖర్గే తన హిందీ'ఎక్స్'లో పెట్టిన పోస్ట్‌లో పేర్కొన్నారు. విశేషణాలు మారుతుంటాయి. కానీ, మోదీ ప్రభుత్వ 'ప్రజా వ్యతిరేక విధానాలు మారవు' అని మల్లికార్జున్ ఖర్గే అన్నారు. 'మోదీజీ మీరు ప్రజలకు అందుబాటులో లేకుండా పోయినప్పుడే, వారిని చేరుకోవాల్సిన అవసరం ఉంటుంది. ప్రధానమంత్రి తన రిపోర్ట్ కార్డు చూపించారు. దేశ యువత కూడా తన రిపోర్ట్‌తో వస్తోంది. అందులో నిరుద్యోగం, ఏళ్ల తరబడి నిలిచిపోయిన నియామకాలు, పేపర్ లీక్‌లతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, రోజురోజుకూ విద్య ఖరీదుగా మారడం, తగ్గిపోతున్న స్కాలర్‌షిప్ అవకాశాలు, విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిపై పెరుగుతున్న ఒత్తిడి వంటి అంశాలు ఉన్నాయి' అని కాంగ్రెస్ చీఫ్ అన్నారు. దాటవేత మాటలతో పరిష్కారాలు లభించవు కాబట్టి 'ఛాత్రోంకీ గూంజ్' వినండి అని ఖర్గే అన్నారు.

# పుతిన్, జిన్‌పింగ్, ట్రంప్ ఉమ్మడి సమావేశం!



**మాస్కో:** రష్యా, చైనా, అమెరికా దేశాల అగ్రనాయకుల ఉమ్మడి సమావేశాన్ని తిరస్కరించలేమని రష్యా విదేశాంగ సహాయమంత్రి సెర్గీ రియాబ్‌కోవ్ అన్నారు. టాస్‌వార్తాసంస్థతో మాట్లాడుతూ, ఈ మూడు దేశాల నాయకుల ఉమ్మడి సమావేశాన్ని తోసిపుచ్చలేమని, అలాగని తక్షణమే దీని కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పడం కూడా అతిశయోక్తే అవుతుందని అన్నారు. ఐతే ఈ సమావేశం జరగబోదని మాత్రం తోసిపుచ్చలేమన్నారు.''అటువంటి ఆలోచన ఒకటి ఉంది, అది బహిరంగ చర్చకు వచ్చింది, కానీ తక్షణ ఏర్పాట్లు జరుగుతున్నాయనడం అతిశయోక్తి అవుతుంది, అత్యున్నతస్థాయి సమావేశం ఏర్పాట్లు ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉంటాయి'' అని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈ సమావేశాలు జరగడానికి ముందుగా కొన్ని సంకేతాలు వస్తాయని చెబుతూ రష్యా, ఇండియా, చైనా (ఆర్ఐసి) విధానాన్ని ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చునన్నారు. వాస్తవానికి రష్యా, చైనా, అమెరికా నాయకుల ఉమ్మడి సమావేశం ఇప్పటి వరకూ జరగలేదు. ఐతే ఇంతకుమించి చెప్పడానికి ఈరోజు తన వద్ద ఎలాంటి ఆధారాలు లేవని కూడా రియాబ్‌కోవ్ చెప్పారు.

# పుతిన్‌తో మూడు గంటలు ట్రంప్ దూతల భేటీ

- పూర్తిస్థాయి కాల్పుల విరమణకు తిరస్కృతి
- కీవ్ చేరుకున్న స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నెర్



**మాస్కో:** ఉక్రేన్ యుద్ధ పరిష్కారినికి మధ్యవర్తిత్వ చర్చలు పునరుద్ధరించిన ట్రంప్ తరపు అమెరికా దూతలు మాస్కోలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్‌తో శనివారం రాత్రి మూడు గంటలసేపు సంభాషించారు.తదుపరి చర్యలకు సంబంధించిన కీలక ప్రణాళికపై చర్చించారు. ఈ ప్రణాళిక ఏమిటనేది ప్రస్తుతానికి స్పష్టంగా తెలియదు. కీలక డిమాండ్లు నెరవేరకుండా పూర్తిస్థాయి కాల్పుల విరమణకు పుతిన్ తిరస్కరించారన్నది అంతర్జాతీయ మీడియా సమాచారం.ఐతే ఈ చర్చలపై ఎలాంటి అధికారిక ప్రకటనా వెలువడలేదు. ఐతే ఈ సమాచార మార్గం ఒక విశ్వాస వాతావరణం నెలకొందన్న విషయాన్ని సూచిస్తోందని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ అన్నారు.పుతిన్ విదేశాంగ విధాన సలహాదారు యూరి ఉషకోవ్ మాట్లాడుతూ, ఈ చర్చలు నిర్మాణాత్మకమైనవీ, ఎంతో ప్రయోజనాత్మకమైనవనీ చెప్పారు.ఇరు దేశాల ఉమ్మడి ప్రయోజనాలకు సంబంధించిన ప్రాజెక్టుల గురించి కూడా చర్చించినట్లు చెప్పారు. ఈ చర్చలు పూర్తిచేసి ఆదివారం వారు ఉక్రేన్ రాజధాని కీవ్‌కు చేరుకున్నారు.అధ్యక్షుడు జెలెన్స్కీతో సంభాషిస్తారు. 'ఉక్రేన్‌లో యుద్ధం ముగించేందుకు మా దగ్గర ఒక ఐడియా ఉంది''అని ట్రంప్ చెప్పిన తర్వాత ఈ దౌత్య చర్యలు పునఃప్రారంభమయ్యాయి.ఐతే ఈ శాంతి ప్రయత్నాలను పుతిన్ స్వాగతించారు.చర్చల నిమిత్తం తాత్కాలికంగా మూడురోజులు అంటే సెప్టెంబరు ఎనిమిదో తేదీ వరకూ రెండు దేశాలు కాల్పులు విరమిస్తున్నట్లు ప్రకటించాయి.

ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నెర్,పశ్చిమాసియాలో అమెరికా ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్ అమెరికా తరపున సంభాషణల్లో పాల్గొంటున్నారు.ఇరు దేశాలమధ్యా పూర్తిస్థాయి యుద్ధ దాడులు తీవ్ర స్థాయికి చేరుకున్న దశలో ట్రంప్ శాంతి యత్నాలు చేపట్టారు. రష్యాను శాంతి చర్చల దగ్గరకు తీసుకురావాలని, పుతిన్‌ను లొంగదీయాలని చాలా నెలలుగా జెలెన్స్కీ యూరోపియన్ యూనియన్ దేశాలపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. తమ సాంస్కృతిక వారసత్వ భూభాగాలను రష్యా కాపాడుకుంటుందని,ఉక్రేన్‌ను ఒక వేదికగా చేసుకుని నాటో కూటమి తూర్పువైపుగా తన సైనిక వ్యవస్థను విస్తరించేందుకు ప్రయత్నం చేస్తోందని పుతిన్ మొదటినుండీ విమర్శిస్తున్నారు. నాటో కూటమిలో ఉక్రేన్‌ను చేర్చుకోకూడదనీ,ఆయుధాలు సరఫరా చేయకూడదని పుతిన్ ప్రధాన షరతు విధించారు. కానీ బ్రిటన్ ప్రభుత్వం శక్తిమంతమైన డ్రోన్ల పరిజ్ఞానాన్ని ఉక్రేన్‌కు అందించింది. ఉక్రేన్‌కు ఆయుధ సహాయాన్ని ఆపకుండా కొనసాగిస్తామని బ్రిటన్ ప్రధానమంత్రి బర్న్‌హామ్ ఇటీవల స్పష్టం చేశారు.

రష్యా– ఉక్రేన్ మధ్య ఉన్న 1250 కి.మీ నిడివిగల సరిహద్దుల్లో ముందుకు దూసుకువెళ్లేందుకు రెండు దేశాల సైన్యాలు పోరాటం చేస్తున్న సమయంలో జెట్ ఆధారిత డ్రోన్లతో రష్యా దాడులు ఉద్ధృతం చేసింది. కీవ్ నగరంలో నిత్యం సైరన్లు మోగుతున్నాయి. గడచిన ఆరునెలలుగా ట్రంప్ ఇరాన్ యుద్ధంలో తలమునకలై ఉన్నారు. అంతకుముందు జనవరినెలలో చివరిసారి జారెడ్ కుష్నెర్, స్టీవ్ విట్‌కాఫ్ ఇద్దరూ చర్చల నిమిత్తం మాస్కో వెళ్ళారు. మళ్ళీ పుతిన్‌తో చర్చలు జరపడం ఇదే మొదటిసారి. 2022లో రష్యా పూర్తిస్థాయి దండయాత్ర చేసిన తర్వాత నుండి నేటివరకూ దాదాపు ఐదోవంతు ఉక్రేన్ భూభాగం రష్యా అధీనలోనే ఉంది.

# దురాక్రమణ చేస్తే తీవ్ర ప్రతిఘటన

## ఘాలిబాఫ్ హెచ్చరిక



**టెహ్రాన్:** అమెరికా ఎలాంటి దురాక్రమణ చర్యలకు పాల్పడినా, ఇరాన్ ప్రయోజనాలకు నష్టం కలిగించినా గానీ వారు చాలా బాధకరంగా చింతించేస్థాయిలో ఈసారి ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బాఘెర్ ఘాలిబాఫ్ హెచ్చరించారు. ఆదివారం ఉదయం పార్లమెంటు సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆట నియమ నిబంధనలు మారిపోయాయన్న విషయాన్ని అమెరికా చాలా ఆలస్యంగా తెలుసుకుందన్నారు. సమానస్థాయి ప్రతిస్పందనకు కాలం చెల్లిందని, వారు ఒక క్షిపణితో దాడి చేస్తే తాము నాలుగు క్షిపణులతో దాడులు చేస్తామన్నారు.ఇరాన్ ప్రయోజనాలకు ఎలాంటి నష్టం వాటిల్లినాగానీ చాలా శరవేగంగా,తీవ్రస్థాయిలో, రెట్టింపు దాడులు చేస్తామని,ఆ దాడుల ప్రతిస్పందన చాలా బాధాకరంగా ఉంటుందన్నారు. ఇరాన్ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. అమెరికా–ఇజ్రాయెల్ దేశాలు ఉమ్మడిగా రెండుసార్లు ఇరాన్‌పైన దాడులు చేసినాగానీ ఈ బాధలను దేశ ప్రజలు తట్టుకుని నిలబడ్డారని,ఎంతో సహనంతో వ్యవహరించారని ప్రశంసించారు. 2025 జూన్ 13 నుండి 24వ తేదీ వరకూ 12 రోజులు 2026 ఫిబ్రవరి 28 నుండి ఏప్రిల్ 8వ తేదీవరకూ 40 రోజులు రెండు విడతలుగా ఇరాన్‌పై అమెరికా యుద్ధం చేసింది. ఆ తర్వాత నుండి ఆడపాదడపా దాడులు జరుగుతూనే ఉన్నాయి. మరోవైపు హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ ఓడరేవులపై అమెరికా తన దిగ్బంధనాన్ని కొనసాగిస్తూనే ఉంది.

**నిరాశానిస్పృహతోనే ట్రంప్ దాడులు**

నిరాశానిస్పృహలతోనే అమెరికా సైనికులు ఇరాన్ చమురు నౌకలపై దాడులు చేస్తున్నారని, ప్రముఖ రచయిత,జర్నలిస్టు,పరిశోధకులు నిక్ మోటర్న్ విమర్శించారు. ఆయన అమెరికాలోనే చదువుకున్నారు. అక్కడే పెరిగిపెద్దయ్యారు.ఇరాన్ ప్రజలకు వ్యతిరేకంగా ట్రంప్ దాడులు,పౌరుల ఇళ్ళపై దాడులను ఆయన వ్యతిరేకించారు. ట్రంప్‌లో రాజకీయ నిరాశ తీవ్రమవుతోందని,ఆయన తీరు దీనినే ప్రతిబింబిస్తోందని అన్నారు.అమెరికాలో పెరిగిన ఆయుధాల కొరత,ఆ దేశ వైమానిక సిబ్బంది తీవ్రంగా అలసిపోవడం,సముద్ర వాతావరణంలో నెలల తరబడి ఉండిపోవడం,వారితో మానసిక సమస్యలు,ఒత్తిడితోపాటు స్వదేశంలో నవంబరులో రాబోయే ద్వైవార్షిక ఎన్నికలు,తగ్గిపోయిన ట్రంప్ రేటింగ్ వంటి విషయాలను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు.ఇరాన్‌కు ఉన్న నౌకా విధ్వంసక సామర్థ్యం కారణంగా ఆ దేశ జలాల దగ్గరగా వెళ్ళి దాడులు చేయకుండా అమెరికా దూరంగా ఉండిపోయిందన్నారు.

# ఇండోనేసియాలో బద్దలైన వాల్కనో

## జకర్తా సహా ఆరు విమానాశ్రయాల మూసివేత



**జకర్తా:** ఇండోనేసియాలో వాల్కనో బద్దలైంది. దీంతో లావా బయటకు తన్నుకువస్తోంది. దుమ్ము, ధూళి మేఘాలు ఆకాశాన్ని కమ్ముకున్నాయి. దీంతో ఆరు విమానాశ్రయాలను ఇండోనేసియా మూసివేసింది. దేశ రాజధాని నగరం జకర్తాలోని విమానాశ్రయాన్ని కూడా దుమ్ము, ధూళి ప్రమాదం వల్ల మూసివేశారు. ఆ దేశంలోని అనక్ క్రకటావు అగ్నిపర్వతం నుండి వాల్కలో బయటకు ప్రవహిస్తోంది. దుమ్ము, ధూళి, రాళ్ళు బయటకు వస్తున్నాయి. శుక్రవారం నాడు మెల్లిగా ఈ వాల్కలో బయటకు రావడం ప్రారంభమైంది. దీంతో పశ్చిమ ఇండోనేసియా అంతటా విమానాలను రద్దుచేశారు. జావా, సుమత్రా దీవులమధ్య సుందా జలసంధిలో ఈ వాల్కనో ఉంది. అగ్ని పర్వతం నుండి లావా బయటకు వస్తున్న దృశ్యాలను సి.సి కెమెరాల ద్వారా గమనించారు. ఇప్పటివరకూ ఎవరికీ ప్రమాదం వాటిల్లలేదు. ఎవరినీ ఖాళీచేసి వెళ్ళమని ఆదేశాలు జారీ చేయలేదు. ఈ పర్వతానికి 16 కి.మీ సమీపంలో నివాసిత ప్రాంతాలు లేవు. జకర్తాలోని కొన్ని ప్రాంతాలలో వాల్కనో ధూళి విస్తరించింది.

# గొంతు వినండి

(మొదటి పేజీ తరువాయి)

విషంలాంటి ఆహారం, డిబిటిలో మోసాలు' అని రాహుల్ గాంధీ మండిపడ్డారు. ఇప్పుడు వాళ్లు ఎంపిఎస్‌సి వంటి రాజ్యాంగబద్ధమైన సంస్థను తమ ఆధీనంలోకి తీసుకుని, దాని విశ్వసనీయతను నాశనం చేశారన్నారు. విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తు కోసం చేసే ప్రతి డిమాండ్ సమర్థనీయమైనదేనని ప్రతిపక్షనేత స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న నియామక పరీక్షల విధానంపై సమగ్ర సమీక్ష జరిపి, దానిని మరింత పారదర్శకంగా, సురక్షితంగా, విశ్వసనీయంగా, అభ్యర్థులకు అనుకూలంగా మార్చేందుకు చర్యలు సూచించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, మహారాష్ట్రలో గిరిజన విద్యార్థులు, ఉద్యోగార్థులు పేలవమైన పనితీరుపై నిరసనలు చేపట్టారు. హాస్టల్ పరిస్థితులు, విద్యార్థుల భద్రత, పరీక్ష పత్రాల లీకేజీల వంటి అంశాల నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం కీలక డిమాండ్లను అంగీకరించి, కొత్త పరీక్షల సంస్కరణల కమిటీని ఏర్పాటు చేసింది.

**బిహార్‌లో విద్యార్థులపై చర్యపట్ల రాహుల్ ఆగ్రహం**

బిహార్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు జరిపిన చర్యల పట్ల కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విరిగిన ఎముకలను సరిచేయవచ్చు కానీ, వారి ఛిద్రమైన కలలను తిరిగి ఎలా తీసుకురాగలరని ప్రశ్నించారు. పరీక్షా విధానంలో అక్రమాలపై గళమెత్తినందుకు భయంకరమైన పోలీసు దౌర్జన్యాన్ని ఎదుర్కొన్న బిహార్ విద్యార్థులు, యువతతో తాను ఇటీవల జరిపిన సమావేశానికి సంబంధించిన వీడియోను రాహుల్‌గాంధీ ఆదివారం సామాజిక మాధ్యమంలో పంచుకున్నారు. ఆ వీడియోతో పాటు హిందీలో ఓ పోస్టు చేశారు. 'ఊహించండి, ఈ పిల్లలు చేసిన పాపం ఏమిటి? వారిపైకి బుల్లెట్లు ఎందుకు ప్రయోగించారు? వారు ప్రభుత్వం నుంచి కేవలం విద్య, ఉపాధి, జవాబుదారీతనం వంటి మూడు విషయాలు మాత్రమే కోరారు. ఒక విద్యార్థి కాలి ఎముక ఎకె47 బుల్లెట్ దాడిలో విరిగిపోయింది. దాంతో పాటు సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలన్న అతని కల కూడా కరిగిపోయింది. మరో ఇద్దరు విద్యార్థుల భుజాల గుండా బుల్లెట్లు దూసుకెళ్లాయి' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు పేర్కొన్నారు. విద్యార్థులు నేరస్తులు కాదని నొక్కిచెప్పిన ఆయన, వారు పేద కుటుంబాల పిల్లలని, తమ కుటుంబాల కలలను మోస్తూ చదువుకోవడానికి బయటకు వచ్చారన్నారు. 'బుల్లెట్ గాయాలు మానుతాయి, కానీ ఈ పిల్లల మనసుల్లో లోతుగా పాతుకుపోయిన భయానికి చికిత్స చేసే ఆసుపత్రి ఎక్కడ ఉంది? అని రాహుల్ ప్రశ్నించారు. ప్రధానమంత్రి గారూ, ముఖ్యమంత్రి గారూ... వారి విరిగిన ఎముకలు సరిచేయబడవచ్చు. కానీ వారి ఛిద్రమైన కలలను మీరు తిరిగి తీసుకురాగలరా? అని నిలదీశారు. గురువారం నాడు బిహార్ విద్యార్థులను కలిసినప్పుడు రాహుల్‌గాంధీ మాట్లాడుతూ, యువత గొంతుకను అణిచివేసే ఏ ప్రభుత్వమైనా చివరికి ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉంటుందని బిజెపి గుర్తుంచుకోవాలని, ఆ రోజు ఎంతో దూరంలో లేదని అన్నారు. ఈ యువకులు కేవలం సమాన అవకాశాలు, పారదర్శకమైన పరీక్షా విధానం, తమ హక్కుల కోసం మాత్రమే డిమాండ్ చేస్తున్నారన్నారు. అటువంటి డిమాండ్లకు ప్రతిస్పందనగా లాఠీలు, బుల్లెట్లను ఉపయోగించాల్సిన అవసరం ఏముందని కాంగ్రెస్ నేత ప్రశ్నించారు. ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఏకస్థాయి పరీక్ష, పారదర్శక నియామక ప్రక్రియను డిమాండ్ చేస్తూ నిరసనకారులు ముఖ్యమంత్రి నివాసం వరకు పాదయాత్ర చేయడానికి ప్రయత్నించడంతో, గత నెలలో పాట్నాలో ఉద్యోగార్థులకు, పోలీసులకు మధ్య భీకర ఘర్షణ జరిగింది.

# భద్రతే ముఖ్యం

(మొదటి పేజీ తరువాయి)

ఆరోగ్య భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఈహెచ్‌ఎస్ అమలులో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. ఆదివారం మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో ఈహెచ్‌ఎస్ ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఉన్నతాధికారులతో భట్టి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, డిపెండెంట్లు అనారోగ్యానికి గురైనప్పుడు ఆర్థిక, మానసిక ఇబ్బందులు పడకూడదనే మానవీయ దృక్పథంతో ఈహెచ్‌ఎస్‌ను అమల్లోకి తీసుకొచ్చామని భట్టి తెలిపారు. ప్రస్తుతం 354 ప్రైవేట్ ఆసుపత్రులు పథకంలో ఉన్నాయని, మరిన్ని ఆసుపత్రులను డీమ్డ్ ఎంప్యానెల్డ్ విధానంలో చేర్చామని చెప్పారు. హెల్త్ కార్డుల జారీని వేగవంతం చేసి, ఆసుపత్రుల యాజమాన్యాలతో సమన్వయం చేసుకుని పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.ఉద్యోగ సంఘాలతో పలు మార్లు చర్చించి వారి సూచనలను పరిగణనలోకి తీసుకున్నామని డిప్యూటి సిఎం పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమం విషయంలో ప్రభుత్వం అత్యంత చిత్తశుద్ధితో ఉందని, ఈహెచ్‌ఎస్‌ను విజయవంతం చేయడంలో అధికారులు, ఉద్యోగ సంఘాలు బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. సమీక్ష సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, జెఎడి స్పెషల్ చీఫ్ సెక్రటరీ మహేష్ దత్ ఎక్కా, ఆరోగ్య, వైద్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టీనా, హోం శాఖ కార్యదర్శి యోగితా రాణా, ఈహెచ్‌ఎస్ సీఈఓ హనుమంతు, ఉద్యోగ సంఘాల నాయకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వరి సాగుకే సై

(మొదటి పేజీ తరువాయి)

ఆశించిన స్థాయిలో కాకపోయిన కొంతమేరకు కురవడంతో వరిసాగుకు ఊతం మిచ్చింది. దీంతో ఆలస్యంగా నైనా రైతులు తిరిగి వరిసాగు వైపు మొగ్గు చూపడంతో గత ఏడాదితో పోల్చితే నామమాత్రమే వరి సాగు తగ్గింది.ఈనెల 2వ తేదీ నాటికి 2025 సంవత్సరంలో 61.73 లక్షల ఎకరాలు వరి సాగు చేయగా ఎల్‌నినో నేపథ్యంలో 2026 సెప్టెంబర్ 2 నాటికి 52.81 లక్షల ఎకరాలు మాత్రమే రైతులు సాగు చేశారు. ఇది గత ఏడాదితో పోల్చితే 8.92 లక్షల ఎకరాలు రాష్ట్ర స్థాయిలో 14.4 5శాతం తగ్గింది.అయితే వ్యవసాయ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఈ నెల 5వ తేదీన వెల్లడించిన లెక్కల ప్రకారం 57.70 లక్షల ఎకరాలకు చేరినట్లు ప్రకటించడంతో గత సంవత్సరంతో పోల్చితే ఈ ఏడాది 10 శాతం మేర మాత్రమే వరి సాగు తగ్గింది. అయితే గత సంవత్సరంతో పొల్చితే ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ పలు జిల్లాలో ఈఏడాది వరి సాగు పెరిగింది. రంగారెడ్డి 59,3161(84.64 శాతం), కరీంనగర్ 13,827 (5.49శాతం) కుమురం భీమ్ ఆసిఫాబాద్ 977 (2.83శాతం), కామారెడ్డి8,788 (2.83శాతం) అధికంగా రైతులు వరి సాగు చేశారు. అదేవిధంగా గత ఏడాదితో పోల్చితే ఎల్‌నినో కారణంగా పలు ప్రధాన జిల్లాలో వరి సాగు తగ్గింది. ఈ సంవత్సరం సూర్యాపేట 1,28,557(28.55శాతం), ఎకరాలు, నల్గొండ 1,23,874(25.56శాతం), ఖమ్మం1,04,190(36శాతం), వరంగల్ 65,975( 50శాతం), సిద్దిపేట 64,614(19.52శాతం) ఎకరాలు తక్కువగా రైతులు వరి సాగు చేశాయి.

**వరిసాగుపై ఎల్‌నినో ప్రభావం నామమాత్రమే**

రాష్ట్రంలో వరిసాగుపై ఎల్‌నినో నామ మాత్రమే ప్రభావం చూపింది. ఇందుకు కారణం రాష్ట్రంలో అధిక శాతం వ్యవసాయం బోరు బావులపై ఆధారపడి ఉండడమే.వర్షకాలం ప్రారంభంలో వర్షాలు కురువకపోయినా ఆ తర్వాత కురిసిన వర్షాలను నమ్ముకుని రైతులు ఆలస్యంగా వరి సాగు చేశారు. జూలై , ఆగస్టులో రాష్ట్ర వ్యాప్తంగా మోస్తారు వర్షాలు కురవడంతో కొంత మేర భూగర్భ జలాల మట్టాలు పెరగడంతో రైతులు తిరిగి వరిసాగుపై దృష్టి సారించారు.

| క్ర.సం | జిల్లా | 2025 సాగు ఎకరాల్లో | 2026 సాగు ఎకరాల్లో |
|---|---|---|---|
| 1. | ఆదిలాబాద్ | 2,375 | 1,250 |
| 2. | కుమురం భీమ్ ఆసిఫాబాద్ | 34,475 | 35,452 |
| 3. | మంచిర్యాల | 1,37,883 | 1,30,277 |
| 4. | నిర్మల్ | 1,25,003 | 90,474 |
| 5. | నిజామాబాద్ | 4,36,695 | 4,35,600 |
| 6. | కామారెడి | 3,10,573 | 3,19,361 |
| 7. | కరీంనగర్ | 2,51,907 | 2,65,734 |
| 8. | పెద్దపలి | 2,09,748 | 2,06,126 |
| 9. | జగిత్యాల | 3,12,420 | 2,92,860 |
| 10. | రాజన్న సిరిసిల్ల | 1,85,420 | 1,47,500 |
| 11. | మెదక్ | 2,92,095 | 2,87,004 |
| 12. | సంగారెడ్డి | 1,45,372 | 1,22,118 |
| 13. | సిద్దిపేట | 3,31,020 | 2,66,406 |
| 14. | వరంగల్ | 1,30,225 | 64,250 |
| 15. | హనుమకొండ | 1,38,807 | 1,19,490 |
| 16. | మహబూబాబాద్ | 2,08,268 | 1,49,162 |
| 17 | ములుగు | 89,490 | 68,254 |
| 18. | జయశంకర్ భూపాలపల్లి | 1,05,351 | 84,512 |
| 19. | జనగామ | 1,80,898 | 1,54,404 |
| 20. | ఖమ్మం | 2,89,407 | 1,85,217 |
| 21. | భద్రాద్రి కొత్తగూడెం | 1,56,776 | 1,24,506 |
| 22. | రంగారెడ్డి | 32,126 | 91,442 |
| 23. | వికారాబాద్ | 1,17,155 | 96,893 |
| 24. | మేడ్చల్–మల్కాజిగిరి | 17,634 | 16,996 |
| 25. | మహబూబ్‌నగర్ | 1,78,358 | 1,45,169 |
| 26. | నారాయణపేట | 1,72,855 | 1,34,355 |
| 27. | నాగర్‌కర్నూల్ | 1,28,564 | 1,12,237 |
| 28. | వనపర్తి | 1,78,746 | 1,62,735 |
| 29. | జోగులాంబ గద్వాల | 83,752 | 78,713 |
| 30. | నల్గొండ | 4,84,669 | 3,60,795 |
| 31. | సూర్యపేట | 4,50257 | 3,21,700 |
| 32 | యాదాద్రి భువనగిరి | 2,54,554 | 2,10,321 |
| మొత్తం | | 61,72,878 | 52,81,313 |

# ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

ఈ రంగాన్ని సమాయత్తం చేయాలి, భారీస్థాయిలో తయారీ రంగాన్ని తీర్చిదిద్దాలి, కొత్త సాంకేతికతను సమకూర్చుకోవాలి, ప్రయోగాలకు సంబంధించిన శక్తిసామర్థ్యాలను మెరుగుపరచుకోవాలి అని కూడా ఆయన ఎక్స్‌వేదికగా పేర్కొన్నారు.అంతకుముందు ఆగస్టు 21వ తేదీన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ,ప్రభుత్వేతర సంస్థలను,ప్రైవేటు సంస్థలను ఇన్–స్పేస్ ప్రోత్సహిస్తుందని,అవి చేపట్టే వివిధ అంతరిక్ష కార్యకలాపాలను ఇన్–స్పేస్ పర్యవేక్షిస్తుందని చెప్పినట్లు వార్తలు వెలువడ్డాయి.ఇక అంతిమంగా ఇస్రో ఎలాంటి అంతరిక్ష వాహక నౌకలను తయారు చేయబోదని,ప్రైవేటు రంగ సంస్థలు లేదా ప్రభుత్వేతర సంస్థలు ఈ వాహక నౌకలను తయారు చేస్తాయని పవన్ గోయంగా ఒక బహిరంగ కార్యక్రమంలో చెప్పినట్లు సమాచారం వెల్లడైంది. దీంతో ఉద్యోగ సంఘాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయి.ప్రస్తుతం ఖాళీలను భర్తీ చేయడం, భవిష్యత్ నియామకాలు, దేశ భద్రత వంటి విషయాలను ప్రధానంగా ఉద్యోగ సంఘాలు నారాయణన్‌కు రాసిన లేఖలో ప్రశ్నించాయి.

ఇస్రోను కేవలం ఒక నామమాత్రపు సంస్థగా మార్చేస్తారా? కేవలం ఒక పరిశోధన– అభివృద్ధి విభాగాలకే పరిమితం చేస్తారా? ప్రస్తుత ఖాళీల భర్తీ,మంజూరైన నియామకాలు, శాస్త్రీయ, సాంకేతిక, పారిశ్రామిక సిబ్బంది, ఉద్యోగుల నియామకాలపై ప్రభావం, భవిష్యత్ నియమాకాల సంగతి ఏమిటి? ఇంతటి ముఖ్యమైన విషయాలపై అధికారికంగా ఇస్రో ద్వారా ఎందుకు సమాచారం ఇవ్వడం లేదు? అని ఉద్యోగ సంఘాలు ఆ లేఖలో నిలదీశాయి. అంతరిక్ష సంస్థ ఈ విషయంలో విధానపరమైన ఆమోదంతో వివరణ ఇవ్వలేదు, అధికారికంగా సమాచారాన్ని ఉద్యోగులకు తెలియజేయలేదు, న్యాయపరమైన మార్గాల ద్వారా పాలనావిభాగం ద్వారా చెప్పలేదు, ఇస్రో భవిష్యత్తు గురించి, తదుపరి పర్యవసానాల గురించి, ప్రస్తుతం ఉన్న కార్మికులు, ఉద్యోగుల గురించి, ప్రభుత్వ రంగం ద్వారా ఎందుకు సమాచారం చెప్పలేదని అని ఉద్యోగ సంఘాలు ప్రశ్నించాయి.

''ఇస్రో అభివృద్ధి చేసిన సాంకేతికత జాతి సంపద, దీనిని అయాచితంగా ధారాదత్తం చేస్తారా? అత్యంత కీలకమైన ఈ సాంకేతికతలో ప్రైవేటు భాగస్వామ్యం, బదిలీ చేసే ప్రక్రియ బాహాటత్వంతో, ఒక బహిరంగ ప్రక్రియగా కొనసాగాలి, దానికి జవాబుదారీ, భద్రత ఉండాలి, స్థిరమైన వ్యూహాత్మకత ఉండాలి, ఉద్యోగుల సలహా సంప్రదింపులు లేకుండా పత్రికల ద్వారా సమాచారం తెలియజేయకూడదు అని లేఖలో ప్రశ్నించాయి. ఈ విధమైన వార్తలు ఇంకా అనేక రకాల ఆందోళనలను రేకెత్తిస్తున్నాయి,ఇస్రోకు సంబంధించి కీలకమైన పిఎస్ఎల్‌వి,ఎల్‌విఎం3 ఎస్ఎస్ఎల్‌వి డిజైన్, అభివృద్ధి, రూపకల్పన, అనుసంధానం, పరీక్షలు, ప్రయోగం, ఆ తర్వాత కొత్తగా కొనసాగింపుగా తయారు చేసే వాహకనౌకలల పనితీరు వంటి వన్నీ ఇస్రో విధులలో భాగంగా కొనసాగుతాయా? లేక నిలిపివేస్తారా? అని సంఘాలు ప్రశ్నించాయి.

**ఇస్రో పాత్రను కుదించేస్తున్న మోదీ ప్రభుత్వం: కాంగ్రెస్ విమర్శ**

అంతరిక్ష రంగంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే పేరుతో మోదీ ప్రభుత్వం ఇస్రో పాత్రను ఉద్దేశపూర్వకంగా కుదించేస్తోందని కాంగ్రెస్‌పార్టీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇస్రోలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని, ప్రైవేటు కంపెనీలను విస్తరించేందుకు మోదీ ప్రభుత్వం దూకుడు చర్యలపై ఒక ఆంగ్లపత్రికలో వచ్చిన కథనంతోపాటు తొమ్మిది ఉద్యోగ సంఘాలు కూడా ఇస్రో ఛైర్మన్ నారాయణన్‌ను నిలదీస్తూ ఒక లేఖరాసిన విషయాన్ని కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ఎక్స్ వేదికగా ప్రస్తావించారు. అంతరిక్ష రంగంలో అంకుర సంస్థలనుప్రోత్సహించే పేరుతో దేశ అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానానికి జవాబుదారీ లేకుండా చేస్తారా? అని ప్రశ్నించారు. ఇస్రో మాజీ ఛైర్మన్ ఒకరు ఎంతో ధైర్యంగా ఈ విషయాన్ని బాహాటంగా ప్రశ్నించారని గుర్తుచేశారు. జి.మాధవన్ నాయర్ గురించే ఆయన పరోక్షగా ప్రస్తావించారు. శుక్రవారంనాడు ఇస్రో ఎంతో విజయవంతంగా మొట్టమొదటి ఇమేజింగ్ శాటిలైట్‌ను జిఎస్ఎల్‌వి ద్వారా 2,300 కేజీల పేలోడ్‌ను భూస్థిర కక్ష్యలోకి ప్రవేశపెట్టి ఘన విజయం సాధించిందని, ఈ విజయం ఉద్యోగులలో ఎంతో ఆత్మవిశ్వాసాన్ని నింపిందని, కానీ మోదీ ప్రభుత్వం అంకుర సంస్థలను ప్రోత్సహించే పేరుతో ఇస్రో పాత్రను పరిమితం చేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అనేక దశాబ్దాలుగా అభివృద్ధి చేసుకున్న ఇస్రో శక్తి సామర్థ్యాలను ప్రైవేటు కంపెనీలకు ధారాదత్తం చేస్తే జవాబుదారీ సంగతి ఏమిటన్నారు. ఈ విషయాలను ఇప్పుడు ఇస్రోలో ఉన్న ధైర్యవంతులు ముందుకు వచ్చి ప్రశ్నిస్తున్నారన్నారు.

# రావాలా?

(మొదటి పేజీ తరువాయి)

స్పీచ్‌లు ఇస్తున్నారని, అసెంబ్లీకి రావాలని ధర్నాలు చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం పోవడం ఖాయమని ఆ పార్టీ నాయకులకు అర్థమైందని, అందుకే అడ్డగోలుగా దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. కృష్ణా, గోదావరి నదీ జలాల అంశంపై ఉధృతమైన పోరాటం చేయాలని కెసిఆర్ సూచించారు.ఉద్దేశపూర్వకంగా రైతులకు సాగునీరు ఇవ్వకుండా ప్రభుత్వం గోస పెడుతోందని, రాజకీయాల కోసం అద్భుతమైన కాళేశ్వరం ప్రాజెక్టు పంపులను ఎందుకు ఆన్ చేయడం లేదని ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాలకు అందరూ తప్పకుండా హాజరుకావాలని కెసిఆర్ సూచించారు. ఉభయసభలలో జరిగే ప్రతి చర్చలో పాల్గొనాలని, ఈ సమావేశాలను ఎవ్వరూ లైట్‌గా తీసుకోవద్దన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ప్రస్తుత పనితీరుపైన ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. అధికార పాక్షం తన ప్రస్తావన తీసుకొచ్చినా చర్చ నుంచి పక్కకు వెళ్లవద్దని, డైవర్షన్ పాలిట్రిక్స్‌లో పడ్డొదని కెసిఆర్ సూచించినట్టు తెలిసింది.

**అసెంబ్లీకి రావాల్సిన అవసరం లేదు...**

శాసనసభ సమావేశాలకు 'మీరు' (కెసిఆర్) రావాల్సిన అవసరం లేదని బిఆర్ఎస్ఎల్‌పి సమావేశంలో ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా నిర్ణయించారు. పదే పదే కెసిఆర్‌ను తిడుతున్న నేపథ్యంలో కెసిఆర్ తరపున తామే సరిపోతామని వారు స్పష్టం చేశారు.

**ప్రజా సమస్యలపైన ప్రభుత్వాన్ని నిలదీస్తాం: హరీశ్‌రావు**

ప్రజా సమస్యలపైన సమగ్రంగా చర్చించేందుకు కనీసం నెల రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలను నిర్వహించాలని బీఏసీ సమావేశంలో డిమాండ్ చేయనున్నట్లు బిఆర్ఎస్ఎల్‌పి ఉపనాయకుడు తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. 22ఎ కింద నిషేధిత జాబితాలో పెట్టిన వ్యవసాయ భూములు, కరెంట్ కోతలు, రుణమాఫీలో వైఫల్యం, పాలిటెక్నిక్ జీవో 97 రద్దు, సింగరేణి కుంభకోణాలు, పీఆర్సీ, డీఏలు, ఈహెచ్‌ఎస్ వైఫల్యం లాంటి పలు అంశాలపైనా అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. బిఆర్ఎస్ఎల్‌పి సమావేశ వివరాలను హరీశ్‌రావు మీడియాకు వెల్లడించారు. సిఎం రేవంత్ రెడ్డి మాటల తీరు చూసి సభ్యసమాజం తలదించుకుంటోందని, అలాంటి గౌరవం లేని సభకు కెసిఆర్ వెళ్లాల్సిన అవసరం లేదన్నారు.ప్రతిపక్ష నేతగా, రెండు సార్లు ముఖ్యమంత్రిగా చేసిన కేసీఆర్ భద్రత విషయంలో సిఎం రేవంత్ రెడ్డికి ఏడుపు ఎందుకని ఆయన ప్రశ్నించారు. ఏపీలో మాజీ సీఎంలకు భద్రత కల్పించడం లేదా?, కనీసం వార్డు మెంబర్ కూడా కాని సిఎం తమ్ముడు తిరుపతి రెడ్డికి నలుగురు గన్‌మెన్లను పెట్టి, భద్రత కోసం రూ 40 కోట్లు ఎలా ఖర్చు పెడుతున్నారని ప్రశ్నించారు. ఎంజీఆర్, జయలలిత, కరుణానిధి, ఎన్టీఆర్, చంద్రబాబు లాంటి నేతల పట్ల అసెంబ్లీలో అనుచితంగా ప్రవర్తించినప్పుడు, వాళ్లు సభను బహిష్కరించి, ప్రజాక్షేత్రంలోకి వెళ్లి మళ్లీ ముఖ్యమంత్రులుగా సభలోకి అడుగుపెట్టిన చరిత్ర ఉన్నదని హరీశ్‌రావు గుర్తు చేశారు.

# కెసిఆర్ విఫలం

(మొదటి పేజీ తరువాయి)

వివరించాలని వారు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కెసిఆర్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జి.వివేక్ వెంకటస్వామి, మహ్మద్ అజారుద్దీన్, ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి, మాజీ ఎంపి మధు యాష్కీ గౌడ్, జగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు. మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్షలైన నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తాము పోరాటాలు చేశామని స్పష్టం చేశారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనకు, పదేళ్ల బిఆర్ఎస్ దుర్మార్గానికి మధ్య తేడాపై ఎక్కడైనా బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, బిఆర్ఎస్ నాయకులకు ఆ సవాల్‌ను స్వీకరించే ధైర్యం ఉందా? అని నిలదీశారు. గతంలో కెసిఆర్ చేసిన కొండంత అప్పులను మోస్తూనే తమ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా నిరుపేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని గుర్తుచేశారు. కెటిఆర్ కేవలం సోషల్ మీడియాకే పరిమితమై క్షణికానందం పొందుతున్నారని, ఆయన చదువుకున్నప్పటికీ సంస్కారం లేని రీతిలో ప్రవర్తిస్తున్నారని మహేశ్ గౌడ్ దుయ్యబట్టారు. తెలంగాణ సంస్కృతిని కాపాడుతూ గద్దర్, అందెశ్రీ, పూలే, సర్దార్ సర్వాయి పాపన్న వంటి మహనీయులను గౌరవించిన ఘనత కాంగ్రెస్‌దేనని తెలిపారు. రాష్ట్రాన్ని దశాబ్దాల పాటు ఏలే శక్తి కాంగ్రెస్‌కు ఉందని, తెలంగాణలో 2040 వరకు తమ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని తేల్చిచెప్పారు. తెలంగాణ మట్టిలో బిఆర్ఎస్ అనే మొక్క ఇప్పటికే వాడిపోయిందని, బిజెపి అనే మొక్క అసలు మొలకెత్తనే మొలకెత్తదని ఆయన ఎద్దేవా చేశారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే మహిళలకు ఉచిత ఆర్‌టిసి బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ, రైతుభరోసా, సన్నవడ్ల బోనస్ వంటి పథకాలను అమలు చేశామని తెలిపారు. 72 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేశామని పేర్కొన్నారు. గురుకులాల్లో డైట్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచడంతో పాటు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు నిరంతరం కృషి చేస్తూ సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నారని తెలిపారు. తెలంగాణకు బిజెపి చేసిందేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బిఆర్ఎస్ నేతలతో రోడ్లపై మాట్లాడించడం కాదని, అసెంబ్లీకి వస్తే సమాధానం చెప్తామని అన్నారు. వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ కెసిఆర్ ప్రజాతీర్పును అపహాస్యం చేయవద్దని, అసెంబ్లీకి రాకపోతే ప్రతిపక్ష నేత పదవిని మరొకరికి అప్పగించాలని హితవు పలికారు. మహ్మద్ అజారుద్దీన్ మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధిలో అన్ని వర్గాలను భాగస్వాములను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ అర్హులైన వారికి రేషన్ కార్డులు, ఇతర సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. చామల కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుడిగా ప్రజల సమస్యలపై ప్రశ్నించకుండా కేవలం ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కెసిఆర్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మధు యాష్కీ మాట్లాడుతూ ఇకనైనా బిఆర్ఎస్ నాయకుడి వైఖరి మారకుంటే, మరో పదేళ్లు కూడా వాళ్లు రోడ్ల మీదనే ఉంటారని పేర్కొన్నారు. ఈ మహా ధర్నాలో కాంగ్రెస్ ఎంపిలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, డిసిసి అధ్యక్షులు, మహిళా నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. కెసిఆర్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించి, నిరసన వ్యక్తం చేశారు.

# ఆ ఒక్క విజయం.. పాక్ క్రికెట్ పతనం ప్రారంభం!



పాకిస్తాన్ క్రికెట్ జట్టు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సంక్షోభానికి ఆ జట్టు మాజీ కెప్టెన్ మహ్మద్ యూసుఫ్ ఒక విచిత్రమైన కారణాన్ని చూపాడు. దుబాయ్‌లో జరిగిన 2021 ఐసీసీ టీ20 ప్రపంచ కప్‌లో భారత్‌పై పాకిస్తాన్ 10 వికెట్ల తేడాతో గెలిచిన తర్వాత తమ జట్టు పతనం మొదలైందని అభిప్రాయపడ్డాడు. ఆ విజయం తర్వాత కొంతమంది ఆటగాళ్లు తాము ఏదో గొప్ప విజయం సాధించామని విర్రవీగారని, కెప్టెన్సీ కోసం నెలకొన్న పోటీ డ్రెస్సింగ్ రూమ్‌లో విభేదాలను సృష్టించిందని పేర్కొన్నాడు. "2021లో భారత్‌పై మేం గెలిచాం. ఆ మ్యాచ్ మాకు చాలా నష్టం కలిగించింది. ఎందుకంటే ఆ విజయం తర్వాత, తాము ఏదో గొప్ప విజయాన్ని సాధించామని కొందరు ఆటగాళ్లు భావించడం మొదలుపెట్టారు. ఆ తర్వాత ఏం చేయాలో వారికి అర్థం కాలేదు. మంచి ప్రదర్శన చేస్తున్నప్పుడు వినయంగా ఉండాలి. అహంకారంతో ప్రవర్తిస్తూ అగౌరవంగా వ్యవహరిస్తే సమస్యలు వస్తాయి. పాకిస్తాన్ క్రికెట్‌లో అటువంటి సమస్యలు చాలానే తలెత్తాయి. జట్టులోని ప్రతి ఒక్కరూ కెప్టెన్ కావాలని ప్రయత్నించారు. దాని పర్యవసానాలు ఇప్పటికీ పాకిస్తాన్ క్రికెట్‌కు నష్టం కలిగిస్తున్నాయి. భారత్‌పై విజయం తర్వాత వచ్చే, టీ20 ప్రపంచ కప్‌లు, ఆసియా కప్‌లు, ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో పాక్ చెత్త ప్రదర్శన చేసింది. జట్టు నుంచి మంచి ఫలితాలు రాబట్టడానికి పీసీబీ ఎన్నో ప్రయత్నాలు చేసింది. కెప్టెన్లు, కోచ్‌లు, సహాయక సిబ్బందిని మార్చింది. అయినా ఏ ఆటగాడూ ముందుకు వచ్చి బాధ్యత తీసుకోలేదు'' అని మహ్మద్ యూసుఫ్ పేర్కొన్నాడు. 2021 టీ20 ప్రపంచ కప్‌లో టీమ్ ఇండియాతో జరిగిన మ్యాచ్‌లో 152 పరుగుల లక్ష్యాన్ని పాక్ ఒక్క వికెట్ నష్టపోకుండా ఛేదించింది. ఓపెనర్లు బాబర్ ఆజమ్ (68), మహ్మద్ రిజ్వాన్ (79) నాటౌట్‌గా నిలిచి జట్టుకు ఘన విజయం అందించిన విషయం తెలిసిందే. పొట్టి వరల్డ్‌కప్ చరిత్రలో భారత్‌పై పాక్ గెలవడం అదే మొదటిసారి. ఇక, మహిళల క్రికెట్‌లో ఎన్నో ఏళ్లుగా పాకిస్తాన్‌పై తిరుగులేని ఆధిపత్యం చలాయిస్తున్న భారత జట్టు.. ఆసియా కప్‌లోనూ పైచేయి సాధించింది. శనివారం గ్రూప్‌ఎలో తన చివరి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన 7 వికెట్ల తేడాతో పాక్‌ను చిత్తు చేసింది.

## సాత్విక్ – చిరాగ్ జోడీకి
# చైనా మాస్టర్స్ టైటిల్



భారత డబుల్స్ ద్వయం సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి ఖాతాలో మరో టైటిల్ చేరింది. చైనా మాస్టర్స్ సెమీస్‌లో సంచలన విజయంతో ఫైనల్ చేరిన ఈ జోడీ.. ఆఖరి పోరులో చైనా జంటను చిత్తు చేసింది. ఆదివారం జరిగిన ఫైనల్‌లో హే జీ టింగ్ రెన్ గ్జియాంగ్‌పై అద్భుతం విజయంతో విజేతగా నిలిచింది సాత్విక్ చిరాగ్ జంట. తొలి సెట్ కోల్పోయినా ఆత్మవిశ్వాసం కోల్పోకని భారత జోడీ వరసగా రెండు సెట్లలో గెలుపొందింది. దాంతో.. చైనా షట్లర్లకు నిరాశే మిగిలింది. చైనా మాస్టర్స్‌లో సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి ద్వయం ఛాంపియన్‌గా నిలిచింది. పురుషుల డబుల్స్‌లో అంచనాలు అందుకుంటూ ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత జంట ధాటికి చైనా షట్లర్లు చేతులెత్తేశారు. తొలి సెట్‌ను 11–21తో కోల్పోయిన సాత్విక్ జోడీ ఒత్తిడికి లోనవ్వలేదు. రెండో సెట్‌లో గొప్పగా ఆడి హే జీ టింగ్ రెన్ గ్జియాంగ్‌కు 21–13తో షాకిచ్చింది. నిర్ణయాత్మక మూడో సెట్‌లోనూ భారత ద్వయం చెలరేగింది. ఫలితంగా 21–17తో సెట్‌ను గెలుపొందడంతో పాటు టైటిల్‌నూ సొంతం చేసుకుందీ స్టార్ జోడీ. గతంలో రెండుసార్లు (2023, 2025) ఈ టోర్నీలో రన్నరప్‌గా నిలిచిన సాత్విక్ చిరాగ్.. ఈసారి తమ కలను సాకారం చేసుకుంటూ విజేతగా నిలిచారు. మొత్తంగా ఈ సీజన్‌లో వీరికి ఇది రెండో టైటిల్. ఈమధ్యే ఈ జంట సింగపూర్ ఓపెన్ సూపర్ 750 టైటిల్‌ను గెలిచింది.

## ఫైనల్‌లో సూర్యవంశీకి బిగ్ షాక్



దులీప్ ట్రోఫీ 2026–27 ఫైనల్ మ్యాచ్ చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో ఈస్ట్ జోన్, సౌత్ జోన్ జట్ల మధ్య జరుగుతోంది. ఈ కీలక మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ తరఫున ఆడుతున్న యువ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ తొలి ఇన్నింగ్స్‌లో దూకుడుగా ఆడి 37 బంతుల్లో 5 ఫోర్లు, ఒక సిక్సర్ బాది 44 పరుగులు సాధించాడు. హాఫ్ సెంచరీ దిశగా దూసుకెళ్తున్న వైభవ్ సూర్యవంశీ.. ఫాస్ట్ బౌలర్ చామ మిలింద్ బౌలింగ్‌లో షార్ట్ పిచ్ బంతిని సిక్సర్‌గా మలచి అర్ధ శతకం పూర్తి చేయాలని ప్రయత్నించాడు. అయితే ఆ బంతి సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్ తానయ్ త్యాగరాజన్ చేతికి చిక్కడంతో వైభవ్ సూర్యవంశీ పెవిలియన్కు చేరాల్సి వచ్చింది. అంతకు ముందు ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ, అభిమన్యు ఈశ్వరన్ కలిసి తొలి వికెట్‌కు అద్భుతమైన శతక భాగస్వామ్యాన్ని(100 పరుగులు) అందించారు. క్రీజులోకి వచ్చిన వెంటనే వైభవ్ సూర్యవంశీ తన జోరును ప్రదర్శించాడు. ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లో టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్ వేసిన తొలి బంతికే అద్భుతమైన బౌండరీ బాదాడు. ఆ తర్వాత మహ్మద్ నిధిష్ బౌలింగ్‌లో రెండు ఫోర్లు కొట్టగా.. తిరిగి మహమ్మద్ సిరాజ్ ఓవర్‌లో ఏకంగా 14 పరుగులు పిండుకుని ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి పెంచాడు. ఈ టైటిల్ పోరులో తూర్పు జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్ టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ఈ మ్యాచ్ లో సౌత్ జోన్ జట్టులో మహమ్మద్ సిరాజ్, దేవదత్ పడిక్కల్ వంటి స్టార్ ఆటగాళ్లు బరిలోకి దిగారు. ఇక ఈ టోర్నీలో క్వార్టర్ ఫైనల్లో తక్కువ పరుగులు చేసినప్పటికీ బౌలింగ్‌లో రాణించిన వైభవ్ సూర్యవంశీ.. సెమీ ఫైనల్స్‌లో అద్భుత ఇన్నింగ్స్‌లతో(92, 40 పరుగులు) దులీప్ ట్రోఫీలో అర్ధ సెంచరీ సాధించిన అతి పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు.

# ఆరోగ్యం

## 'బుండిబుగ్యో' ఎబోలా

డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డిఆర్‌సి)లో ప్రస్తుతం ఎబోలా వ్యాధి వేగంగా వ్యాపిస్తుండడం ప్రపంచ ఆరోగ్య నిపుణులను అప్రమత్తం చేసింది. 2026 మేలో ఈ వ్యాధి అధికారికంగా గుర్తించినప్పటి నుంచి ఇప్పటివరకు 837 నిర్ధారిత కేసులు, 196 మరణాలు నమోదయ్యాయి. ఈసారి వ్యాధికి కారణమైన వైరస్ 'బుండిబుగ్యో' రకం కావడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చింది. ఈ వైరస్‌కు ఇప్పటివరకు ఆమోదం పొందిన టీకా లేదా ప్రత్యేక చికిత్స అందుబాటులో లేదు. నిపుణుల ప్రకారం, ప్రారంభ దశలో ఈ వైరస్‌ను సాధారణ 'జైర్' రకం ఎబోలాగా భావించడం వల్ల సరైన నిర్ధారణ ఆలస్యమైంది. దీంతో వైరస్ అప్పటికే అనేక ప్రాంతాలకు వ్యాపించింది. అంతేకాకుండా, ఘర్షణలు జరుగుతున్న ప్రాంతాల్లో ప్రజలు తరలిపోవడం, బాధితులతో సన్నిహితంగా ఉన్న వారిని గుర్తించే 'కాంటాక్ట్ ట్రేసింగ్' సమర్థంగా జరగకపోవడం కూడా వ్యాధి వ్యాప్తికి కారణమైంది. ప్రస్తుతం బుండిబుగ్యో వైరస్‌కు టీకా అభివృద్ధి కోసం ప్రపంచ వ్యాప్తంగా పరిశోధనలు వేగంగా సాగుతున్నాయి. వైరల్ వెక్టర్, ఎంఆర్‌ఎన్‌ఏ ఆధారిత టీకాలను అభివృద్ధి చేస్తున్నప్పటికీ, అవి మానవ పరీక్షలకు రావడానికి ఇంకా కొన్ని నెలలు పట్టే అవకాశం ఉంది. అయితే ఈ వ్యాధి ప్రపంచవ్యాప్తంగా మహమ్మారిగా మారే అవకాశం తక్కువగానే ఉందని అంటువ్యాధి నిపుణులు చెబుతున్నారు. ఎబోలా వైరస్ కరోనా మాదిరిగా గాలి ద్వారా వ్యాపించదు. ఇది ప్రధానంగా బాధితుల రక్తం లేదా ఇతర శరీర ద్రవాలతో ప్రత్యక్ష సంబంధం వల్ల మాత్రమే సంక్రమిస్తుంది. అందువల్ల బాధితులను వెంటనే గుర్తించి వేరుచేయడం, వారి సన్నిహితులను పర్యవేక్షించడం, క్వారంటైన్ చర్యలను సమర్థంగా అమలు చేయడం ద్వారా ఈ వ్యాధిని అదుపులోకి తీసుకురావచ్చని నిపుణులు విశ్వసిస్తున్నారు.



## కొలెస్ట్రాల్ చికిత్సలో ముందడుగు



కొలెస్ట్రాల్ చికిత్సలో 'విఇఆర్‌విఇ 102' అనే కొత్త జీన్ ఎడిటింగ్ ఆధారిత ఇంజెక్షన్ వైద్యరంగంలో ఆశాజనకమైన ముందడుగుగా గుర్తింపు పొందుతోంది. ఒక్కసారి ఇంజెక్షన్ తీసుకుంటేనే రక్తంలోని చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డిఎల్) స్థాయిని దీర్ఘకాలం గణనీయంగా తగ్గించే అవకాశం ఉందని ప్రారంభ క్లినికల్ పరిశోధనలు సూచిస్తున్నాయి. ప్రతిరోజూ మందులు వాడాల్సిన అవసరం లేకపోవడం దీని ప్రధాన ప్రత్యేకత. ఈ చికిత్స కాలేయంలోని పిసిఎస్‌కె 9 జన్యువును లక్ష్యంగా చేసుకుని పనిచేస్తుంది. ఈ జన్యువు ప్రభావం తగ్గితే కాలేయం రక్తంలోని ఎల్‌డిఎల్ లేదా L కొలెస్ట్రాల్‌ను మరింత సమర్థంగా తొలగిస్తుంది. ఫలితంగా రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయి గణనీయంగా తగ్గుతుంది. 'విఇఆర్‌విఇ 102' ప్రస్తుతం ఫేజ్1బి హార్ట్2 క్లినికల్ ట్రయల్ దశలో ఉంది. ఈ పరిశోధనలో అత్యధిక మోతాదు పొందిన కొంతమంది రోగుల్లో ఎల్‌డిఎల్ కొలెస్ట్రాల్ సుమారు 69 శాతం వరకు తగ్గినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. అయితే 'విఇఆర్‌విఇ 102' ఇంకా సాధారణ వైద్య వినియోగానికి ఆమోదం పొందలేదు. దీని భద్రత, దీర్ఘకాల ప్రభావం, దుష్ప్రభావాలపై మరిన్ని క్లినికల్ పరీక్షలు పూర్తయ్యాకే తుది నిర్ణయం తీసుకుంటారు. అప్పటి వరకు వైద్యులు సూచించిన కొలెస్ట్రాల్ చికిత్సను కొనసాగించడమే ఉత్తమం.

## ముదురురంగు సీసాల్లోనే ఎందుకు?




చర్మ సంరక్షణ ఉత్పత్తుల్లో విటమిన్ 'సి' సీరమ్‌కు ప్రత్యేక స్థానం ఉంది. అయితే మార్కెట్లో లభించే దాదాపు అన్ని విటమిన్ 'సి' సీరమ్‌లు గోధుమ, అంబర్ లేదా ఇతర ముదురు రంగు గాజు సీసాల్లోనే విక్రయించబడతాయి. ఇది కేవలం ఆకర్షణీయమైన ప్యాకేజింగ్ కోసం కాదని, శాస్త్రీయ కారణాల వల్లనే ఈ విధంగా తయారు చేస్తారని నిపుణులు చెబుతున్నారు. ఔషధ, సౌందర్య ఉత్పత్తుల పరిశోధన నిపుణుడు డాక్టర్ సౌరభ్ అరోరా వివరణ ప్రకారం, విటమిన్ 'సి'లో ఉండే 'ఆస్కార్బిక్ యాసిడ్' కాంతికి, ముఖ్యంగా సూర్యరశ్మిలోని అతి నీలలోహిత (అల్ట్రావయొలెట్) కిరణాలకు చాలా సున్నితంగా స్పందిస్తుంది. కాంతి తగిలినప్పుడు ఆస్కార్బిక్ యాసిడ్ వేగంగా రసాయనిక మార్పులకు లోనై విచ్ఛిన్నమవుతుంది. దీనివల్ల అది తన ప్రభావాన్ని కోల్పోయి చర్మానికి ఆశించిన ప్రయోజనాలను అందించలేకపోతుంది. అందుకే కాంతి లోపలికి ప్రవేశించకుండా నిరోధించే ముదురు రంగు గాజు సీసాల్లో విటమిన్ 'సి' సీరమ్‌ను నిల్వ చేస్తారు. కేవలం కాంతి మాత్రమే కాదు, గాలిలోని ఆక్సిజన్ కూడా విటమిన్ 'సి' శత్రువే. విటమిన్ 'సి' ఒక శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ కావడంతో ఆక్సిజన్‌తో సులభంగా చర్యకు లోనవుతుంది. ఈ ప్రక్రియను 'ఆక్సీకరణ' అంటారు. సీసా తరచూ తెరవడం వల్ల కొంత గాలి లోపలికి వెళ్లినా, నాణ్యమైన డ్రాపర్ మూత సరిగ్గా మూసివేస్తే ఈ ప్రభావం చాలా వరకు నియంత్రణలో ఉంటుంది. అందువల్ల సాధారణ వినియోగంలో సీరమ్ నాణ్యత వెంటనే తగ్గిపోదని నిపుణులు చెబుతున్నారు. అందువల్ల సరైన ప్యాకేజింగ్‌లో ఉన్న ఉత్పత్తులను నిర్దేశించిన విధంగా ఉపయోగిస్తే పెద్దగా ఆందోళన అవసరం ఉండదు. అయితే మంచి ప్యాకేజింగ్ ఒక్కటే నాణ్యతకు ప్రమాణం కాదని నిపుణులు సూచిస్తున్నారు. సీరమ్ తయారీలో ఉపయోగించిన విటమిన్ 'సి' రూపం, నీటి శాతం, ఇతర పదార్థాల కలయిక వంటి అంశాలు కూడా చాలా ముఖ్యమైనవి. ఉదాహరణకు నీటి ఆధారిత సీరమ్‌లలో సాధారణ ఆస్కార్బిక్ యాసిడ్ కంటే 'మెగ్నీషియం ఆస్కార్బిల్ ఫాస్ఫేట్' వంటి స్థిరమైన రూపాలను ఉపయోగించడం ఉత్తమం. అలాగే 'ఇథైల్ ఆస్కార్బిక్ యాసి డ్, 'సోడియం ఆస్కార్బేట్', 'టెట్రాహెక్సిల్‌డెసైల్ ఆస్కార్బేట్' వంటి విటమిన్ 'సి' వివిధ రూపాలు వేర్వేరు స్థిరత్వ లక్షణాలను కలిగి ఉంటాయి. అందువల్ల ఉత్పత్తి లేబుల్‌పై ఏ రూపంలోని విటమిన్ 'సి' ఉపయోగించారో పరిశీలించడం మంచిది. విటమిన్ 'సి' సీరమ్ పాడైందో లేదో తెలుసుకోవడానికి దాని రంగును గమనించడం ఒక సులభమైన మార్గం. సాధారణంగా పారదర్శకంగా లేదా లేత రంగులో ఉండే సీరమ్ క్రమంగా పసుపు, ఆపై గోధుమ రంగులోకి మారితే, అందులోని విటమిన్ 'సి' ఆక్సీకరణకు గురవుతున్న సంకేతంగా భావించాలి. ఉపయోగిస్తున్న కొద్దీ స్వల్ప రంగు మార్పు సహజమే అయినప్పటికీ, సీసా తెరిచిన వెంటనే ముదురు రంగులో కనిపించడం లేదా చాలా తక్కువ సమయంలో రంగు మారిపోవడం జరిగితే, అది తన ప్రభావాన్ని కోల్పో యి ఉండే అవకాశం ఉంది. నిపుణుల సూచనల ప్రకారం, విటమిన్ 'సి' సీరమ్‌ను మందుల మాదిరిగానే చల్లని, పొడి ప్రదేశంలో నిల్వ చేయాలి. నేరుగా సూర్యకాంతి తగలకుండా చూసుకోవడం, ప్రతి వినియోగం తర్వాత మూతను గట్టిగా బిగించడం వల్ల సీరమ్ నాణ్యతను ఎక్కువకాలం కాపాడుకోవచ్చు. సరైన పదార్థాలు, శాస్త్రీయంగా రూపొందించిన ఫార్ములా, తగిన ప్యాకేజింగ్, సరైన నిల్వ విధా నం అనే నాలుగు అంశాలు కలిసినప్పుడే విటమిన్ 'సి' సీరమ్ ఆశించిన ఫలితాలను అందించగలదని నిపుణులు సూచిస్తున్నారు.

# దేశ సంపద బహుళ జాతి సంస్థలకు ధారాదత్తం

- సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం దేశ సంపదను బహుళజాతి సంస్థలకు, పెట్టుబడిదారులకు దారాదత్తం చేస్తుందని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం విమర్శించారు. ఆదివారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాట యోధులు కామ్రేడ్ తోడే అడివయ్య జీవిత చరిత్ర పుస్తకావిష్కరణకు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై నూతన పుస్తకావిష్కరణ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్సీ సత్యం మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో ఎంతో మంది వామపక్ష వాదులు భూమి కోసం పోరాడి ప్రాణాలను త్యాగం చేశారని కొనియాడారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ప్రాంతానికి చెందిన వామపక్షవాదులు కె.కృష్ణమూర్తి, తోడే అడివయ్య, పోచమోని జంగయ్య, కర్రె కోటప్ప, కుకుడాల జంగారెడ్డితో పాటు అనేక మంది పోరాటయోధులు భూమి భుక్తి, పేద ప్రజల విముక్తి కోసం పోరాడిన నాయకులను స్ఫూర్తిగా తీసుకొని అణగారిన వర్గాల చైతన్యానికై నడుం బిగించి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుండి పార్లమెంట్‌లో గతంలో ప్రాతినిధ్యం వహించిన సిపిఐ నాయకులు కామ్రేడ్ బొమ్మగాని ధర్మభిక్షం, కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డిలు చట్టసభల్లోకి వెళ్లి నీతిగా, నిజాయితీగా సంస్థాన్ నారయాణపూర్, మునుగోడుతో పాటు ఇబ్రహీంపట్నం ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించే వారని అన్నారు. గతంలో ఇబ్రహీంపట్నం వామపక్ష పార్టీ నాయకులు బంధూక్‌లు ఎక్కు పెట్టి దొరలకు, జమీందారులకు వ్యతిరేకంగా పోరాడి దున్నేవానికే భూమి కావాలనే నినాదంతో సమరశీల పోరాటం చేసిన ఘన చరిత్ర ఇబ్రహీంపట్నం గడ్డకు ఉందని పేర్కొన్నారు. నేడు పార్లమెంట్, చట్టసభ, అసెంబ్లీలోకి పెట్టుబడిదారులు, రియల్ ఎస్టేట్ దారులు, బడా వ్యాపారవేత్తలు అడుగు పెట్టి పేద ప్రజల ప్రజాధనాన్ని దోచుకొని దాచుకుంటున్నారని వాపోయారు. రాబోయే తెలంగాణ విమోచన దినం కార్యక్రమాలకు బిజెపి నాయకులు హంగు ఆర్భాటం చేయటం సరికాదని సూచించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో బిజెపి నాయకులు ఏనాడు పోరాటం పాల్గొన్న లేదని అన్నారు. భూ స్వాములకు, కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాడటానికి వామపక్ష పార్టీల కార్యకర్తలు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. పేద ప్రజల హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వం కోసం ప్రజాస్వామ్య, లౌకికవాదులు, వామపక్షవాదులు మద్దతు ఇవ్వాలని సూచించారు. పేద ప్రజల కోసం ప్రాణ త్యాగం చేసిన కామ్రేడ్ తోడే అడివయ్య జీవిత చరిత్రను కుటుంబ సభ్యులు పుస్తకం ఆవిష్కరించటం అభినందనీయమన్నారు. ముందుగా కామ్రేడ్ అడివయ్య, బాల్‌చందర్‌ల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సిపిఐ, సిపిఐ(ఎం) నాయకులు కావలి నర్సింహ, పి.జంగారెడ్డి, బి.స్వామేల్, కావలి సురేష్, పి .నీలమ్మ, సిహెచ్.జంగయ్య, పిఒడబ్ల్యు మాజీ అధ్యక్షురాలు సంధ్య, పి.నీలమ్మ, తోడే మానస, తోడే మదన్, శ్రీనివాస్, ప్రజా సంఘాల నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## వర్గరహిత సమాజ నిర్మాణమే
# ధ్యేయంగా పోరాడుదాం

- సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి



**ప్రజాపక్షం/హసన్‌పర్తి :** వర్గ రహిత సమాజమే నిర్మాణమే ధ్యేయంగా పోరాడుదామని భారత కమ్యూనిస్టు పార్టీ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అన్నారు. ఆదివారం బొర్ర శ్రీనివాస్ వర్ధంతి ఎల్లాపూర్ గ్రామ సిపిఐ కార్యాలయంలో గ్రామ సిపిఐ యాది సభ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి ముఖ్య అతిథిగా హాజరై ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో సోషలిజం ఏర్పాటు లక్ష్యంగా భారత కమ్యూనిస్టు పార్టీ వీరోచిత విప్లవాలను సృష్టిస్తున్న తరుణంలో కామ్రేడ్ బొర్ర శ్రీనివాస్ వర్గ రహిత, వర్ణ రహిత సమాజ నిర్మాణం కొరకు ప్రజాస్వామిక నైతిక విలువలతో పోరాడిన విప్లవ వీరుడు బొర్ర శ్రీనివాస్ అని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నేదునూరి రాజమౌళి మాట్లాడుతూ దళితులపై కమ్యూనిస్టులపై అర్బన్ నక్సలైట్లు ముద్ర వేసి, కేంద్రం నిర్బంధాన్ని పెంచి కుట్ర కేసులు బనాయించి రాజ్యాంగాన్ని దుర్వినియోగపరచి ప్రజాస్వామిక పోరాటాల్ని అణిచివేయ చూస్తుందని ధ్వజమెత్తారు. ప్రజా వ్యతిరేక పెట్టుబడిదారీ ఫాసిస్టు పాలకులపై పోరాటాలను తీవ్రతరం చేయడమే శ్రీనివాస్‌కు మనం తెలిపే నివాళులు అవుతాయని తెలిపారు. సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి మాట్లాడుతూ ఒకే దేశం ఒకే పార్టీ ఒకే నాయకుడు అనే కేంద్ర ప్రభుత్వ ప్రజాస్వామిక విధానాన్ని ప్రజల్లో ఎండ గట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ భార్య బొర్ర సరిత, కొడుకులు బుర్ర శ్రీనాథ్, నవీన, శ్రీకాంత్, మౌనిక, సిపిఐ సీనియర్ నాయకులు మోతే లింగారెడ్డి, పాక రవీందర్, ముజ్జిగ పరుశరాములు, మాజీ ఎంపిటిసి కే.సుదర్శన్ లంక దాసరి వెంకటయ్య, అల్లుడు బిడ్డ శైలేంద్ర, పరస్పాండ్ శ్రీవేణి, పరస్పాన్ దేవరకొండ ప్రభాకర్, మనుమలు అత్రావు, శుక్రాంత్, నాంపల్లి లక్ష్మ య్య, దుస్సా వెంకటేశ్వర్లు, ఎర్ర నాగరాజు, బొర్ర సంపూర్ణ, బంధుమిత్రులు పాల్గొన్నారు.

# స్వరాష్ట్రంలోనే ఉద్యోగులకు సమస్యలు




- తెలంగాణ ఉద్యోగుల జెఎసి చైర్మన్ వి.లచ్చిరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వస్తే ఉద్యోగుల సమస్యలు తీరుతాయని, మంచి సిఆర్‌సి, డిఏలు వస్తాయని ఆశించామని, కానీ స్వరాష్ట్రంలోనే ఉద్యోగుల సమస్యలకు బీజం పడిందని తెలంగాణ ఉద్యోగుల జెఎసి చైర్మన్ వి.లచ్చిరెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం హైదరాబాద్ నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో తెలంగాణ ఉద్యోగుల జెఎసి ఆధ్వర్యంలో నిర్వహించిన 'సంకల్ప సభ' నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి ఉద్యోగులు ఈ సభకు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో పెండింగ్‌లో లేని పిఆర్‌సి, డిఏలు ప్రత్యేక రాష్ట్రంలో ఎందుకు పెండింగ్‌లో పడ్డాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సిఎం, డిప్యూటీ సిఎం పలుమార్లు చర్చలు జరిపి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను పునరుద్ధరించాలని, పెండింగ్ డిఏలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ విడుదల చేయాలని, ప్రతినెలా రూ.2 వేల కోట్ల నిధులను ఉద్యోగుల బిల్లుల కోసం కేటాయించాలని డిమాండ్ చేశారు. జెఎసి సెక్రటరీ జనరల్ వొడ్నాల రాజశేఖర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఉద్యోగులంతా సంఘటితం కావాలన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి హామీలను నెరవేర్చుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యోగుల జెఎసి నాయకులు ఎస్.రాములు, మహిపాల్ రెడ్డి, బాణాల రాంరెడ్డి, నిర్మల, రాధ, గరికె ఉపేందర్ రావు పాల్గొన్నారు.

## మార్కపూడి కోటేశ్వరరావు మృతికి సిపిఐ నివాళి



**ప్రజాపక్షం/చింతకాని :** నాగిలిగొండ గ్రామపంచాయతీ మల్టీపర్పస్ సిబ్బంది మార్కపూడి కోటేశ్వరరావు (41) శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మరణవార్త తెలుసుకున్న సిపిఐ జాతియ సమితి సభ్యులు భాగం హేమంతరావు నాగిలిగొండ చేరుకొని కోటేశ్వరరావు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ కోటేశ్వరరావు గ్రామపంచాయతీ సిబ్బందిగా ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండేవాడని ఆయన మృతి కుటుంబానికి తీరని లోటన్నారు. కోటేశ్వరరావు కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. నివాళులర్పించిన వారిలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, గ్రామ సర్పంచ్ ఏపూరి పద్మ, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు షేక్ హుస్సేన్, మాజీ ఎంపిటిసి పిలీప్స్, చాట్ల మురార్జీ, చాట్ల బాబు, మార్కపూడి ఏలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కొమరయ్య ఆశయాలు నేటి తరానికి ఆదర్శం

- ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్
- ఘనంగా కామ్రేడ్ కొమురయ్య 30వ వర్ధంతి వేడుకలు




**ప్రజాపక్షం/భూపాలపల్లి :** సింగరేణి కార్మికుల హక్కుల పోరాట యోధుడు కొమురయ్య ఆశయాలు నేటి తరానికి ఆదర్శనీయమని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ కొనియాడారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి కొమురయ్య భవన్లో కామ్రేడ్ కొమురయ్య 30 వర్ధంతి వేడుకలను బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్ అధ్యక్షతన ఎఐటియుసి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా కొమురయ్య చిత్రపటానికి పూలమాలవేసి రాజ్ కుమార్, ఎఐటియుసి నాయకులు ఘన నివాళులు అర్పించారు. అలాగే భూపాలపల్లి ఏరియాలో అన్ని మైన్స్ డిపార్టుమెంటులలో కొమురయ్య చిత్రపటానికి పూలమాలవేసి వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మిక హక్కుల సాధనకు నిత్యం పోరాటాలు నిర్వహించి హక్కులను సాధించిన కార్మికుల జాతిపితగా కొమురయ్య నిలిచాడని కొనియాడారు. నల్ల నేలలో పొడిచిన ఎర్ర పొద్దులే కార్మికుల హక్కుల కోసం ఎఐటియుసి ఎర్రజెండా పక్షాన నిరంతరం పోరాటాలు నిర్వహించి అనేక హక్కుల సాధించిన పెట్టిన గొప్ప నాయకుడు అని అన్నారు. మనుబోతుల ఇంటి పేరుని యూనియన్ కొమురయ్యగా పిలిచే స్థాయికి ఎదిగాడని, కార్మికుల కష్ట నష్టాల్లో తోడునీడగా ఉండి కార్మికుల పెన్షన్ కావాలని పోరాడిన నాయకుడు, ప్రస్తుతం మనం తీసుకుంటున్న పెన్షన్ కొమురయ్య సాధించిపెట్టిందేనని గుర్తు చేశారు. నేటి తరానికి కొమురయ్య ఆశయాలు తెలవదని, వారి ఆశయాలను కొనసాగించాలని పిలుపు నిచ్చారు. నేటికీ కొమురయ్య ఆశయాలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాల సాధనకు కార్మికులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అయన మన మధ్యలో లేకపోయినా ఆశయాలను కొనసాగించడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. కొమురయ్య పోరాట స్ఫూర్తితో రాబోయే రోజుల్లో పోరాటాలు నిర్వహించి హక్కుల సాధనకై ఉద్యమించాలని రాజ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, గురుజేపల్లి సుధాకర్ రెడ్డి, నూకల చంద్రమౌళి, జి.శ్రీనివాస్ ఆసిఫ్ పాషా, తాళ్ల పోశం, తోట రామచందర్, ఎండి.కరీముల్లా, ఎల్. శంకర్, పి.శ్రీనివాస్, ఫిట్ సెక్రటరీలు టెంపుల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మోదీ నిస్సిగ్గు వ్యాఖ్యలు: సిపిఐ

**న్యూఢిల్లీ :** ఉపాధ్యాయుల దినోత్సవం నాడు టీచర్లు, విద్యార్థులకు సంబంధించిన నిజమైన సమస్యలు, సవాళ్ల గురించి మాట్లాడకుండా ప్రధాని నరేంద్ర మోదీ నిస్సిగ్గుగా రాజకీయ విమర్శలు చేయడానికి పరిమితమయ్యారని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. తమ ప్రభుత్వ చారిత్రక తప్పిదాలను కప్పిపుచ్చుకునేలా గొప్ప ప్రకటనలు చేసినంత మాత్రానా ప్రజలు నమ్మేయరని, ఈ పద్ధతి పని చేయదని మోదీ గ్రహించాలని ఆయన ఎక్స్ మాధ్యమంగా దుయ్యబట్టారు. 'ఆర్థిక డేటాను సైతం వక్రీకరించే...ప్రభావితం చేసే స్థాయికి ప్రభుత్వం దిగజారింది. ప్రశ్నిస్తే దిమాగీ నక్సల్స్ అంటోంది. కానీ దేశం ప్రశ్నించడం ఆపదు. అసంతృప్తి నేరం కాబోదు. పేర్లు పెట్టి... విమర్శించి ప్రశ్నించే గొంతులను అణచలేరు' అని డి.రాజా వ్యాఖ్యానించారు. అదే క్రమంలో మోదీ హయాంలో విద్య కోసం కేంద్ర బడ్జెట్‌పై నిలదీశారు. మీకు ఓ సరళమైన ప్రశ్న. మీ హయాంలో విద్య బడ్జెట్ ఎంత శాతం తగ్గింది? విమర్శకులు, విశ్లేషకులపై దాడులు, రాజకీయ విమర్శలకు బదులుగా దేశంలోని విద్యార్థులు, టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై సమాధానం ఇవ్వండి' అని మోదీకి డి.రాజా చురకలు అంటించారు.



**ఉత్తరప్రదేశ్‌లో అరాచక పాలన :** ఉత్తర ప్రదేశ్‌లో అరాచక పాలన సాగుతోందని, శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాలని సిపిఐ ప్రధాన కార్యదర్శి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 'సహరన్‌పూర్‌లోని 1911లో నిర్మించినట్లు, శతాబ్దానికి పైగా కాలం నాటి పత్రాలు ఉన్న మసీదును రాత్రికి రాత్రే కూల్చివేశారు. ఇది వారాంతంలో జరగడంతో, సంబంధిత సంరక్షకులకు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం కూడా లభించలేదు. ఇది న్యాయపరమైన ప్రక్రియకు, రాజ్యాంగ హక్కులకు తీవ్రమైన విఘాతం కలిగించే చర్యగా పరిగణించాలి' అని డి.రాజా ఆదివారం ఎక్స్‌లో వ్యాఖ్యానించారు. రాజకీయ ప్రత్యర్థులపై అణచివేత కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. ప్రతిపక్ష నాయకులను గృహ నిర్బంధంలో ఉంచినట్లు తెలిసిందని పేర్కొన్నారు. 'బద్లావ్ జరూరీ హై' ర్యాలీకి ముందు సీపీఐ సహరన్‌పూర్ కార్యదర్శి బెదిరింపులను ఎదుర్కొన్నారని, వ్యాపారాన్ని వసివేస్తామని హెచ్చరికలు ఆయనకు వచ్చాయని డి.రాజా వెల్లడించారు. అలాగే, సుల్తాన్‌గంజ్‌లో ఒక కామ్రేడ్ ఇంటి కూల్చివేశారని, రాంపూర్‌లో ఇప్పటికే నిర్మించిన విశ్వవిద్యాలయ ప్రాంగణాన్ని కూడా ధ్వంసం చేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలిపారు. ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి, సొంత పార్టీలో విభేదాలతో బీజేపీ, యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం కలవరపాటుకు గురవుతోందని డి.రాజా వ్యాఖ్యానించారు. ప్రజల వాస్తవ సమస్యలకు సమాధానం చెప్పాల్సిన సమయంలో బెదిరింపులు, కూల్చివేతలు, విభజన రాజకీయాలకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. రాజ్యాంగ హామీలు, ప్రజాస్వామ్య హక్కులు, న్యాయపరమైన ప్రక్రియ, చట్టపాలనను బలహీనపరిచేందుకు నిస్సిగ్గుగా చేపట్టే ఏ చర్యనైనా సీపీఐ తీవ్రంగా ఖండిస్తోందని డి.రాజా వెల్లడించారు. భయపెట్టడం ద్వారా, విభజన రాజకీయాల ద్వారా ప్రజల గొంతు నొక్కేయలేరని స్పష్టంచేశారు. ప్రజాస్వామ్య హక్కులపై దాడులను ఖండించేందుకు, రాజ్యాంగాన్ని, న్యాయపరమైన ప్రక్రియను, చట్టపాలనను కాపాడేందుకు అన్ని ప్రతిపక్షాలు ప్రజాస్వామ్య శక్తులు ఐక్యంగా పోరాడాలని డి.రాజా పిలుపునిచ్చారు.

# నర్స్ హత్య, అత్యాచారంపై మెజిస్టీరియల్ విచారణ

అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణకు అవసరమైన చర్యలు ప్రారంభించాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇటీవల హైదరాబాద్ శివార్లలోని తుక్కుగూడలో ప్రైవేట్ హాస్పిటల్‌లో నర్సు హత్యాచార ఘటనకు సంబంధించిన అన్ని అంశాలపై సమగ్రంగా మేజిస్టీరియల్ విచారణ జరిపించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ కేసులో బాధిత కుటుంబానికి సత్వరమే న్యాయం అందే విధంగా ఫాస్ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేపట్టేందుకు అవసరమైన చర్యలను ప్రారంభించాలన్నారు. న్యాయ, పోలీసు శాఖ, ప్రాసిక్యూషన్ విభాగాలు సమన్వయంతో పని చేసి కేసు విచారణలో జాప్యం లేకుండా చూడాలని సిఎం సూచించారు. ఘటనకు దారితీసిన పరిస్థితులు, బాధితురాలు ఉంటున్న వసతి ప్రదేశంలో భద్రతా ఏర్పాట్లు, సంబంధిత సంస్థ నిర్వహణలో ఏవైనా నిర్లక్ష్యాలు ఉన్నాయా?, మహిళా ఉద్యోగుల భద్రత విషయంలో పాటించాల్సిన నిబంధనలు అమలయ్యాయా? లేదా? అనే అంశాలన్నింటినీ విచారణలో పరిశీలించాలని సిఎం స్పష్టం చేశారు. ఈ కేసులో ఇప్పటికే నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్న నేపథ్యంలో దర్యాప్తును అత్యంత పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ మేరకు సిఎం రేవంత్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దర్యాప్తు, ఫోరెన్సిక్ నివేదికలు, ఇతర సాంకేతిక ఆధారాల సేకరణను వీలైనంత వేగంగా పూర్తి చేసి సమగ్ర ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేసేలా పోలీసు ఉన్నతాధికారులు ఈ కేసును నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ముఖ్యమంత్రి భరోసానిచ్చారు. ఈ కేసులో నేరానికి పాల్పడిన వ్యక్తికి చట్టప్రకారం శిక్ష పడేలా పకడ్బందీ దర్యాప్తు, సమర్థవంతమైన ప్రాసిక్యూషన్ జరగాలని సిఎం ఆదేశించారు. ఘటనకు కారణమైన వ్యవస్థాపరమైన లోపాలను గుర్తించి సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు. కాగా ఇప్పటికే ప్రభుత్వం తరఫున మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సీతక్క ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయం అందించడంతో పాటు ఇందిరమ్మ ఇల్లును కూడా మంజూరు చేశారు.

## చెన్నయ్య మృతి పట్ల సిపిఐ సంతాపం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌తో విడదీయరాని అనుబంధం కలిగిన ఎల్. చెన్నయ్య (78) మృతి చెందారు. దాదాపు ఐదు దశాబ్దాలపాటు మఖ్దూం భవన్‌లో నిబద్ధతతో, నిజాయితీగా సేవలందించిన ఆయన హైదరాబాద్ నిమ్స్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆదివారం కన్నుమూశారు. మఖ్దూం భవన్ నిర్మాణ సమయంలో కూలీ పనులకు వచ్చిన చెన్నయ్య పనితీరును అప్పటి పార్టీ నాయకత్వం గుర్తించి కార్యాలయంలో పనిచేసే అవకాశం కల్పించింది. అప్పటి నుంచి సుమారు 50 ఏళ్లపాటు కష్టపడి, అంకితభావంతో పనిచేస్తూ పార్టీ నాయకుల మన్ననలు పొందారు. ఆయన సేవలను సిపిఐ నాయకులు స్మరించుకున్నారు. చెన్నయ్య అంత్యక్రియలను మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్‌లో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. చెన్నయ్య మృతిపట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. చెన్నయ్య కుటుంబ సభ్యులకు కూనంనేని ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



## రాష్ట్రంలో వారం రోజుల పాటు వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రాబోయే ఏడు రోజుల పాటు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఈనెల 13వ తేదీ వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అక్కడక్కడా వర్షపాతం నమోదవుతుందన్నారు. రాబోయే 24 గంటల కాలంలో కొన్ని జిల్లాల్లో వాతావరణ పరిస్థితి కాస్త తీవ్రంగా ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ముఖ్యంగా ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ఆయా జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. ఈనెల 7 నుంచి 13 వరకు రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొనసాగుతాయన్నారు. వర్షాల ప్రభావంతో ఉష్ణోగ్రతలు తగ్గి, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వాతావరణం చల్లగా మారే అవకాశం ఉందని చెప్పారు.

## నిర్మాతల మండలి అధ్యక్షుడిగా సి.కళ్యాణ్ ఏకగ్రీవం

సెక్రటరీ వ్యవహారం కోర్టులో

మిగితా పోస్టులకు స్వీప్ చేసిన మన ప్యానెల్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలుగు చిత్ర నిర్మాతల మండలి 2026 ఎన్నికలలో మన ప్యానల్, ప్రోగ్రెసివ్ ప్యానల్ మధ్య జరిగిన పోటీలో మన ప్యానల్ స్వీప్ చేసింది. మన ప్యానల్ నుండి సి కళ్యాణ్ ఏకగ్రీవంగా ప్రెసిడెంట్ గా ఎన్నికయ్యారు. మన ప్యానల్ నుండి చదలవాడ శ్రీనివాసరావు గ కోశాధికారిగా, వైస్ ప్రెసిడెంట్ గా మోహన్ వడ్లపట్ల , ప్రోగ్రెస్ ప్యానెల్ నుండి దామోదర ప్రసాద్ ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీలుగా మన ప్యానల్ నుండి అమ్మిరాజు , తుమ్మలపల్లి రామ సత్యనారాయణ గెలిచారు. ఈసీ సభ్యులుగా ప్రోగ్రెసివ్ ప్యానల్ నుండి ముగ్గురు మైత్రి రవి, నిరంజన్ రెడ్డి, డివిస్ రావు గెలవగా మన ప్యానెల్ నుండి 12 మంది పద్మిని, ఎషియన్ సునీల్, మోహన్ గౌడ్, శివలెంక కృష్ణప్రసాద్, దానయ్య , వంశీ నందిపాటి , పల్లి కేశవ రావు, శ్రీనివాసరావు, పుల్లారావు, బాపి రాజు, ఆర్ కె కోడ్, నయీం గెలిచారు. ప్రస్తుతం సెక్రటరీ పోస్టు గురించి కేసు కోర్టులో ఉండటంతో ఎన్నికల ఫలితాలను ఒక సీల్డ్ కవర్లో ఎన్నికల అధికారి దుర్గా ప్రసాద్ కోర్టు లో అప్పగించనున్నారు. 8వ తేదీన కోర్టులో జడ్జ్ సమక్షంలో సెక్రటరీ ఎన్నికల ఫలితాన్ని వెల్లడించనున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అధ్యక్షుడు సి కళ్యాణ్ మేము ఇక్కడికి మంచి చేయడం కోసం వచ్చాము. నిర్మాతల కోసం వచ్చాము. నిర్మాతల మంచి కోసం పని చేస్తాము. అన్ని పరిశ్రమలకంటే తెలుగు పరిశ్రమ బావుంది. మాకు అందరూ కోపరేట్ చేయవలసిందిగా కోరుకుంటున్నాము. అతి త్వరలోనే కార్యాచరణను వెల్లడిస్తాము. చిన్న నిర్మాతలకు అన్ని విధాలుగా సాయంగా నిలబడతా. నాకు సహకరించిన బండ్ల గణేష్ కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను అన్నారు. అలాగే సెక్రటరీ సంబంధిత కేసు కోర్టులో ఉండటంతో అధికారంగా కోర్టు వెల్లడించనుంది. కోశాధికారి చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ మాకు సపోర్ట్ ఇచ్చిన నందమూరి కుటుంబానికి, సునీల్ నారంగ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు. మా ప్యానెల్ లో అనుభవజ్ఞులు ఉండటంతో వారి అనుభవాన్ని ఉపయోగించుకుని సినీ పరిశ్రమను మరింత ఉన్నత స్థాయికి చేరేందుకు కృషి చేస్తాము. చిన్న నిర్మాతలకు అండగా నిలబడతాడు' అన్నారు.

తుమ్మల ప్రసన్న కుమార్ మాట్లాడుతూ ఇక్కడ గెలిచిన సభ్యులు అందరికీ అభినందనలు. పరిశ్రమకు మంచి చేసే వారు గెలిచారు. నిర్మాతల మండలి ఎన్నికలలో బలమైన వ్యక్తులు గెలవడం గొప్ప విషయం అన్నారు.

## కానిస్టేబుల్‌పై వెంటనే చర్యలు చేపట్టాలి

టిఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తనపై అసభ్యకరంగా వ్యాఖ్యలు చేసిన కానిస్టేబుల్‌ను డిజిపి కేవలం సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్నారని,ఆయనను సర్వీస్ నుంచి ఎందుకు తొలగించలేదని తెలంగాణ రక్షణసేన(టిఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ఆ కానిస్టేబుల్‌పైన చర్యలు తీసుకోకపోతే అంతర్జాతీయ వేదికలపైన రాష్ట్ర ప్రభుత్వం పరువు తీస్తానని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని టిఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ సోషల్ మీడియాలో తనను అసభ్యంగా దూషించిన కానిస్టేబుల్‌పై వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. భారత న్యాయ సంహిత సెక్షన్ 356, సెక్షన్ 79, ఐటీ చట్టాలు ఏం చెబుతున్నాయో డిజిపి చదువుకోవాలని సూచించారు. మహిళల పట్ల ఒక్క పదం అసభ్యంగా మాట్లాడినా మూడేళ్ల పాటు శిక్ష వేసే చట్టాలు ఉన్నాయని, ఇవి కూడా డిజిపికి తెలియదా?, అసలు డిజిపి పరీక్ష పాసయ్యే పోలీసు అధికారి అయ్యారా? అని ఆమె మండిపడ్డారు. తాను 20 ఏళ్లు ప్రజా జీవితంలో ఉన్నానని, ఎంపీగా, ఎమ్మెల్సీగా, ఒక పార్టీ అధ్యక్షురాలిగా తనకే రక్షణ లేకపోతే, ఇక సాధారణ మహిళలకు ఏం రక్షణ కల్పిస్తారని నిలదీశారు. డిజిపి బాధ్యత లేకుండా సెన్సిబులిటీ లేకుండా వ్యవహరిస్తున్నారన్నారు.

ప్రస్తుత డిజిపి బాధ్యతలు చేపట్టిన తర్వాతే రాష్ట్రంలో క్రైమ్ రేటు పెరిగిందన్నారు.'హేట్ స్పీచ్ ను అరికట్టేందుకు ముఖ్యమంత్రి తీసుకొస్తామని చెప్పిన బిల్లును ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే తీసుకురావాలని డిమాండ్ చేశారు.అధికారంలోకి రావడానికి ఎన్నికల ముందు తెలంగాణ ఉద్యమకారులను ప్రస్తుత సిఎం రేవంత్ రెడ్డి ఉపయోగించుకున్నారని, ఎన్నికలకు ముందుకు దాదాపు వారి కాళ్లు పట్టుకున్నంత పనిచేశారన్నారు. కోదండ రామ్‌ను చూసి రేవంత్ రెడ్డిని ప్రజలు విశ్వసించారని, కానీ అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నప్పటికీ చీమకాలంత పనికూడా చేయలేదని ఆరోపించారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలు చర్చకు రాకుండా కాంగ్రెస్, బిఆర్ఎస్ నాటకాలు ఆడుతున్నాయని కవిత మండిపడ్డారు.

## ప్రజల గొంతుకగా "శ్రీపాదరావు వాణి"

ఎమెస్కో ప్రచురణగా అరుదైన శాసనసభా ప్రసంగాల సంకలనం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శాసనసభలో ప్రజల గొంతుకగా నిలిచిన దివంగత మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు ప్రసంగాలను అక్షరరూపంలోకి తెచ్చిన అరుదైన సంకలనం త్వరలో పాఠకుల ముందుకు రానుంది. 'ప్రజల పక్షాన శ్రీపాద వాణి' పేరుతో ఎమెస్కో ప్రచురిస్తున్న ఈ గ్రంథాన్ని వర్షాకాల శాసనసభ సమావేశాల సందర్భంగా ఆవిష్కరించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రజా సమస్యలపై శ్రీపాదరావు చేసిన లోతైన ప్రసంగాలు, సభా నిబంధనలపై ఆయనకున్న పట్టు, నిష్పాక్షిక స్పీకర్‌గా ఇచ్చిన కీలక తీర్పులు ఈ పుస్తకంలో చోటుచేసుకోనున్నాయి. 1937 నవంబర్ 6న దుద్దిళ్ల రాధాకృష్ణయ్య, కమలాభాయి దంపతులకు జన్మించిన శ్రీపాదరావు బిఎస్‌సి, ఎల్ఎల్‌బి విద్యను అభ్యసించారు. తన స్వగ్రామం ధన్వాడకు వరుసగా మూడుసార్లు ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నికై గ్రామ స్థాయి నుంచే ప్రజాసేవకు శ్రీకారం చుట్టారు. అనంతరం మంథని భూతనఖా బ్యాంకు చైర్మన్‌గా, మహాదేవ్‌పూర్ సమితి ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు.

1983లో తొలిసారి మంథని అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన.. 1984, 1989 ఎన్నికల్లోనూ వరుస విజయాలు సాధించారు. కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీ విప్‌గా, రీజినల్ టొబాకో బోర్డు సభ్యుడిగా, పలు శాసన సభ కమిటీల్లో క్రియాశీలకంగా వ్యవహరించారు. 1991 ఆగస్టు 19న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన సభ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై, 1995 జనవరి 11 వరకు ఆ పదవిలో కొనసాగారు. పాయింట్ ఆఫ్ ఆర్డర్‌లు, రూలింగ్‌ల విషయంలో ఆయన ఇచ్చిన పలు కీలక నిర్ణయాలు నేటికీ అసెంబ్లీ రికార్డుల్లో ప్రామాణికంగా నిలిచాయి. మంథని ప్రాంతంతో చివరి వరకు ఆత్మీయ అనుబంధాన్ని కొనసాగించిన శ్రీపాదరావు 1999 ఏప్రిల్ 13న 62వ ఏట నక్సలైట్ల చేతిలో హత్యకు గురయ్యారు. అయినప్పటికీ ప్రజలకు ఎప్పుడైనా అందుబాటులో ఉండే నాయకుడిగా, ప్రతిపక్షాల హక్కులను కాపాడిన నిష్పాక్షిక స్పీకర్‌గా ఆయన ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ప్రజాస్వామ్యంపై పరిశోధనలు చేసే విద్యార్థులకు ఈ గ్రంథం ఒక మార్గదర్శిగా నిలిచే అవకాశం ఉంది. శ్రీపాదరావు తనయుడు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రస్తుతం రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ మృదుస్వభావంతో, విషయ పరిజ్ఞానంతో ప్రజాసేవలో ముందుకు సాగుతున్న శ్రీధర్‌బాబు హయాంలోనే ఈ అరుదైన ప్రసంగాల సంకలనం వెలువడటం ప్రాధాన్యత సంతరించుకుంది.

## ఉపాధ్యాయులే సమాజ నిర్మాణానికి వెన్నెముక

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉపాధ్యాయులే సమాజ నిర్మాణానికి వెన్నెముక అని రాష్ట్ర కార్మిక, భూగర్భ గనుల శాఖ మంత్రి డా.జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమన్నారు. రవీంద్రభారతిలో ఆదివారం శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'భారత్ గురు రత్న అవార్డ్స్– నేషనల్ టీచర్స్ డే సెలెబ్రేషన్స్' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులను మంత్రి అభినందించి, సత్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ విద్యార్థుల పునాది బలంగా ఉంటే వారు ఏ రంగంలోనైనా విజయాన్ని సాధించగలరని పేర్కొన్నారు. డిజిటల్ డిస్ట్రాక్షన్స్ నుంచి పిల్లలను సరైన దిశలో నడిపించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైన ఉన్నదన్నారు. ఏ చిన్నారికి పుస్తకాలు లేని బాల్యం ఉండకూడదు అనే లక్ష్యంతో శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ చేస్తున్న కృషిని మంత్రి అభినందించారు. కార్యక్రమంలో పలువురు విద్యావేత్తలు, ఉపాధ్యాయులు శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## 24 గంటల్లో బాలుడి కిడ్నాప్ కేసును ఛేదించిన పోలీసులు

వేదాన్షన్‌ను తల్లిదండ్రులకు అప్పగించిన సిపి సాయిచైతన్య

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లా ప్రభుత్వ మాతా శిశు ఆస్పత్రి నుంచి శనివారం అపహరణకు గురైన మూడేళ్ల బాలుడు వేదాన్షన్ ను 24 గంటల్లో పోలీసులు పట్టుకున్నారు. కిడ్నాపర్లు సుజాత ఎల్లమ్మను నిజాంపేట్ గ్రామస్తులు గా గుర్తించామన్నారు. ఆదివారం కమీషనరేట్‌లోని కమాండ్ కంట్రోల్ హాల్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. 24 గంటల్లో కిడ్నాప్ కేసును ఛేదించామన్నారు. చాక్లెట్ ఆశ చూపించి కిడ్నాప్ చేశారని, ఆస్పత్రి నుండి బాలుడిని అపహరించగా పోలీసు వ్యవస్థ రంగంలోకి దిగిందన్నారు. సంగారెడ్డి జిల్లాలోని దౌల్తాబాద్ ప్రాంతంలో కిడ్నాపర్లను పట్టుకోవటం జరిగిందని, బాలుడి ఆచూకీ గుర్తించి అతనిని సురక్షితంగా రక్షించామన్నారు. ఈ కేసును సీసీ ఫుటేజీ ఆధారంగా ఛేదించినట్లు తెలిపారు. చిన్నపిల్లలకు మ నమే అవగాహన కల్పించాలని సూచించారు.

నిందితులుగా మెదక్ జిల్లా నిజాంపేట్ గ్రామ ప్రస్తుతం మేడ్చల్‌లో నివాసముంటున్న ఎ వన్ కోతాడి సుజాత (30) భర్త యెల్లం ఎ2గా మెదక్ జిల్లా నిజాంపేట్ గ్రామానికి చెందిన కోతాడి యెల్లం (38) ప్రస్తుతం మేడ్చల్‌లో నివాసముంటున్న ఇద్దరిని గుర్తించి అదుపులోకి తీసుకోవటం జరిగిందని తెలిపారు. అపరిచిత వ్యక్తులు ఏ వస్తువులు ఇచ్చినా తీసుకోవద్దని పిల్లలకు అర్థమయ్యేలా చెప్పాలన్నారు.



## అసెంబ్లీని ఎక్కువ రోజులు నడపడానికి భయపడుతున్న ప్రభుత్వం

బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శాసనసభ సమావేశాలను ఎక్కువ రోజులు నిర్వహించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం భయపడుతుందని బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. సోమవారం నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో లేవనెత్తాల్సిన ప్రజా సమస్యలు, అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు ఆదివారం నాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో బిజెఎల్‌పి సమావేశం జరిగింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్న ఈ సమావేశంలో సభలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేలా స్పష్టమైన కార్యాచరణ రూపొందించారు. సమావేశం అనంతరం మహేశ్వర్ రెడ్డి, బిజెఎల్‌పి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి దిగజారడం, ఉద్యోగుల పెండింగ్ బకాయిలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్, 22ఎ భూ బాధితుల సమస్యలతో పాటు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపై సభలో నిలదీస్తామని తెలిపారు. అసెంబ్లీని కేవలం రెండు రోజుల పాటు నిర్వహించి మమ అనిపించకుండా, కనీసం 15 రోజుల పాటు పొడిగించి, ప్రజా సమస్యలపై సమగ్ర చర్చ జరపాలని డిమాండ్ చేశారు. గత 1,000 రోజుల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను ఎలా మోసం చేసిందో సభ వేదికగా ఎండగడతామన్నారు.

# శాంతియుత ధర్నాకు అనుమతి నిరాకరణ దుర్మార్గం

బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గౌతంరావు, వీరేందర్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని పేద విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ఉపకార వేతనాలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బిజెవైఎం ఆధ్వర్యంలో ఈనెల 7న ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద తలపెట్టిన 'ఫీజుల బకాయి బిజెపి లడాయి' విద్యార్థి మహాధర్నాకు పోలీసులు చివరి నిమిషంలో అనుమతి నిరాకరించడంపై బిజెపి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కాలరాస్తే ఊరుకునేది లేదని, సోమవారం ఉదయం వేలాది మంది విద్యార్థులు, యువకులు, పార్టీ శ్రేణులతో కలిసి నేరుగా అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించింది. ఆదివారం నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఎన్. గౌతమ్ రావు, వేముల అశోక్, వీరేందర్ గౌడ్ బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుందేలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. గౌతమ్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందన్నారు. ప్రభుత్వం ముందస్తు అరెస్టులు,



గృహ నిర్బంధాలతో అణచివేసే సంస్కృతిని కొనసాగిస్తోందన్నారు. శాంతియుతంగా ధర్నా చేయడానికి వారం రోజుల క్రితమే దరఖాస్తు చేసుకున్నా, ఆఖరు నిమిషంలో నిరాకరణ లేఖ ఇవ్వడం గర్హనీయమన్నారు. కాంగ్రెస్ పాలనను బెంగాల్ తరహా అరాచక పాలనగా అభివర్ణించారు. ఎన్ని ఆంక్షలు పెట్టినా వెనక్కి తగ్గేది లేదని, సోమవారం ఉదయం 11 గంటలకు రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు నేతృత్వంలో అసెంబ్లీ ముట్టడిని విజయవంతం చేసి తీరుతామన్నారు.

### ఎస్ఐఆర్ పేరుతో బిజెపి ఓట్ల తొలగింపు కుట్ర

ఎలక్షన్ కమిషన్ చేపడుతున్న ప్రత్యేక ఓటరు సవరణ (ఎస్ఐఆర్2026) ప్రక్రియను అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తూ, బిజెపికి అనుకూలంగా ఉన్న ఓటర్ల పేర్లను జాబితాల నుంచి తొలగించే కుట్ర చేస్తోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు ఆరోపించారు. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బిఆర్ఎస్ సహా వివిధ పార్టీలకు చెందిన కీలక ఓబిసి, మున్నూరు కాపు యువ నాయకులు బిజెపిలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

అనంతరం మీడియాతో మాట్లాడుతూ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో బిజెపి మద్దతుదారుల ఓట్లను, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన వారి ఓట్లను ఉద్దేశపూర్వకంగా ఏరివేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర విద్యా వ్యవస్థ పూర్తిగా కుదేలైందని, దేశంలో విద్యా బడ్జెట్ సగటు 14.5 శాతం ఉంటే, తెలంగాణలో కేవలం 9 శాతం కేటాయించడం సిగ్గుచేటన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో ప్రైవేట్ కళాశాలల్లో అధ్యాపకులకు జీతాలు లేవని, పాఠశాలల్లో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని విమర్శించారు. భవిష్యత్తులో బిజెపి అధికారంలోకి రాగానే విద్యా బడ్జెట్‌ను గణనీయంగా పెంచుతామని, అన్ని ఖాళీలను పారదర్శకంగా భర్తీ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## పంజాబ్ కాంగ్రెస్ కొత్త సారథిగా.. సచిన్ 'పైలట్'

అధికారం పీఠం 'హ స్త'గతం బాధ్యత

**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ పార్టీలో కీలకనాయకుడు సచిన్ పైలట్ తాను రెండు దశాబ్దాలకు పైగా సాగించిన రాజకీయ జీవితంలో అనేక ఒడిదుడుకులను చూసినప్పటికీ , పార్టీ యువనేతగా పేరుగాంచిన ఆయన క్లిష్ట రాష్ట్రాలలో ఎన్నికల ఫలితాలను మార్చేందుకు పార్టీకి అత్యంత కీలకమైన అస్త్రంగా, శరవేగంగా ఎదుగుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల తరుణంలో, పంజాబ్‌లో పార్టీ అంతర్గత కలహాలతో సతమతమవుతూ ఆధిపత్యం కోసం పలు వర్గాలు పోరాడుతున్న నేపథ్యంలో ఎఐసిసి అధిష్ఠానం పంజాబ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని చక్కదిద్దడంతోపాటు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం పీఠాన్ని దక్కింపజేసే బాధ్యతను ఆయనకు అప్పగించడమే, కాంగ్రెస్ పార్టీలో ఆయన పలుకుబడి నానాటికి బలపడుతుందనే దానికి ఒక చక్కటి నిదర్శనం. కాగా, శనివారం కాంగ్రెస్ పార్టీ భారీ సంస్థాగత మార్పులకు శ్రీకారం చుట్టింది. త్వరలోనే శాసనసభకు ఎన్నికలు జరుగనున్న పంజాబ్ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి జనరల్‌సెక్రటరీగా భూపేష్ బఘేల్ స్థానంలో సచిన్ పైలట్‌ను నియమించింది. ఇదిలా ఉండగా, ఇప్పటివరకు సచిన్‌పైలట్ ఛత్తీస్‌గఢ్ బాధ్యతలు చూసుకున్నారు. అక్కడ భూపేష్ బఘేల్ ఒక కీలక నాయకుడు. మాజీ ముఖ్యమంత్రి జితేంద్రసింగ్ స్థానంలో బఘేల్ ఇప్పుడు అస్సాం బాధ్యతలు చేపట్టనున్నారు. వచ్చే ఏడాది ప్రారంభంలో పంజాబ్ రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరుగనున్నాయి. ఈ కీలకమైన ఎన్నికలకు ముందు పంజాబ్ రాష్ట్ర కాంగ్రెస్ యూనిట్‌లో వర్గపోరాటాలను పరిష్కరించడమే సచిన్ పైలట్‌కు తక్షణ సవాల్‌గా ఉంటుంది.




## మైనర్ బాలికపై హత్యాచారం కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

రిమాండ్‌కు తరలింపు

ప్రజాపక్షం/హుజూర్‌నగర్: మండల పరిధిలో ఓ గ్రామంలో మైనర్ బాలికపై జరిగిన హత్యాచారం ఘటనకు సంబంధించి ఇద్దరు నిందితులు కూడా 19 సంవత్సరాలైన కాంపాటి విరామ్, పాముల ఆకాష్‌లను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు హుజూర్‌నగర్ సిఐ చరమందరాజు తెలిపారు. ఆదివారం సిఐ కార్యాలయంలో కేసు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కేసు వివరాలు వెల్లడించారు. సిఐ చరమందరాజు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ఒక గ్రామానికి చెందిన మైనర్ బాలికపై జరిగిన హత్యాచార ఘటన హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేయడం జరిగింది. ఈ అమానుష ఘటనపై పోలీసులు అత్యంత వేగంగా స్పందించి దర్యాప్తు చేపట్టారు. సమగ్ర విచారణ అనంతరం నిందితుల ఇద్దరిని అదుపులోకి తీసుకోవడం జరిగిందని, వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మహిళలు, మైనర్ బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, ఇటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చలిగంటి నరేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘం అభివృద్ధికి సహాయం అందిస్తా

మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: పద్మశాలి సమాజ అభివృద్ధికి, సంక్షేమానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మిర్యాలగూడ పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వనభోజనాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం సభ్యులు, బంధుమిత్రులతో ఎమ్మెల్యే ఆత్మీయంగా ముచ్చటించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో ఐక్యత, పరస్పర సహకారం, ఆత్మీయతను పెంపొందించేలా ఇలాంటి ఆత్మీయ వనభోజనాల కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. పద్మశాలి బంధువులందరూ ఐక్యంగా ఉంటూ సమాజ వికాసానికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, పద్మశాలి సంఘం నాయకులు, సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

## భవిష్యత్తు ఎలక్ట్రిక్ బైకులదే

ఎఐసిసి సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : భవిష్యత్తులో ఎలక్ట్రిక్ బైకుల వినియోగం మరింత పెరగనుందని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో మార్కెట్ రోడ్డులో ఎంజి వన్ భూమి ఇవి బైక్స్, ఆటో షో రూమ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం పెరుగుతున్న ఇంధన ధరలు, కాలుష్య సమస్యలకు ఎలక్ట్రిక్ వాహనాలు మంచి ప్రత్యామ్నాయంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ బైకుల వినియోగంతో ఇంధన ఖర్చులు తగ్గడంతోపాటు పర్యావరణానికి మేలు జరుగుతుందని అన్నారు. ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలపై అవగాహన పెంచుకుని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా వాటిని వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్, కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, పిడమర్తి కీర్తి లవన్, జిల్లా నాయకులు మొరిశెట్టి లక్షాది, దండు మైసమ్మ ఆలయ చైర్మన్ తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, అబ్దుల్ రహీం పాల్గొన్నారు.

## గుప్తనిధుల కోసం అర్ధరాత్రి తవ్వకాలు

ప్రజాపక్షం/చివ్వెంల : మండలంలోని ఉండ్రుగొండ గుట్టల్లో పురాతనమైన శ్రీశ్రీశ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థాన పరిసర ప్రాంతాల్లో కొంత మంది వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి గుప్త నిధుల కోసం తొవ్వకాలు నిర్వహించినట్లు సమాచారం. పోలీసులకు గుర్తు తెలియని వ్యక్తులు సమాచారం అందించడంతో 12.30 గంటల ప్రాంతంలో అక్కడికి వెళ్ళి కొంత మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వారి వద్ద తొవ్వకాలకు సంబంధించిన పరికరాలు, గుప్త నిధుల గుర్తింపు కోసం ఉపయోగించే ఓ ఆధునాతనమైన పరికరాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈవిషయమై ఎస్ఐ మహేశ్వర్‌ను వివరణ కోరగా వాస్తవమేనని ఉన్నతాధికారుల ఆదేశాలతో దీనిపై సమగ్ర విచారణ జరుపుతున్నామని తెలిపారు.

## కరాటేతో ఆత్మవిశ్వాసం.. ఆత్మరక్షణ




ప్రజాపక్షం/నకిరేకల్: ప్రతి ఒక్కరూ ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడంతో పాటు ఆత్మరక్షణ కోసం కరాటే విద్యను తప్పనిసరిగా నేర్చుకోవాలని ఎన్ఆర్ ట్రస్ట్ కార్యదర్శి కందాల ప్రమీల పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జపాన్ కరాటే అసోసియేషన్ ఇండియా, ఎన్ఆర్ విజ్ఞాన కేంద్రం నకిరేకల్ డోజో ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. పరీక్షలకు నకిరేకల్, కట్టంగూర్, హాలియా మండలాల నుంచి 55 మంది విద్యార్థులు హాజరయ్యారు.జూనియర్ రెడ్, ఎల్లో,ఆరంజ్, గ్రీన్,పర్పుల్,జపాన్ బ్రౌన్ బెల్ట్ విభాగాల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఉత్తమ గ్రేడింగ్ సాధించిన విద్యార్థులకు బెల్టులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.ఈకార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బొజ్జ చిన్న వెంకులు, వంటేపాక వెంకటేశ్వర్లు, చీఫ్ ఎగ్జామినర్ రాపోలు సుదర్శన్,జిల్లా వైస్ ప్రెసిడెంట్ అంతటి సోములు గౌడ్,కట్టంగూర్ మాస్టర్ వి.రామలింగం,నకిరేకల్ మాస్టర్లు ఆర్.విజయ్ కుమార్, ఎ.అంజి, ఎం.సత్యరాజ్, హాలియా నుంచి వెంకటేశ్వర్లు, నరహరి,సాయి శ్రీనివాస్,ఉదయ్, నవీన్,సైదులు,నాగరాజు, ఎ.కృష్ణ,కె.రవి, భగవాన్ సింగ్ పాల్గొన్నారు.

## సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా 49వేల మంది విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ స్కీం

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

బడుగు, బలహీన వర్గాలకు నాణ్యమైన ఉచిత విద్య అందిస్తాం



ప్రజాపక్షం/కోదాడ: తెలంగాణ రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌లో 50కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న జవహర్ నవోదయ విద్యాలయ నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యే పద్మావతిరెడ్డితో కలిసి పరిశీలించారు. పాఠశాల భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్‌కు ఆదేశించారు. నిర్మాణ పనుల్లో రాజీపడకుండా నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బడుగు, బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన ఉచిత విద్యను అందించే కార్యాచరణలో భాగంగానే జవహర్ నవోదయ విద్యాలయాలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ అన్నారు. చిలుకూరు గుట్టలో 200 కోట్లతో యంగ్ ఇండియాఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సంక్షేమ పథకాలు అమలు, మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం బ్రేక్‌ఫాస్ట్ అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా 49వేల మంది విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ ప్రారంభిస్తున్నామన్నారు. ప్రభుత్వ విద్యారంగ బలోపేతంలో భాగంగా పాఠశాలలను అప్‌గ్రేడ్ చేసి అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. దేశంలో తెలంగాణ రాష్ట్రం విద్యా రంగంలో అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, కోదాడ మున్సిపల్ చైర్పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నంబాబు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, ఆర్డీవో సూర్యనారాయణ, వైస్ చైర్మన్ దేవరం మల్లీశ్వరి పాల్గొన్నారు.

**యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి**

నియోజకవర్గంలోని చిలుకూరు మండలం సీతారాంపురం సమీపంలో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న మంత్రి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాలతో పాటు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఎంతో ప్రామాణికంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ కె.నర్సింహా పాల్గొన్నారు.



## 9 తండాల నీటి కష్టాలకు శాశ్వత విముక్తి కల్పించాలని వినతి

ప్రజాపక్షం/పెన్‌పహాడ్ : మండలంలోని న్యూబంజారాహిల్స్ గ్రామ పంచాయతీ పరిసర ప్రాంతాల్లోని 9 గిరిజన తండాల దాహార్తి తాగునీరు, సాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ తెలంగాణ భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. గ్రామ సర్పంచ్ ధరావత్ కవిత రవీందర్ నాయక్, ఉపసర్పంచ్ బానోతు శివకృష్ణ ఆధ్వర్యంలో గ్రామ నాయకులు, పెద్దల బృందం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి ఇక్కడి ప్రజల, రైతుల ఇబ్బందులను సుదీర్ఘంగా వివరించారు. గ్రామ పరిధిలోని ప్రజల తాగునీటి అవసరాలు, రైతుల సాగునీటి అవసరాలను తీర్చేందుకు గ్రామంలో నూతన చెరువును ఏర్పాటు చేయాలని కోరారు. ఈ ప్రతిపాదిత చెరువుకు 127 లిఫ్ట్ ఇరిగేషన్ పథకం నుండి పైప్‌లైన్ ద్వారా నీటిని తరలించి అనుసంధానం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కవిత రవీందర్, ఉప సర్పంచ్ శివకృష్ణ, గ్రామ పెద్దలు తెలిపారు.

## అభివృద్ధి పరుగులు.. ప్రజలకు సంక్షేమ ఫలాలు

వెయ్యి రోజుల ప్రజాపాలన.. ప్రజా వికాస సభ సక్సెస్

వేలాదిగా తరలివచ్చిన ప్రజానీకానికి ధన్యవాదాలు

ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం



ప్రజాపక్షం/నకిరేకల్ : రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రజాపాలన కొనసాగిస్తోందని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు.ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి హాజరైనా నకిరేకల్‌లో నిర్వహించిన ప్రజా వికాస సభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేసిన ప్రజలకు,నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.ఆదివారం నకిరేకల్ పన్నాలగూడెంక్యాంపు కార్యాలయంలో ఏర్పాటు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెయ్యి రోజుల ప్రజాపాలనలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల మద్దతు సభ ద్వారా వెల్లడైందన్నారు. ప్రజా వికాస సభలో నకిరేకల్ నియోజకవర్గానికి మొత్తం రూ.339 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరిగాయని ఆయన తెలిపారు. రూ.32 కోట్లతో నిర్మించిన 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సీఎం ప్రారంభించారని, రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారని చెప్పారు. రహదారుల నిర్మాణ పనులకు రూ.45.60 కోట్లు, నకిరేకల్ పట్టణ రోడ్ల నిర్మాణానికి రూ.17.50 కోట్లు, నకిరేకల్, చిట్యాల మున్సిపల్ కార్యాలయాల నిర్మాణానికి రూ.12 కోట్లు, ప్రభుత్వ కార్యాలయాల సముదాయ నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి రూ.9.85 కోట్లు, ఎక్సైజ్ కార్యాలయ నిర్మాణానికి రూ.1.10 కోట్లు, వెటర్నరీ ఆసుపత్రి నిర్మాణానికి రూ.90 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. మహిళా సంఘాల అభివృద్ధి కోసం రూ.127 కోట్ల చెక్కును అందజేసినట్లు పేర్కొన్నారు.ఆసిఫ్‌నగర్ కెనాల్ ద్వారా సుమారు 60 చెరువులు నిండేలా చర్యలు తీసుకుంటామని, ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని వీరేశం తెలిపారు. నకిరేకల్ నుంచి తిప్పర్తి వరకు, కట్టంగూర్ నుంచి నల్లగొండ వరకు రహదారుల అభివృద్ధితోపాటు కట్టంగూర్ పట్టణంలో అండర్‌పాస్ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. నకిరేకల్ పట్టణంలోని మినీ స్టేడియం అభివృద్ధికి రూ.10 కోట్ల నిధులు మంజూరు చేయనున్నట్లు సీఎం ప్రకటించారని తెలిపారు. చెరువుగట్టు ఆలయ అభివృద్ధికి కూడా త్వరలో ప్రత్యేక చర్యలు చేపడతామని హామీ ఇచ్చారన్నారు.ఈసమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి, మాజీ జెడ్పిటిసి మాద యాదగిరి,కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు గాదగోని కొండయ్య, లింగాల వెంకన్న, చౌగోని శ్రీనివాస్,యాస కరుణాకర్, బొజ్జ సుందర్, మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

**ఇందిరమ్మ ఇంట్లో గృహప్రవేశం :** నకిరేకల్ మండలం మార్రూర్ గ్రామానికి చెందిన కొండేటి వెంకటరాములు నూతన ఇందిరమ్మ ఇంట్లో గృహప్రవేశ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.



## ఎఐవైఎఫ్ రాష్ట్ర మూడో మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : సెప్టెంబర్ 8, 9, 10 తేదీలలో యాదగిరిగుట్టలో జరిగే ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకుడు కొండూరి విప్లవ్ అన్నారు. సంస్థాన్ నారాయణపురం మండలం జనగాం గ్రామంలో మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 8వ తేదీన యాదగిరిగుట్ట పట్టణంలో భారీఎత్తున యువజన కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 9,10 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి వచ్చిన ప్రతినిధులతో మహాసభలు ఉంటాయని, ఈ మహాసభ లకు యువకులు అధిక సంఖ్యలో పాల్గొని పాలకులు అవలంబించే విద్యార్థి యువజన విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని కోరారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో యువత ప్రధాన పాత్ర పోషిస్తుందని, దేశంలో ప్రజాస్వామ్య లౌకిక విలువల పరిరక్షణ కోసం ఏఐవైఎఫ్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైయఫ్ మండల కార్యదర్శి కొండూరి రవితేజ, సీపీఐ శాఖ కార్యదర్శి బైకని రాజు, కొండూరి స్వామి వరికుప్పల రాకేష్, కొండూరి గణేష్, కప్పల అరుణ్, ఐతరాజ శ్రీను, కొండూరి రాజు, కొండూరి అఖిల్, కె.శ్రవణ్, కె.మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం ఎఐవైఎఫ్ పోరాటాలు



ప్రజాపక్షం/మర్రిగూడ: నిరుద్యోగ యువత సమస్యలను పాలకుల దృష్టికి బలంగా తీసుకెళ్లేందుకు, ఉద్యోగాల భర్తీ కోసం భవిష్యత్ పోరాటాలకు కార్యాచరణ రూపొందించేందుకు నిర్వహిస్తున్న ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర మూడో మహాసభలను విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ మండల ఉపాధ్యక్షుడు గంట రాజు పిలుపునిచ్చారు.యాదగిరిగుట్టలో ఈ నెల 8, 9, 10 తేదీల్లో జరిగే రాష్ట్ర మహాసభలకు యువత భారీ సంఖ్యలో తరలివచ్చి తమ గళాన్ని వినిపించాలని పిలుపునిచ్చారు.ఆదివారం మండల కేంద్రంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం ఏఐవైఎఫ్ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కన్వీనర్ బుర్ర శేఖర్,ఎరుకలి నిరంజన్,జక్కల అంజయ్య, ఎం.డి.నజీర్, ఏఐవైఎఫ్ నాయకులు గోల్కొండ కిరణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ శాంతి కోసం ప్రజలంతా ఐక్య ఉద్యమం

అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్




ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న యుద్ధ వాతావరణం, హింస, సామ్రాజ్యవాద దురాక్రమణలకు వ్యతిరేకంగా ప్రజలంతా ఐక్యంగా నిలబడి శాంతి కోసం ఉద్యమించాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఏఐపిఎస్ఓ) రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ధర్మబిక్షం భవన్‌లో నిర్వహించిన ఏఐపిఎస్ఓ జిల్లా కమిటి సమావేశంలో ఆయన మాట్లాడుతూ యుద్ధాల వల్ల సాధారణ ప్రజలే తీవ్రంగా నష్టపోతారన్నారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు, పేదలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయుధ పోటీకి, యుద్ధాలకు వెచ్చిస్తున్న భారీ నిధులను ప్రజల సంక్షేమం, విద్య, వైద్యం, ఉపాధి రంగాలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రపంచంలో శాశ్వత శాంతి నెలకొల్పేందుకు దేశాల మధ్య స్నేహ సంబంధాలు, పరస్పర గౌరవం, సహకారం పెంపొందాల్సిన అవసరం ఉందన్నారు. మతం, కులం, ప్రాంతం పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలను తిప్పికొట్టాలని సూచించారు. శాంతి, సౌభ్రాతృత్వం, ప్రజాస్వామ్యం, మానవ హక్కుల పరిరక్షణ కోసం యువత, విద్యార్థులు, మేధావులు, ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజలను సభ్యత్వం చేర్పించడం ద్వారా వెళ్లాలని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా మహాసభలు నిర్వహించడానికి సమయత్తం కావాలన్నారు. ఏఐపిఎస్ఓ ఆధ్వర్యంలో శాంతి సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కార్యక్రమాలను మరింతగా నిర్వహిస్తామని తెలిపారు. ఏఐపిఎస్ఓ జిల్లా అధ్యక్షులు తొగటి మురళి అధ్యక్షతన జరిగిన సమావేశంలో గౌరవ అధ్యక్షులు బొమ్మగాని శ్రీనివాస్, కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు అనంతుల మల్లేశ్వరి, సహాయ కార్యదర్శి సారెడ్డి వెంకట్ రెడ్డి, గాలి రామకృష్ణ పాల్గొన్నారు.

## బుల్లెట్ ట్రైన్ వచ్చేంత వరకూ మా మద్దతు

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ వచ్చేంత వరకు తమ పూర్తి మద్దతు ఉంటుందని సూర్యాపేట మేరు సంఘం అధ్యక్షుడు మునగాల సతీష్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో కొత్త బస్టాండ్ నుండి పొట్టిశ్రీరాములు సెంటర్ వరకు మేరు సంఘం ఆధ్వర్యంలో బుల్లెట్ ట్రైన్ కోసం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా కేంద్రం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని సూర్యాపేట మీదుగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. బుల్లెట్ ట్రైన్ సూర్యాపేట మీదుగా వస్తే జిల్లాలో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు వ్యాపార, పారిశ్రామిక, విద్యారంగాల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధించేందుకు చేపడుతున్న ఉద్యమానికి మేరు సంఘం తరపున అండగా ఉంటామని స్పష్టం చేశారు. ప్రజల ఆకాంక్షను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బుల్లెట్ ట్రైన్ సూర్యాపేట మీదుగా వచ్చేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ వచ్చేంత వరకు ఉద్యమానికి తమ మద్ధతు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కర్నె ఉపేందర్, కోశాధికారి తెంబరేణి కృష్ణ, గట్ల సిద్ధప్ప, కీర్తి వెంకన్న, తెంబరేణి వీరేష్, దీకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.



## గంధమల్ల ప్రాజెక్ట్‌తో ఆలేరు సస్యశ్యామలం

ప్రాజెక్టు నిర్మాణానికి భూమిపూజ చేసిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



ప్రజాపక్షం/తుర్కపల్లి : తెలంగాణ రాష్ట్రంలోని యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం గంధమల్ల గ్రామంలో నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టుతో ఆలేరు ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. గంధమల్ల ప్రాజెక్టు నిర్మాణానికి ఆదివారం భూమి పూజ నిర్వహించారు. భూమి పూజతో రిజర్వాయర్ నిర్మాణ పనులు అధికారికంగా ప్రారంభం కానున్నాయి. గంధమల్ల రిజర్వాయర్ పూర్తయితే ఆలేరు నియోజకవర్గంతో పాటు పరిసర మండలాలు సస్యశ్యామలం కానున్నాయన్నారు.గంధమల్ల ప్రాజెక్టు ద్వారా ఆలేరు నియోజకవర్గంలోని సుమారు 58 వేల ఎకరాలకు సాగునీరు అందనుండగా, 1.41 టీఎంసీల సామర్థ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును నిర్మించనుందని అన్నారు. రిజర్వాయర్ అందుబాటులోకి వస్తే రైతులకు సాగునీటి భరోసా కలగడంతో పాటు వ్యవసాయ అభివృద్ధికి మరింత ఊతం లభించనుందని తెలిపారు.గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిర్మలాపురం వద్ద శంకుస్థాపన చేసిన విషయం గుర్తు చేసి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పంతో, గంధమల్ల ప్రాజెక్టు నిర్మాణ పనులు ముందుకు సాగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ గంధమల్ల ప్రాజెక్టు నిర్మాణం ఆలేరు నియోజకవర్గ రైతుల చిరకాల స్వప్నమని, గంధమల్ల రిజర్వాయర్ పూర్తయితే ఆలేరు నియోజకవర్గంలోని సుమారు 58 వేల ఎకరాలకు సాగునీరు అందడంతో వేలాది మంది రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. గంధమల్ల ప్రాజెక్టును నిర్ణీత సమయంలో పూర్తి చేసి ఆలేరు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడమే మా లక్ష్యం అని అన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన భూసర్వేను అధికార యంత్రాంగం యుద్ధప్రాతిపదికన పూర్తి చేసిందని, రిజర్వాయర్ నిర్మాణానికి సుమారు 1,000 ఎకరాల భూమిని సేకరించినట్లు తెలిపారు. గంధమల్ల, వీరారెడ్డిపల్లి గ్రామాలకు చెందిన సుమారు 2,000 మంది రైతులు నిర్వాసితులు అవుతున్నాని, నిర్వాసిత రైతులకు పరిహారం చెల్లింపులో భాగంగా మొదటి విడతలో కట్ట నిర్మాణానికి సంబంధించిన 112 ఎకరాలకు రూ.27 కోట్ల పరిహారం ప్రభుత్వం అందించిందని,రెండో విడతలో జలాశయంలో భూములు కోల్పోతున్న 352 ఎకరాలకు రూ.88.84 కోట్ల పరిహారాన్ని ఇటీవల అందజేసినట్లు తెలిపారు.మిగిలిన భూములకు పరిహారం చెల్లించేందుకు అవసరమైన ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి పంపించారని తెలిపారు.

ప్రజాపక్షం
Telugu National Daily

హైదరాబాద్
సోమవారం
07-09-2026
www.prajapaksham.in

"ప్రార్థనా చాబ్రియా ఇక ఆకాశంలో విమానాన్ని నడిపే పైలట్‌గా మాత్రమే కాదు.. వెండితెరపై నటిగా కూడా తన ప్రయాణాన్ని ప్రారంభించబోతున్నారు. ట్రైనర్ గ్రేడ్ పైలట్‌గా పనిచేసిన ప్రార్థనా చాబ్రియా ఇప్పుడు సినీ రంగంలోకి నటిగా అడుగు పెడుతున్నారు."

# రీల్



## 'చిరో'లో హీరోయిన్‌గా పైలట్ ప్రార్థన

ప్రార్థనా చాబ్రియా ఇక ఆకాశంలో విమానాన్ని నడిపే పైలట్‌గా మాత్రమే కాదు.. వెండితెరపై నటిగా కూడా తన ప్రయాణాన్ని ప్రారంభించబోతున్నారు. ట్రైనర్ గ్రేడ్ పైలట్‌గా పనిచేసిన ప్రార్థనా చాబ్రియా ఇప్పుడు సినీ రంగంలోకి నటిగా అడుగు పెడుతున్నారు. ఆమె నటిగా అరంగేట్రం చేస్తున్న 'చిరో' అనే తమిళ చిత్రం త్వరలో. ప్రేక్షకుల ముందుకు రానుంది.నటన పరంగా ఆది శక్తి అనే యాక్టింగ్ స్కూల్ నుంచి ప్రత్యేకంగా శిక్షణ పొందిన ప్రార్థనా చాబ్రియా.. క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో ఇప్పుడు వెండితెరపై తనదైన ముద్ర వేయడానికి సిద్ధమవుతున్నారు. విమానాలను నడిపిన పైలట్‌గా నుంచి కెమెరా ముందు నటిగా మారిన ఆమె ప్రయాణం ఇప్పటికే సినీ వర్గాల దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రార్థనా చాబ్రియా నటనతో పాటు పోల్ డ్యాన్స్, బెల్లీ డ్యాన్స్‌లోనూ మంచి ప్రావీణ్యం కలిగి ఉన్నారు. దీంతో సంప్రదాయబద్ధమైన పాత్రలకు మాత్రమే కాకుండా విభిన్నమైన పాత్రలను పోషించే సామర్థ్యం ఆమెకు ఉందని తెలుస్తోంది. అలాగే సింధి, హిందీ, తమిళం, ఇంగ్లీష్ భాషల్లో అనర్గళంగా మాట్లాడగలిగే ప్రార్థనా .. భవిష్యత్తులో పాన్ ఇండియా, సౌత్ ప్రాజెక్టులతో పాటు తెలుగు చిత్ర పరిశ్రమలోకి కూడా అడుగు పెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. 'చిరో' చిత్రం పండుగ రిలీజ్‌కు ధ్దమవుతుండగా.. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఏవియేషన్ రంగం నుంచి నటన వైపు ప్రార్థనా చాబ్రియా చేస్తున్న ఈ ప్రయాణం, ఈ ఏడాది సౌత్ ఇండస్ట్రీలో అరంగేట్రం చేస్తున్న కొత్త నటీనటుల్లో ప్రత్యేకంగా మారుతోంది.

## 'తెల్లకాగితం' ఇన్నోసెంట్ లవ్‌స్టోరీ

### టీజర్ లాంచ్ ఈవెంట్‌లో దిల్‌రాజు



అరుణాచల క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మాత అకృష్ణ కొమ్మాలపాటి సమర్పణలో హర్ష్ రోషన్ ప్రస్తుతం చేస్తున్న చిత్రం 'తెల్ల కాగితం'. అక్టోబర్2న మూవీ రిలీజ్ అవుతుంది. 'కోర్ట్', 'బ్యాండ మేళం' వంటి చిత్రాలతో విజయం సాధించిన హర్ష్ రోషన్ హీరోగా నటిస్తున్నారు. నక్షత్ర హీరోయిన్‌గా పరిచయం అవుతోంది. ఈ సినిమాతో రమేష్ బండ్రెడ్డి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. యూత్ ఫుల్ ఎమోషనల్ లవ్ ఎంటర్‌టైనర్‌గా రానున్న ఈ సినిమాపై ఇప్పటికే మంచి హైప్ క్రియేట్ అయింది. ఈ క్రమంలో మూవీకి సంబంధించిన టీజర్‌ను మేకర్స్ శనివారం రోజున రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత దిల్ రాజు, దర్శకుడు బాబీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఇంకా భాను బోగవరపు, సినిమాటోగ్రాఫర్ కెవి.గుహన్, నటుడు అజయ్, నందు, రామ్ అబ్బరాజు, బెక్కెం వేణుగోపాల్, బివిఎస్.రవి, ఈటివి విన్ సాయికృష్ణ, హర్ష్ రోషన్, నక్షత్ర, శ్రావ్య, డైరెక్టర్ రమేష్ బండ్రెడ్డి సహా ఇతర చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ ''జీవితంలో తెలిసీ తెలియక అందరూ తప్పులు చేస్తుంటారనే విషయాన్నే ఈ సినిమాతో చెప్పాలనుకున్నారు. తెల్లకాగితం మూవీ ఇన్నోసెంట్ లవ్ స్టోరీ. కొత్త బంగారు లోకం తీసినప్పుడు నేనెగైతే ఫీలయ్యానన్నారు.

## అంతా రాములోరు చూస్కుంటారు టైటిల్ గ్లింప్స్ రిలీజ్



హీరో సంగీత్ శోభన్ నటిస్తున్న కొత్త సినిమా 'అంతా రాములోరు చూస్కుంటారు'. ఈ చిత్రంలో అనస్వర రాజన్ హీరోయిన్ గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని శ్రీమతి శ్రావణి సమర్పణలో ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్, వి.జి.బి. ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ పై సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని, న్యూ యాస్పరెంట్ ప్రొడ్యూసర్ గిరిబాబు వల్లభనేని నిర్మిస్తున్నారు. ఎంటర్‌టైనింగ్ లవ్ స్టోరీతో టాలెంటెడ్ డైరెక్టర్ పల్నాటి సూర్యప్రతాప్ రూపొందిస్తున్నారు. లక్ష్మీ భూపాల్ రైటర్ గా వ్యవహరిస్తున్నారు. హైదరాబాద్ లో 'అంతా రాములోరు చూస్కుంటారు' సినిమా టైటిల్ గ్లింప్స్ లాంచ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొడ్యూసర్ గిరిబాబు వల్లభనేని మాట్లాడుతూ ఎంటర్‌టైన్ మెంట్ తో కూడిన లవ్ స్టోరీతో మా 'అంతా రాములోరు చూస్కుంటారు'ను నిర్మిస్తున్నాం. మా టైటిల్ లో ఉన్నట్లు అంతా రాములోరు చూసుకుంటారు అన్నారు.డైరెక్టర్ పల్నాటి సూర్యప్రతాప్ , ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని హీరోయిన్ అనస్వర రాజన్, హీరో సంగీత్ శోభన్ పాల్గొన్నారు.

## 10న వస్తున్న 'మండాడి'

తమిళ్ హీరో సూరి, టాలీవుడ్ యంగ్ హీరో సుహాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ఆసక్తికరమైన చిత్రం ' మండాడి '. ఎల్రేడ కుమార్ సమర్పణలో ఆర్‌ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ బ్యానర్‌పై మతిమారన్ పుగళేంది దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. ఎల్రేడ కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. విభిన్నమైన కథాంశంతో తెరకెక్కుతున్న ఈ సినిమా ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తిస్తోంది. బోట్ రేసింగ్, యాక్షన్, ఎమోషన్స్, పవర్‌ఫుల్ డైలాగ్స్‌తో 'మండాడి' ఒక ఇంటెన్స్ యాక్షన్ డ్రామాగా ఉండబోతుందనే అంచనాలు నెలకొన్నాయి. సెప్టెంబర్ 10 న ఈ సినిమా రిలీజ్ కానున్న నేపథ్యంలో తాజాగా శివ నిర్వాణ స్పెషల్ గెస్ట్ గా ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా హీరో సుహాస్ మాట్లాడుతూ దాకా వచ్చినందుకు చాలా హ్యాపీగా ఉంది. చిత్రయూనిట్ అందరి సపోర్ట్ వల్లనే సినిమా సక్సెస్‌ఫుల్‌గా పూర్తి చేశాము. నటి మహిమ, రవీంద్ర విజయ్, సూరి నటన ఈ సినిమాకు మెయిన్ అసెట్స్. సెప్టెంబర్ 10న ఓ వినూత్న కంటెంట్ థియేటర్స్‌లో చూడటానికి సిద్ధంగా ఉండండి అన్నారు. యాక్టర్ సూరి మాట్లాడారు. భాస్కర్ భట్ల , యాక్టర్ రవీంద్ర విజయ్ హీరోయిన్ మహిమా నంబియార్, డైరెక్టర్ మతిమారన్ పుగళేంది,మైత్రి మూవీ మేకర్స్ నవీన్, డైరెక్టర్ శైలేష్ కొలను, డైరెక్టర్ శివ నిర్వాణ పాల్గొన్నారు.



## 'అల్లకల్లోలంగా' సాంగ్ లాంచ్

'గజ' కమర్షియల్ అంశాలతో పాటు సెల్యూట్ కొట్టేలా మంచి మెసెజ్, ఎమోషన్ కూడా ఉంటుంది.. 'అల్లకల్లోలంగా' సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో హీరో, నిర్మాత, దర్శకుడు సతీష్ జైచలంశెట్టి సునీల్ సమర్పణలో సతీష్ జై ఫిలమ్స్ బ్యానర్ మీద సతీష్ జై, ఫర్నాజ్ శెట్టి ప్రధాన పాత్రల్లో డా. మైత్రి శరణ్ నిర్మించిన చిత్రం 'గజ'. ఈ సినిమాకి సతీష్ జై దర్శకత్వం వహించారు. ఈ మూవీకి మెలోడీ బ్రహ్మ మణిశర్మ సంగీతాన్ని అందించారు. ఈ సినిమాని మైత్రి మూవీస్ తెలుగులో రిలీజ్ చేస్తోంది. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌కి ప్రముఖ దర్శకుడు సాయి రాజేష్ ముఖ్య అతిథిగా విచ్చేశారు.



## తెలుగు సినిమా చరిత్రలోనే అత్యంత పొడవైన టైటిల్





తెలుగు సినిమా చరిత్రలోనే అత్యంత పొడవైన టైటిల్‌తో చంద్ర సిద్ధార్థ్ 'ఈ పాట కోరినవారు నెమలిపాలెం నుండి రమ, జ్యోత్స్న, నందు, మురళి, కబీర్, ఢోల్ రవి మొదలగువారు': 18న విడుదల 'ఆ నలుగురు', 'మధుమాసం', 'అందరి బంధువయా', ఇదీ సంగతి 'ఆటగదరా శివా' తదితర చిత్రాలతో విలక్షణమైన దర్శకుడిగా తనకంటూ ఒక ప్రత్యేకతను సంపాదించుకున్నారు చంద్ర సిద్ధార్థ్. ఆయన తాజాగా రూపొందించిన చిత్రం 'ఈ పాట కోరినవారు నెమలిపాలెం నుండి రమ, జ్యోత్స్న, నందు, మురళి, కబీర్, ఢోల్ రవి మొదలగువారు'. దీనికి ఉప శీర్షిక 'ఎ ఫర్‌బిడెన్ రాగ ఫ్రమ్ ఎ ఫర్‌బిడెన్ సాగా'. ఫిల్మోత్సవ్ బ్యానర్‌పై ఆయనే సొంతగా ఈ చిత్రాన్ని నిర్మించారు. ప్రముఖ దర్శక రచయిత మదన్ అందించిన కథతో ఈ సినిమా రూపొందింది. హర్ష హీరోగా పరిచయమవుతున్న ఈ చిత్రంలో అమైరా గోస్వామి, సుజనా రెడ్డి, ఇనాయా సుల్తానా, రవివర్మ, అశోక్ వర్ధన్, రేఖా నిరోషా తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సెప్టెంబర్ 18న ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

'ఆ నలుగురు' చిత్రంతో మానవ సంబంధాలు, భావోద్వేగాలను బలంగా ఆవిష్కరించిన చంద్ర సిద్ధార్థ్, ఈసారి ఆధునిక థ్రిల్లర్ నేపథ్యంతో మరో భిన్నమైన చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెస్తున్నారు. ఇది మొట్ట మొదటి మిస్టరీ మ్యూజికల్ . సంగీతం, ధ్వని, మానవ మెదడు మధ్య ఉన్న సంబంధాన్ని కథలో కీలకంగా మలుస్తూ ఈ చిత్రం రూపొందింది. సౌండ థెరపీ, బ్రెయిన్ మ్యాపింగ్, జ్ఞాపకాలు, అపరాధ భావన వంటి అంశాలను మిస్టరీ కథనంతో మేళవించిన చిత్రమిది.ఈ సందర్భంగా దర్శక నిర్మాత చంద్ర సిద్ధార్థ్ మాట్లాడుతూ, ''భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత పొడవైన టైటిల్ ఇది.నా స్నేహితుడైన మదన్‌తో ఈ కథను సినిమా గా చేద్దామనుకున్నాము. ఇది మదన్ చనిపోయే ముందు చివరిగా ప్లాన్ చేసిన సినిమా. నేను అప్పట్లో మదన్ కథతోనే 'ఆ నలుగురు' సినిమా తీశాను. ఈ సినిమా కథ విషయానికి వస్తే, ప్రతి రోజూ రాత్రి సరిగ్గా పదిన్నర గంటలకు ఓ రేడియో స్టేషన్ నుంచి ఒకే పాట ప్రసారమవుతూ వుంటుంది. నెమలిపాలెం నుండి రమ, జ్యోత్స్న, నందు, మురళి, కబీర్, ఢోల్ రవి మొదలగువారు ఈ పాటను కోరుతూ వుంటారు. అందుకే ఈ సినిమాకి 'నెమలిపాలెం నుండి రమ, జ్యోత్స్న, నందు, మురళి, కబీర్, ఢోల్ రవి మొదలగువారు' అనే టైటిల్ పెట్టాను. ధ్వని, న్యూరోసైన్స్, జ్ఞాపకాలు, అపరాధ భావన, ప్రేమ వంటి అంశాలను మేళవిస్తూ రూపొందిన ఈ హైకాన్సెప్ట్ సైకలాజికల్ థ్రిల్లర్ ప్రేక్షకులకు భిన్నమైన అనుభూతిని అందించడానికి ప్రయోగాత్మకంగా చేసిన ప్రయత్నం ఇది.ఈ సినిమాలో సంగీతానికి ఎంతో ప్రాధాన్యం వుంది. ఇందులో నాలుగు పాటలున్నాయి. జే రెక్స్ సంగీతాన్ని సమకూర్చారు. ఈనెల 18న ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం'' అన్నారు.హర్ష, అమైరా గోస్వామి, సుజనా రెడ్డి, ఇనాయా సుల్తానా, రవివర్మ అనిరుధ్ శ్రీవాస్తవ, అశోక్‌వర్ధన్, రేఖా నిరోషా, సన్నీ, గిరి తదితరులు నటించిన ఈ చిత్రానికి కథ: మదన్, సంగీతం: జే రెక్స్, పాటలు: చంద్ర సిద్ధార్థ్, మాటలు: పులగం చిన్నారాయణ, ఆర్ట్: అంజి కొయ్యల, సినిమాటోగ్రఫీ: సామ్ సుప్రీత్ , ఎడిటింగ్: బొబ్బిలి భానుప్రకాశ్, గిరిధర్, సహ నిర్మాతలు: అగస్త్య మంజు, సాగర్, మహి, సమర్పణ: వై.వి.సత్యనారాయణ రాజు, నిర్మాత – స్క్రీన్ ప్లే – దర్శకత్వం: చంద్ర సిద్ధార్థ్.



# లేబర్ కోడ్‌ల రద్దుకు కార్మికులు ఏకమై ప్రతిఘటించాలి



ప్రజాపక్షం/కరీంనగర్

కార్మికుల హక్కుల సాధనకు పోరాటాలే మార్గమని.. చరిత్ర అదే చెబుతుందని..ప్రస్తుతం అమలులో ఉన్న హక్కులు ఎన్నో పోరాటాలు.. ఎంతో మంది అమరుల త్యాగాల ఫలితంగానే సాధించుకున్నామని ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ తెలిపారు. కార్మికులు సాధించకున్న హక్కులను, చట్టాలను కాలరాసే పనిలో దేశంలోని పాలకులు ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు కరీంనగర్‌లో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా భారీ ర్యాలీ నిర్వహించారు. నగరంలోని అంబేద్కర్ స్టేడియం నుంచి ప్రారంభమైన ర్యాలీ తెలంగాణ చౌక్ లోని సర్కస్ గ్రౌండ్ వరకు సాగింది. అనంతరం సర్కస్ గ్రౌండ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో వక్తులు ప్రసంగించారు. బహిరంగ సభకు ఎఐటియుసి నేత మహ్మద్ యూసుఫ్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా అమర్‌జీత్ కౌర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎఐటియుసి అనేది కేవలం ఒక పేరు మాత్రమే కాదని, ఇది కేవలం జెండా మాత్రమే కాదని.. ఈ దేశ కార్మికుల చరిత్ర అని.. మన దేశ శ్రామికుల జీవితాలతో ముడిపడి ఉన్న జెండా అని.. కార్మిక ఉద్యమమే యావత్ ప్రపంచానికి మానవ హక్కుల పాఠాన్ని నేర్పిందని గుర్తుచేశారు. 14 గంటలు, 18 గంటలు, 20 గంటలు కష్టపడి పనిచేసినా కడుపునిండా తిండి దొరకని పరిస్థితి, భద్రత లేని స్థితి నుంచి 8 గంటల పని విధానం కోసం ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్నామని అన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం మొట్టమొదట ఆ హక్కునే లాక్కుంటోందని, ప్రపంచవ్యాప్త కార్మికులు, మన దేశ కార్మికులు చేసిన శ్రమను, త్యాగాలను చెత్తబుట్టలో వేస్తోందని, సమ్మె చేసే హక్కును లాక్కోవడం, నిర్ణీత పని గంటలను రద్దు చేయడం, సామాజిక భద్రతను దూరం చేయడం, పని ప్రదేశంలో భద్రత కల్పించకపోవడం, వేతనాలు పడిపోతున్నా పట్టించుకోకపోవడం చేస్తోందని ఆరోపించారు. కార్మికుడు సృష్టించిన సంపదను అదానీ, అంబానీలకు, ప్రపంచ, దేశీయ కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేసే మార్గంలో ఈ ప్రభుత్వం పయనిస్తోందని విమర్శించారు. కార్మిక చట్టాల స్థానంలో నూతనంగా నాలుగు లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టి కార్మికుల హక్కులను పూర్తిగా కాలరాసే పనిలో ఉన్నారని, వాటి రద్దు కోసం కార్మిక లోకం ఏకమై ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. సైమన్ కమిషన్, క్విట్ ఇండియా వంటి ఉద్యమాల్లోను ఏఐటీయూసి పాత్ర మరువ లేనిదని గుర్తు చేశారు. ప్రజలందరూ కుల మతాలకతీతంగా భారతీయులుగా దేశం కోసం, హక్కుల కోసం పోరాడుతున్నప్పుడు ఆర్‌ఎస్‌ఎస్ ఏం చేసిందో.. ఆర్‌ఎస్‌ఎస్ అయిన నరేంద్ర మోదీ సమాధానం చెప్పాలన్నారు. దేశంలో 70 శాతం జనాభా 35 ఏళ్లలోపు యువత అని,వారికి సరైన విద్య, ఉపాధి లేక యువత అల్లాడుతోతున్నారని, అందుకే జంతర్ మంతర్ వద్ద ఉద్యమాలు పుట్టుకొచ్చాయన్నారు.

**ప్రతి రంగంలో కార్మిక సంఘాలను బలోపేతం చేయాలి : కూనంనేని**



సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ, సృష్టి ఉన్నంతకాలం కమ్యూనిజం ఉంటుందని అన్నారు. ఎర్రజెండా ఉన్నంత కాలం ప్రజా, కార్మిక పోరాటాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. కమ్యూనిస్టులు ఎప్పుడూ పోరాటాల నుంచి వెనక్కి తగ్గరని, రాజకీయ పొత్తులు, రాజకీయ పరిణామాలు ఎలా ఉన్నప్పటికీ పొత్తులు పొత్తులే, పోరాటం పోరాటమే అని అన్నారు. కార్మికుల సమస్యలపై రాజీ లేకుండా పోరాటాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఆర్టీసీతో పాటు వైద్య, బ్యాంకింగ్, సేవారంగం తదితర అన్ని రంగాల్లో కార్మిక సంఘాలను బలోపేతం చేయాలని కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. తదుపరి మహాసభ నాటికి ప్రస్తుతం సంఘాలు లేని రంగాల్లో కూడా సంఘాలను ఏర్పాటు చేసి, వంద నుంచి నూట యాభై వరకు కొత్త కార్మిక సంఘాలను నిర్మించాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని అన్నారు. ప్రతి సంఘంలో ఏఐటీయూసీ గొంతు వినిపించాలని, ప్రతి కార్మికుడి సమస్యపై ఏఐటీయూసీ ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు.

**కార్మిక హక్కుల సాధనకు రణభేరి మోగిస్తాం: చాడ**

కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో, కార్మిక హక్కుల సాధనలో ఏఐటీయూసీ అగ్రగామిగా నిలిచిందని కొనియాడారు. కార్మికులు ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న 44 చట్టాలను రద్దు చేసి, నరేంద్ర మోదీ ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లుగా మార్చడం దుర్మార్గమని మండిపడ్డారు. దీనివల్ల సమ్మె చేసే హక్కు, ప్రశ్నించే గొంతుక లేకుండా పోతున్నాయని, వెంటనే ఈ నాలుగు కోడ్లను రద్దు చేయకపోతే తాడోపేడో తేల్చుకునే సార్వత్రిక పోరాటాలకు కార్మిక సంఘాలు సిద్ధమవుతాయని హెచ్చరించారు.



అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన పథకం వర్కర్లు, హమాలీలు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస ఉద్యోగ భద్రత లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి జీవితాలతో ఆడుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యం, విద్యా రంగాల్లో కూడా ఔట్‌సోర్సింగ్ పెట్టి దోపిడీ చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో సుమారు 25 వేల మంది పేర్లతో బోగస్ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు జీతాలను స్వాహా చేస్తున్నాయని, పనిచేసే కార్మికులకు మాత్రం న్యాయమైన వేతనాలు అందడం లేదని ఆరోపించారు. ఈ దోపిడీపై ప్రభుత్వం కబోదిలా వ్యవహరిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు అనభేరి ప్రభాకర్ రావు రక్తం చిందించిన కరీంనగర్ గడ్డపై నుంచే కార్మిక హక్కుల పరిరక్షణ కోసం రణభేరి మోగిస్తామని పిలుపునిచ్చారు.

**కమ్యూనిస్టు పార్టీలన్నీ ఏకం కావాలి : ఆర్. నారాయణమూర్తి**



ప్రముఖ సినీ నటుడు, దర్శకుడు ఆర్. నారాయణ మూర్తి మాట్లాడుతూ కరీంనగర్ పోరాటాలకు, విప్లవాలకు కేరాఫ్ అడ్రస్ అని, తెలంగాణ సాయుధ పోరాటంలో అనభేరి ప్రభాకరరావు, బద్దం ఎల్లారెడ్డి వంటి ఎందరో యోధులు ప్రాణ త్యాగం చేసిన నేల ఇదని కొనియాడారు. భూగర్భంలో ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్న సింగరేణి కార్మికులను 'చీకటి సూర్యులు'గా అభివర్ణిస్తూ, దేశ నిర్మాణంలో కార్మికులదే కీలక పాత్ర అని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, బీడీ, సిరిసిల్ల చేనేత, హమాలీ కార్మికులు సమాజానికి విశేష సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ దేశ సంపదను తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ ఆస్తుల ప్రైవేటీకరణను అడ్డుకోవాలని, శ్రమకు తగిన వేతనం సాధించేందుకు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు కార్మికులంతా ఏకమై పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. కమ్యూనిస్ట్ పార్టీలన్నీ పూర్వం పిడికిలి బిగించినట్లు ఒక్క తాటిపై ఒకే కమ్యూనిస్ట్ పార్టీ ఉన్నట్లు ఇప్పుడు కూడా విడి విడి గా ఉన్న అన్ని కమ్యూనిస్ట్ పార్టీలు ఏకమై ఒకే పార్టీ గా ఉండ డానికి కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు.

**కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం తప్పదు: బాలరాజు**



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం చేస్తామని ఏఐటీయూసీ ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలరాజు స్పష్టం చేశారు. స్వాతంత్ర్యానికి పూర్వమే ఏర్పడిన ఏఐటీయూసీ అనేక ఉద్యమాల ద్వారా కార్మిక చట్టాలను సాధించిందని గుర్తుచేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చేందుకు యత్నిస్తుండగా, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం వాటికి నిబంధనలు (రూల్స్) రూపొందిస్తూ కార్మికుల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు కేవలం రూ.3 వేల వేతనం ఇవ్వడం శోచనీయమని, ప్రజాప్రతినిధులు లక్షల్లో జీతాలు తీసుకుంటూ కార్మికుల శ్రమను గుర్తించకపోవడం దారుణమన్నారు. అంగన్‌వాడీ, ఆశా, వైద్య రంగాల్లోని కాంట్రాక్ట్ వర్కర్లు తీవ్ర దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల మున్సిపల్, ఇతర కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు తగ్గించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. కాంట్రాక్ట్ వ్యవస్థ ద్వారా ధనవంతులను మరింత ధనవంతులుగా మారుస్తున్నారని మండిపడ్డారు. ఈ సమస్యలన్నింటిపై రాబోయే మహాసభల్లో కీలక తీర్మానాలు చేసి, కార్మిక వర్గానికి అండగా నిలబడి పెద్దఎత్తున ఉద్యమాలు నిర్మిస్తామని బాలరాజు హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, ఏఐటీయూసి జిల్లా కార్యదర్శి సమ్మయ్య, జిల్లా అధ్యక్షుడు బుచ్చన్న,ఏఐటియూసీ రాష్ట్ర నాయకులు ప్రేం పావని, కరుణ, దేవేందర్ రెడ్డి, నారటి ప్రసాద్ ఇమ్రాన్, సునీల్, దాసు, ప్రజాసంఘాల నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# దాడులు

(మొదటి పేజీ తరువాయి)

లక్ష్యాలపై ప్రతీకార దాడులు చేసింది. గురువారంనాడు దక్షిణ ఇరాన్‌లో ఒక వివాహ వేడుకపై అమెరికా చేసిన దాడిలో నలుగురు మరణించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తామని, దీనిపై తమకు సందేహాలున్నాయని అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి. వాన్స్ అన్నారు. అంతకుముందు మంగళవారం సిరిక్‌లో ఒక వివాహ వేడుకలో యుద్ధ శకలాలు పడ్డాయి. దీనిని ఇరాన్ యుద్ధనేరంగా ప్రకటించిందని మానవతావాద సంస్థ రెడ్ క్రెసెంట్ సొసైటీ పేర్కొంది. ఇరాన్ జలాల్లో లంగరు వేసి ఉన్న చమురు నౌకల పై దాడులను ఆ దేశ విదేశీమంత్రిత్వశాఖ తీవ్రం గా ఖండించింది. అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధం గా అమెరికా దాడులు చేసిందని విమర్శించింది.

**యుద్ధం కాదు..సైనిక ఘర్షణ: ట్రంప్**

శనివారం ఇరాన్ చేసిన దాడులపై ట్రంప్ ఎలాంటి వ్యాఖ్యా చేయలేదు. కానీ ఇరాన్‌తో జరుగుతున్నది యుద్ధం కాదని పునరుద్ఘాటించారు. ''ఇది యుద్ధం కాదు,నేను దీనిని సైనిక ఘర్షణగా పిలుస్తాను, ఇది మాకు చాలా చిన్న విషయం, పెద్ద విషయం కాదు'' అని తేలికగా కొట్టిపారేశారు. సైనిక ఘర్షణలు అడపాదడపా జరుగుతూనే ఉన్నాయన్నారు. ఒక విదేశంపై యుద్ధం చేయాలంటే అమెరికా కాంగ్రెస్ చట్టసభలు తీర్మా నం ద్వారా దేశాధ్యక్షుడికి అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. అందుకే ఆయన దీనిని సైనిక ఘర్షణగా పిలుస్తున్నారు. కాగా, ''అమెరికా నౌకలపై దాడులు చేస్తే ఇరాన్ చమురు ట్యాంకర్లను ముంచేస్తాం,ఇది చాలా సులభం'' అని అమెరికా యుద్ధ మంత్రి పీట్ హెగ్సెత్ ప్రకటించిన తర్వాత ఇరాన్ ప్రతీకార దాడులు చేసి సవాలు విసిరింది. శనివారం తమ ట్యాంకర్‌పై అమెరికా జరిపిన దాడిలో ఎవరూ గాయపడలేదని ఇరాన్ ప్రభుత్వ మీడియా సంస్థ 'ఐరిబ్' తెలియజేసింది. ఒమన్ తీరంలో రెండు చమురు ట్యాంకర్లపై అమెరికా జరిపిన దాడి నుండి తప్పించుకుని సిబ్బంది లైఫ్ బోట్లలో ఒడ్డుకు చేరుకున్నారని ప్రకటించింది. అనధికార మార్గాలలో ప్రయాణం చేస్తున్న మూడు నౌకలపై ఇరాన్ సైన్యాలు దాడులు చేసినట్లు ఐరిబ్ ప్రకటించింది. దక్షిణంవైపు అక్రమ మార్గంలో నౌకలు ప్రయాణం చేస్తే దాడులు తప్పవని ఐఆర్‌జిసి హెచ్చరించింది. పశ్చిమాసియాలో ఈ ఏడాది ఫిబ్రవరినెలాఖరున యుద్ధం మొదలైన తర్వాత హోర్ముజ్ జలసంధిని ఇరాన్ స్వాధీనం చేసుకుంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com